www.andhrajyothy.com
Aanjan Path Labs & ALLERGY TESTING CENTRE AFFORDABLE ACCURACY
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Aanjan Path Labs & ALLERGY TESTING CENTRE AFFORDABLE ACCURACY

శుక్రవారం | 6-12-2019 | పేజీలు: 14 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 231 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: దశమి తె. 6.35 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 10.58 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ. 6.52-8.39; దుర్ముహూర్తం: ఉ. 8.48-9.32, మ. 12.28-1.12; అమృతఘడియలు: సా. 5.36-7.23; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 5.37 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


## ఇప్పుడు మీరు అలర్జీ పరీక్ష చేసుకోండి

### సగం కంటే తక్కువ ధరకే

### ఒక రక్త పరీక్ష అలర్జీకి గల మూల కారణాన్ని నిర్ధారిస్తుంది

**విజయవాడ, విసన్నపేట, తిరువూరు, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు, మైలవరం వద్ద**

**రక్త పరీక్షల ద్వారా అలర్జీలను కనుగొనవచ్చును, ఇది సకాలంలో అలర్జీలకు చికిత్స పొందుటలో సహాయపడుతుంది.**

అంజన్ పాత్ ల్యాబ్స్ యొక్క కలెక్షన్ సెంటర్లు **విజయవాడ, విసన్నపేట, తిరువూరు, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు, మైలవరం లోని** అలర్జీ టెస్టింగ్ సెంటర్ 50 శాతం కంటే ఎక్కువగా డిస్కౌంట్‌తో రాయితీ ధరలలో అన్ని రకాల అలర్జీ (Allergy) (ఆహారం, చర్మం, ఇన్‌హలంట్, కాంప్రహెన్సివ్) ల కొరకు అలర్జీ పరీక్ష నిర్వహిస్తున్నాయి. అందులో 70-80 అలర్జెన్స్ కలిగి ఉంటాయి. సదరు పరీక్షలు **డిసెంబరు 6, 7, 8 & 9న ఉ.9.00 గం.ల నుండి సా 5.00 గం.వరకు** నిర్వహించబడతాయి. ఈ పరీక్షలు నాలుగు రోజులకు సగం ధర కంటే తక్కువ ధర కలిగి ఉంటాయి.

ఇంతకుముందు స్కిన్ ప్రిక్ టెస్ట్ చేయబడేది. రోగి ఏ రకమైన అలర్జీ (Allergy) నుండి బాధపడుతున్నారో, ఏ అలర్జెన్స్ దానికి కారణమవుతుందో తెలుసుకోవడానికి చేతిపై 98 చోట్ల చిన్న రంధ్రాలు చేయబడేవి. అయితే ఇప్పుడు ఒక రక్తపరీక్ష శాంపిల్ ద్వారా దానిని సులభంగా పరీక్షించవచ్చును. ఈ పరీక్ష ఫాడియా 250, యురోబ్లాట్ వన్ వంటి ప్రత్యేకమైన యంత్రాల ద్వారా నిర్వహించబడుతుంది. అవి మా ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నాయి.

### అలర్జీ లక్షణాలు

- చర్మం ఎర్రబారుట
- చర్మంపై దద్దుర్లు/దురద
- చర్మంపై ఎర్రని కురుపులు
- ముఖం, పెదవులు వాయుట
- కడుపు నొప్పి
- డయేరియా
- గొంతు నొప్పి, దగ్గు
- ఎగ్జిమా
- శ్వాస తీసుకొనుట కష్టతరమగుట
- యుర్టికేరియా
- అలర్జిక్ రినైటిస్ (స్నీజింగ్)

## డిసెంబరు 2019 6, 7, 8 & 9 న

**డా.అమర్‌కొల్ల** - అలర్జీ(Allergy) ఒక విధమైన రుగ్మత. అయితే దీనిని ప్రజలు ఇలా పరిగణన లోనికి తీసుకోవడం లేదు. ఒక వ్యక్తికి ఒకసారి అది సోకితే అది ఇబ్బందులకు కారణం అవుతుంది.ఒక వ్యక్తికి కొన్ని సువాసనలు పడకపోతే, అతనికి పువ్వులంటే అలర్జీ అని అనుకొనవచ్చును. ప్రజలు తమ పెంపుడు జంతువుల ద్వారా కూడా అలర్జీకి గురి అవుతారు. ఒకసారి ఈ అలర్జీలను గుర్తించడం జరిగితే, అది ప్రభావవంతమైన చికిత్సకు దారి తీయవచ్చును. వీటికి చికిత్స చేయవచ్చును. ముందు జాగ్రత్త కూడా తీసుకోవచ్చును. **అలర్జీ చికిత్స కోసం రోగ నిర్ధారణ ఒకటే మార్గం.**

**డా.శ్రీవత్స** - అలర్జీలు రాకుండా చూసుకోవాలి ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారి జీవితంలో అనేక సమస్యలకు ఇవి కారణం కాగలవు. అలర్జీలు సీజనల్. ఒక వ్యక్తి నిర్దిష్టమైన ఒక సీజనల్ అలర్జీ(Allergy)తో బాధపడుతుంటే, అది బాధను ఇంకా పెంచుతుంది. కనుక వెంటనే అతను/ఆమె డాక్టరును సంప్రదించవలెను. అలర్జీ వలన కలిగే వ్యాధులను వెంటనే నిర్ధారించుకోవాలి. అలా చేయడం వలన వాటికి చికిత్స చేసి ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చును. అలర్జీని నిర్ధారిస్తే రోగికి మంచి చికిత్స అందించడానికి డాక్టరుకు సులభతరం అవుతుంది.

### అలర్జీల చికిత్స

ఒకసారి నిర్ధారించబడిన అలర్జీలను నిర్దిష్ట ఆహార పదార్థాల నివారణ ద్వారా గానీ లేదా మందుల సహాయంతో గానీ చికిత్స చేయవచ్చును. ఔషధ ప్రయోగాలు యాంటీ-అలర్జెన్స్ కావచ్చును. లేదా నిపుణులైన వైద్యులచే ఏర్పాటు చేయబడిన ఇమ్యునోథెరపీగా పిలువబడే ప్రత్యేక చికిత్స కావచ్చును. అవి అలర్జీలు పూర్తిగా తగ్గటానికి సహాయం చేస్తాయి.

### అలర్జీకి మీరు పరీక్ష చేసుకోండి & పొందండి

## ఉచితం విటమిన్ B 12 & విటమిన్ D టెస్ట్

జెరత్ పాత్ ల్యాబ్స్ & అలర్జీ టెస్టింగ్ సెంటర్, భారతదేశంలో అలర్జీ టెస్టింగ్ కోసం మొదట NABL గుర్తింపు పొందిన ల్యాబ్‌లలో ఒకటి. జెరత్ పాత్ ల్యాబ్స్‌లలో అంజన్ పాత్ ల్యాబ్ ఒక కో కంపెనీ. ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలోని 14 రాష్ట్రాలలో JPL సేవలందిస్తోంది. మరియు APL ద్వారా దక్షిణ భారత దేశంలోని ప్రాంతాలు అనగా తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో ఇది ప్రవేశించింది.

### అలర్జీ అంటే ఏంటి ?

పురుషుడు లేదా స్త్రీకి అన్య పదార్థాల ద్వారా కలిగే ప్రేరణలను సహించేందుకు కొంత శక్తి కలిగి ఉంటుంది. అయితే కొన్ని పదార్థాలు ఒక వ్యక్తి రోగనిరోధక శక్తిపై అసాధారణ ప్రతిచర్యకు కారణం అవుతాయి. అదే అలర్జీ (Allergy)కి కారణం అవుతుంది.



ఇంతకుముందు, స్కిన్ ప్రిక్ టెస్ట్ నిర్వహించబడేది అందులో రోగి ఏరకమైన అలర్జీ (Allergy) నుండి బాధపడుతున్నాడో ఏ అలర్జెన్లు అయితే దానికి కారనం అవుతున్నాయో తెలుసుకోవడానికి చేతిపై 98 చోట్ల చిన్న రంధ్రాలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఒక రక్తం నమూనాతో దానిని తేలికగా పరీక్షించవచ్చును.

### అలర్జీ (Allergy)కి గల కారణాలు

మన దైనందిన జీవితంలో మన చుట్టుప్రక్కల ఉన్న అనేక విషయాలు అలర్జీకి కారణమవుతాయి.

**గాలి ద్వారా సోకే అలర్జీలు,** పుప్పొడి, జంతువుల ధూళి తవుడు పురుగుల దుమ్ము మరియు బూజు మొదలగునవి.

**కొన్ని రకాల ఆహారాలు,** ముఖ్యంగా బఠాణీలు, చెట్ల గింజలు, గోధుమ, సోయ్, చేప, షెల్ ఫిష్, గుడ్లు మరియు పాలు.

తేనెటీగ లేదా కందిరీగ వంటి **కీటకాలు కుట్టడం వలన.**

**మిమ్మల్ని తాకేటువంటి లేటెక్స్ లేదా ఇతర పదార్థాలు** అలర్జిక్ చర్మ ప్రతి చర్యలకు కారణం అవుతాయి.

**ఒక రక్త నమూనా వలన ఎటువంటి అలర్జీని అయినా కనుగొనవచ్చును. దానిని కొన్ని రోగనిరోధక- బూస్టర్స్, యాంటీ-అలర్జిక్ మందులతో మరియు ఇమ్యునో-థెరపీ ద్వారా కూడా చికిత్స చేయవచ్చును.**

ఆస్తమా రోగ చరిత్ర కలిగిఉండటం, శ్వాస తీసుకొనుట, దగ్గు మరియు ఆయాసంతో బిగ్గరగా రొప్పుట (Wheezing) దగ్గుతో బాధపడుతున్న 12 ఏళ్ల బాలికను ఒక ఉదాహరణగా తీసుకుంటే, ఆమె శ్వాస క్రియ రోగలక్షణాలకు స్పష్టమైన కారణం లేదని రిపోర్టుల ద్వారా తెలిసింది. ఆమె ఆస్తమా చికిత్స కోసం ఒక ఫిజీషియన్‌ను సంప్రదించింది. మంచి మందులు ఇచ్చినప్పటికీ కూడా ఆమె పూర్తిగా కోలుకోలేదు.బఠాణీలు, శెనగ గింజలు, కాయ ధాన్యాలు తినడం వలన శ్వాసలో ఇబ్బంది, దురద వంటి అనారోగ్యాలకు గురి అయ్యేది. గతంలో ఆమెకు వచ్చే దగ్గు సీజనల్‌గా వచ్చేది. అది పుప్పొడి, గడ్డికి సంబంధమైనదిగా ఉండేది. ఆమెకు బ్లడ్ అలర్జీ పరీక్ష చేస్తూ రోగ నిర్ధారణ జరిగింది. ఇమ్యునో-థెరపీ ద్వారా, కొన్ని యాంటీ- అలర్జిక్ మందుల ద్వారా చికిత్స చేయబడింది. ఆ తర్వాత ఆమెకు స్వస్థత చేకూరింది. ఎవరికైనా శ్వాస పీల్చుకోవడంలో సమస్యలు ఏర్పడితే అప్పుడు అతనికి/ఆమెకు అలర్జీ టెస్ట్ చేయించాలి. ఒక సారి అలర్జీ (Allergy) ఉందని నిర్ధారణ జరిగితే సగం సమస్య తీరుతుంది. ప్రత్యేక నిపుణుల డాక్టర్ల ప్యానల్ తోడ్పాటుతో, తగిన వైద్య విధానాలతో సరైన చర్య తీసుకోవడానికి వారి అలర్జీకి చికిత్స చేయడానికి ఇది సహాయకారి అవుతుంది.

**యూరోబ్లాట్ అండ్ ఫాడియా ఉపయోగిస్తూ అటువంటి అలర్జీల నిర్ధారణకు మా ప్రఖ్యాత డాక్టర్ల ప్యానెల్ ప్రత్యేకంగా శిక్షణ పొందింది.**

**ECHS/ESI/CGHS కార్డుదారులకు అదనపు డిస్కౌంట్**



EUROBlotOne



PHADIA 250




ప్రపంచ ప్రఖ్యాత ఆధునిక మెషీన్ల ద్వారా పరీక్షించబడింది

Contact Us For Test — Aanjan Path Labs & ALLERGY TESTING CENTRE AFFORDABLE ACCURACY

CORPORATE OFFICE : Plot No. - 29A ARK Colony (Anantha Ramakrishna Iyyer Colony) Eldams road, Teynampet Chennai.

| | | | |
|---|---|---|---|
| **VISANNAPETA**<br>9640503065, 8328054122<br>Appollo Diagnostics, Bus Stand Back Side, Govt. Hospital Road, Visannapeta | **TIRUVURU**<br>9948849218, 7569569999<br>Satya Kiran Diagnostic Centre, Bosu Bomma Bus Stop Centre, S.K.P. Complex, Beside S.B.I (A.T.M) | **VIJAYAWADA**<br>9160627689, 9393797239<br>Aruna Sai Diagnostics, Main Road Meeseva Beside Cheruvu Centre Vidhya Dara Puram, Vijayawada | **GUDIVADA**<br>9704359435, 9704648435<br>Star Diagnostics, Shop No. 1, Sri Rambabu Complex, Near Dr. V. Subrahmanyeswara Rao Gari Hospital, Pamarru Road |
| **MACHILIPATANAM**<br>9989462846, 8008852969<br>Darwin Diagnostic Centre, Opp. Income Tax Office, Parasupet, Machilipatnam | **VUYYURU**<br>9490743532, 08676-232655<br>Krishnapriya Laboratory, 8-126-2, Katuru Road, Vuyyuru, Krishna Dist. | **VIJAYAWADA**<br>9440682183, 9030045556<br>Sri Venkateswara Diagnostics, Door No.10-87, opp.coastal Bank, Ashok Nagar | **MYLAVARAM**<br>9618405545, 8465955881<br>Vijayalakshmi X-Ray, E.C.G & Laboratory, Main Road, Venkateswara theater beside |

**HELPLINE : 63838-48063, 95000-53404, 97910-13389**

## మంత్రాణాం మాతృకా దేవీ.. శబ్దానాం జ్ఞానరూపిణీ





పరంజ్యోతి

'అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలా పెద్దమ్మ..' అయిన ఆ ఆదిపరాశక్తి గురించి 'శ్రీదేవీ ఉపనిషత్తు' అద్భుతంగా వర్ణిస్తుంది. అందులో అమ్మవారిని అజ్ఞేయ, అనంత, అలక్ష్య, అజ, ఏక, అనేక, జ్ఞానస్వరూపిణి, చిన్మయాతీత, శూన్యాశూన్యస్య సాక్షిణీ.. అని వర్ణించే శ్లోకం ఉంది. దేవతల ముందు దేవి ప్రత్యక్షమైన సందర్భంలోని శ్లోకమిది. 'ప్రత్యక్షము' అంటే.. ప్రకటితమైంది లేదా ప్రకటింపబడింది. ఏది ప్రకటితమవుతుంది?.. ఉన్నది మాత్రమే ప్రకటిత(ప్రత్యక్ష)మవుతుంది. అలా ప్రత్యక్ష మయిన ఆ తల్లి రూపాన్ని బ్రహ్మాదులు కూడా తెలుసుకోలేరు. కాబట్టి ఆ తల్లి అజ్ఞేయ. ఆమెకు ఆది, అంతములు లేవు కాబట్టి.. 'అనంత'. ఇంద్రియ జ్ఞానం చేత ఆ దేవి ఉనికిని గ్రహించలేము కాబట్టి.. ఆమె 'అలక్ష్య'. ఆమె పుట్టుక గురించి.. తల్లిదండ్రుల గురించి తెలియదు కాబట్టి ఆమె అజ. అంతటా ఆమెయే నిండి ఉన్నది కాబట్టి, ఆమె కంటే భిన్నమైనది లేదు కాబట్టి.. ఆమె 'ఏక'. ఆమెయే శక్తి రూపంలో విశ్వవిశ్వాంతరాల్లో నిండి ఉంది కాబట్టి.. ఆమె 'అనేక'. అన్ని అక్షరాలకూ ఆమె మాతృక రూపం. శబ్ద బ్రహ్మం ద్వారా జ్ఞానం పొందుతాం కాబట్టి ఆమెయే 'జ్ఞాన స్వరూపిణి'.

ఈ అంశాలను ఒక్కసారి పరిశీలనగా చూస్తే.. స్టీఫెన్ హాకింగ్ తన 'బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' అనే పుస్తకంలో శక్తి గురించి చెప్పిన అంశాలకు పోలిక కనపడుతుంది. అందులో ఆయన.. 'సృష్టి ఉన్నది' అంటాడు. ఎవరు చేశారు? ఎలా జరిగింది? అనేదాని కన్నా.. 'ఉన్నది' అన్నదే ప్రధానమైనది. ఏదైతే ఉన్నదో అది ఎప్పుడూ ఉంటుంది. అది నశించదు. అవసరానుగుణంగా రూపాలు మార్చుకుంటూ ప్రసారమవుతుంది. దానినే మనం 'ఆదిశక్తి' అంటున్నాం. ఆ ఆదిశక్తే మొట్టమొదటిది. అది అంతటా నిండి ఉంది. శక్తికి రెండు రూపాలు. అవి.. ధనాత్మక, రుణాత్మక రూపాలు. అవే స్త్రీ, పురుష శక్తులు. మనందరిలోనూ ఈ రెండు శక్తులూ ఆవిష్కృతమై ఉన్నాయి. సృష్టిలోని ప్రతి అణువులో శక్తి నిండి ఉంటుంది. అది పదార్థం, ప్రాణం, జంతు, మానవ రూపాల్లో సృష్టిగా ప్రకటితమైంది. కాబట్టి ఆ శక్తి(ఆదిపరాశక్తి).. 'ఏక'. అనేక రూపాలలో ప్రకటితమైంది కాబట్టి ఆమె 'అనేక'. ఏకం, అనేకం ఎందుకవుతుంది? ఎప్పుడవుతుంది? అంటే.. శక్తి ఎప్పుడూ ఒక రూపం నుండి మరొక రూపంలోకి, అవసరానుగుణంగా మారుతుంది. ఇంద్రియ జ్ఞానం ద్వారా ఆమెను (శక్తిని) తెలుసుకోలేము కాబట్టి ఆమె 'అలక్ష్య'.



'మన్యతే సత్క్రియతే యేన మంత్రః' అన్నారు. దేనిని మననం చేయడం వల్ల శ్రేయస్సు కలుగుతుందో అది మంత్రం. ఒకే అంతరంలో అక్షరాలను మననం చేయడం ద్వారా అంతర్గత ధ్వని శక్తి ఒక రూపంలో నుండి మరొక రూపంలోకి మారి అక్కడి నుండి లక్షిత మార్గంలో ప్రసారం అవుతుంది. దాన్నే మంత్రంగా చెప్పుకొంటాము. అంటే.. అంతర్గతమైన ఆ ఆదిశక్తియే మంత్రానికి 'మాతృక' అవుతుంది. శాబ్దిక రూపంలో, ఉపాసనా మార్గంలో, అక్షరాలను అలా నిర్ణీత అంతరాలలో ఉచ్చరించడం ద్వారా పొందిన జ్ఞానం జగత్తులో ప్రకటితమౌతుంది కాబట్టి ఆమె 'జ్ఞానరూపిణి'. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలపై నాలుగోదైన తురీయ స్థితి.. చిన్మయ స్థితి. దానికి అతీతమైనది కాబట్టి అది 'చిన్మయాతీతం'. శక్తి రెండు గతులలో ఉంటుంది. ధన, రుణ స్థితులు కలిసినపుడు దానినే 'శూన్యం'గా చెప్తాం. అదే విడిగా ఉంటే శూన్యం అవదు కాబట్టి 'అశూన్యం' అవుతుంది. అంటే అదే శూన్యమూ అదే అశూన్యమూ అవుతుంది. రెండూ తనలో ఉన్నవే కాబట్టి దానికి సాక్షీభూతురాలు ఆ అమ్మే.

**- పాలకుర్తి రామమూర్తి, 9441666943**

# చలి వేళ ఉల్లి సెగ



**ఉదయాన్నే ఇంటిని దాటి గడగడలాడుతూ లైనులో.. నిలబడ్డ రెండు గంటల్లోనే రైతుబజార్లలో స్టాక్ ఖాళీ**

(ఆంధ్రజ్యోతి ఆన్‌లైన్ న్యూస్ నెట్‌వర్క్)

మగువ కోసం, మణులు, రత్నాల కోసం పోరాటాలు చేశారు. చివరకు పశువులు తినే గడ్డి కోసం, మనుషులు తాగే నీటి కోసమూ యుద్ధాలు చేసుకొన్నారు. రాష్ట్రంలో ఎగసిపడుతున్న 'ఉల్లి' పోరు సెగలు అలాంటి యుద్ధ వాతావరణాన్నే ఇప్పుడు తలపింపజేస్తున్నాయి. కాలే నూనెలో పడిన ఉల్లిముక్కలతో వ్యాపించే ఘుమఘుమలకు వంటిల్లు దూరమయి, పాయల కోసం రాష్ట్రానికి రాష్ట్రమే కాగిపోతున్న పరిస్థితి! క్యూలైన్లలో అంతకంతకూ పెరిగిపోతున్న తొక్కిసలాటలు కుమ్ములాటలు! వాటిని అదుపు చేయడానికి కొన్ని రైతుబజార్లలో గాలిలోకి లాఠీలూ లేస్తున్నాయి. కుటుంబానికి కిలో చొప్పున ఉల్లి ఇచ్చే రైతుబజార్లకు పోలీసులు కాపలా కాస్తున్నారు. క్యూలైన్లలో రాయితీ ఉల్లి కోసం గొడవలు పెరగడంతో, మగవారికి, ఆడవారికి వేర్వేరుగా పోలీసులు లైన్లు ఏర్పాటుచేస్తున్నారు. సెప్టెంబర్లో క్వింటా రూ. 2500-4400 ఉన్నది, గురువారం నాటికి రూ.13వేలకు చేరుకోవడంతో, ప్రభుత్వానికే కళ్లు తిరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉదయం చలిలో బయలుదేరినవాళ్లకు ఏ రాత్రికో గుప్పెడు పాయలు దొరికితే గొప్ప!

పట్టుబట్టి, లైను కట్టి రెండు రోజులు పనులు పక్కనపెడితేనే ఆ మాత్రం భాగ్యం! ఉల్లి పంటకు కర్నూలు జిల్లా అడ్డా. అలాంటి జిల్లాలో దశాబ్దాలుగా కనని ధరలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్లో బుధవారం క్వింటాల్ రూ.12,850లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అంటే.. కిలో రూ.128.50. అది హోల్‌సేల్ మార్కెట్ నుంచి రిటైల్ మార్కెట్.. అక్కడ నుంచి వినియోగదారులకు చేరేసరికి కిలో రూ.140 దాటుతోంది. నిన్న మొన్నటి వరకు కిలో ఉల్లి రూ.15 పలకగా, అది ఒక్కసారిగా రూ.150 మార్క్ కోసం పరుగులు పెట్టేస్తోంది. కర్నూలు మార్కెట్‌యార్డులో మూడ్రోజులుగా రూ.12వేల వద్ద ఉన్న రేటు, గురువారం ఉదయానికి రూ.13,010కి చేరింది. ఇది ఆల్‌టైమ్ రికార్డు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో పది రోజుల్లో క్వింటాల్ ధర రూ.15 వేలు మార్క్‌ను దాటేసినా ఆశ్చర్యపడనక్కర్లేదని అధికారుల అంచనా వేస్తున్నారు. దీంతో ఓ పక్క సామాన్యులు కొనుగోళ్లకు భయపడుతుంటే.. వ్యాపారులు మాత్రం వేలాలకు పోటీలు పడుతున్నారు. రైతుబజార్ల కోసం అధికారులు ఈ వేలాలకు మించి పాడి రైతుల నుంచి పంటను తీసుకొంటున్నారు. నిన్నటి దాకా ఉల్లి అం టే పలికేవారు లేని పరిస్థితి, ఇప్పుడు బస్తాను బండిలోంచి దించకముందే బేరాలు అయిపోతున్న పరిస్థితి! మహారాష్ట్ర, కర్ణాటకలో భారీ వరదల వల్ల ఉల్లి దెబ్బతినగా, కర్నూలులో ఈ ఏడాది ఆ రాష్ట్రాలతో పోల్చితే మంచి పంటే రైతు చేతికి అందింది. డిమాండ్ బాగా ఉండటంతో ఉదయం వచ్చిన ఉల్లి బస్తాలు మధ్యాహ్నానికే సగం ఖాళీ అవుతున్నాయి. రోజుకు వంద టన్నులు తగ్గకుండా కొనుగోళ్లు చేసి రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర రైతు బజార్లకు అధికారులు మళ్లిస్తున్నారు. కొద్ది వారాలుగా అక్కడి నుంచి తాడేపల్లి గూడెం, హైదరాబాద్ మార్కెట్ యార్డులకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు పోటీలకు దిగడంతో అధికారులకు నిత్యం వంద టన్నులు దొరకడమే కష్టంగా మారింది.

### ఇదేం పని పోలీసన్నా!

చిత్తూరు, తిరుపతి రైతు బజార్లలో రాయితీపై ప్రభుత్వం పంపిణీ చేసే ఉల్లి కోసం భారీ క్యూలు ఏర్పడ్డాయి. చిత్తూరులో పోలీసులు జనాన్ని కంట్రోల్ చేయడానికని వచ్చి.. సందట్లో సడేమియా అన్నట్లు తమకు కావాల్సినంత మేరకు ఉల్లిగడ్డలను తరలించుకుపోయారు. ఇదేమని ప్రశ్నించిన జనంపై ఒకరిద్దరు కానిస్టేబుళ్లు దౌర్జన్యం చేశారు. రెండు రోజులకోసారి 10 టన్నుల ఉల్లిగడ్డలు ఈ జిల్లాకు సరఫరా అవుతున్నాయి. గురువారం చిత్తూరులో జనం వేల సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. వచ్చిన స్టాకులో పోలీసులు.. మాజీ కార్పొరేటర్లు, అధికారుల పేర్లు చెప్పి అడ్డదారుల్లో ఒక్కొక్కరు నాలుగైదు కిలోలు పట్టుకెళ్లారు. దీనిని ప్రశ్నించిన వారిని చితకబాదారు.

**కర్నూలు యార్డులో పెరిగిన ధరల పట్టిక**

| తేదీ | రైతు ధర (క్వింటా) | హోల్‌సేల్ | రిటైల్ | కిలో ధర (సుమారు) |
|---|---|---|---|---|
| 1.11.19 | 4370 | 5244 | 6293 | 60.00 |
| 9.11.19 | 4260 | 5112 | 6134 | 60.00 |
| 16.11.19 | 4680 | 5616 | 6739 | 68.00 |
| 23.11.19 | 7010 | 8412 | 10094 | 100 |
| 30.11.19 | 7190 | 8628 | 10353 | 120 |
| 5.12.19 | 13010 | 15612 | 18734 | 150 |



చిత్తూరు రైతు బజారులో జనాన్ని నియంత్రించడంలో ఓ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించారు. మహిళ అని కూడా చూడకుండా ఆమె ఛాతీపై లాఠీని ఆనించి బలంగా నెట్టేయడం వివాదానికి దారితీసింది.

### సైజు చిన్న.. ఘాటు ఘనం

కడప జిల్లా మైదుకూరు నుంచి కృష్ణాపురం ఉల్లిని (కేపీ) మార్కెటింగ్ శాఖ అధికారులు గురువారం విజయవాడ, గుంటూరులోని రైతుబజార్లకు తరలించారు. కొర..కొర.. చూస్తున్న ఉల్లి సంక్షోభాన్ని కొంతైనా కొలిక్కి తెచ్చేందుకు ఈ ప్రయత్నం చేశారు. రైతుల నుంచి క్వింటాల్ రూ.4500లకు కొనుగోలు చేసి, కొన్ని నగరాల్లోని రైతుబజార్లకు అందించారు. రాయితీ ద్వారా ఉల్లి సరఫరా కోసం మార్కెటింగ్ శాఖ అధికారులు కర్నూలు మార్కెట్లో క్వింటాల్ రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు కొనుగోలు చేశారు. ప్రభుత్వానికి ఇది భారమే. ఈ భారాన్ని కాస్త తగ్గించుకోవడానికి కడప జిల్లాలో సాగు చేసే కృష్ణాపురం (కేపీ) ఉల్లిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రయోగాత్మకంగా పది టన్నులు విజయవాడ, గుంటూరుకు సరఫరా చేశారు. ఘాటు ఎక్కువగా ఉండి.. పరిమాణంలో చిన్నసైజుగా ఉండే ఈ ఉల్లిని మైదుకూరు ప్రాంతంలో ఎక్కువ పండిస్తున్నారు. ఎకరాకు 50 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుంది. విదేశాల్లో ఔషధ తయారీకి దీనిని ఎగుమతి చేస్తున్నారు. కర్నూలు, గుంటూరు రకం ఉల్లితో పోలిస్తే ధర బాగా తక్కువ ఉండడంతో ప్రభుత్వం కేపీ ఉల్లిని రైతు బజార్లలో పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రజల స్పందనను బట్టి, మరింతగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### పాయ కోసం పాట్లు

కడప నగరం రైతు బజారులో రాయితీ ఉల్లి కోసం గురువారం ఉదయం 6 గంటలకే జనం క్యూకట్టారు. కనీసం మూడు గంటలు లైనులో నిరీక్షిస్తేగానీ, వారికి కొంత ఊరట దొరకలేదు. రాజంపేటలో కిలో ఉల్లి రూ.140 చేరుకొంది. విశాఖలో బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.125 దాటిపోయింది. ఉల్లి కొందామంటే దొరకడం లేదంటూ మార్కెటింగ్ శాఖాధికారులు, పరిమితంగా రైతుబజార్లకు సరఫరా చేస్తున్నారు. ఆ సరకు బజారుకు వచ్చిన రెండు గంటల్లోనే ఖాళీ అయిపోతోంది. వాటిని దక్కించుకోవడం కోసం మహిళలు తెల్లవారుజామున ఐదు గంటలకే చలిలో రైతుబజార్లకు వచ్చి స్టాళ్ల ముందుకు గజగజ వణుకుతూ కూర్చుంటున్నారు. ఆ తరువాత గంటకే ఉల్లి అయిపోతోంది. ఆ తరువాత బజారకు వచ్చిన వారికి అందడం లేదు. దీనిపై వారంతా అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఎన్ని గంటలకు వస్తే...ఉల్లి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే...ముందుగా టోకెన్లు పంపిణీ చేసి, వాటిని తీసుకువచ్చిన వారికే ఉల్లిని ఇవ్వాలని కోరుతున్నారు. ఒకేసారి మహిళలు కార్యాలయంలోకి వచ్చి గందరగోళం సృష్టిస్తుండడంతో విశాఖలో అన్ని రైతుబజార్లకు పోలీసులు కాపలా కాస్తున్నారు. విజయనగరంలో ఏర్పాటుచేసిన రైతుబజారు వద్ద కట్టిన లైనులోకి చొరబడటానికి కొందరు ప్రయత్నించడం గొడవకు దారితీసింది.

### కొంత ఊరట

ఐదెకరాల్లో ఉల్లి పంట వేశాను. ఎకరాలకు 120 బస్తాల వరకు పంట అందింది. గత సంవత్సరం పంట పూర్తిగా నష్టపోయి ఒక ఎకరా అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుత ధరలతో కొంత ఊరట పొందుతున్నాను. నిన్న యార్డుకు రాగా, క్వింటా రూ.2,250కి 20 బస్తాలు అమ్మాం. మరో వంద బస్తాలున్నాయి. ఇవాళ పూర్తవుతాయి.

**- రోశన్న, రైతు, పడిదెంపాడు, కర్నూలు జిల్లా**

### ఉల్లి తినే కుటుంబం కాదు: నిర్మల

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉల్లి ధరలు సెంచరీ దాటి సామాన్యుడు సతమతమవుతుంటే.. రాజకీయ నాయకులు దానిపై తమకు తోచినట్టు వ్యాఖ్యలుచేస్తున్నారు. తమ కుటుంబం ఉల్లి, వెల్లుల్లి తినదని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అంటే.. తానెప్పుడూ ఉల్లి ముట్టనే లేదని, అలాంటి తనకు ఉల్లిపాయల ధర, పరిస్థితి గురించి ఎలా తెలుస్తుందని మరో మంత్రి అశ్వనీ చౌబే నాలుక చప్పరించారు! ఉల్లి తింటే నోరంతా కంపు కొడుతుంది కాబట్టి తినడం మానేయాలని యూపీ నేత ఆజంఖాన్ సలహా ఇచ్చారు!! నాయకులై ఉండీ ఇలా ఎవరికి వారు వ్యాఖ్యానాలు చేయడమే తప్ప.. సమస్యను పరిష్కరించే మార్గాలపై దృష్టిపెట్టట్లేదని సామాన్యులు వాపోతున్నారు.

# పవన్ X రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మా సారు (పవన్) మమ్మల్ని వెనక్కి పట్టుకుని లాగుతూ, ప్రతి ఒక్కరికీ మర్యాద ఇద్దామన్నందుకే తగ్గుతున్నాం. మమ్మల్ని వదిలేసి ఏమైనా చేయమంటే... మీ తలకాయలు నరకడానికి ఆలస్యం చెయ్యం. ఏ జనసైనికుడైనా సార్ చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నారు కానీ... మీకు భయపడి కాదు. ప్రకాశ్ రెడ్డే కాదు, జిల్లాలో ఎటువంటి రెడ్డి అయినా సరే! మేం రెడీ, మీరు రెడీనా?" అని సవాల్ విసిరారు. దీనిపై వైసీపీ నేతలతోపాటు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఘాటుగా స్పందించారు. ఈ విషయాన్ని జనసేన నేతలు సభలోనే ఉన్న పవన్ దృష్టికి తీసుకెళ్లారు. "మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టి ఉంటే సాకే పవన్ అలా మాట్లాడి ఉంటారో తెలుసుకోండి! కేసులు ఆయనపై కాదు.. నాపై పెట్టండి. మీ తలలు తీస్తామన్నందుకే మీరు అంత బాధపడుతుంటే.. మీ నాయకుడు, సీఎం జగన్ రెడ్డి.. మాజీ సీఎం చంద్రబాబును ఉరితీయాలని అన్నందుకు ఏ కేసు పెట్టాలి?" అని వైసీపీ నేతలను ప్రశ్నించారు.

### హాని జరిగితే ఊరుకోం: రెడ్డి సంఘం

'ప్రకాశ్ రెడ్డే కాదు.. ఏ రెడ్డి అయినా సరే' అంటూ జనసేన నేత చేసిన వ్యాఖ్యలను ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు తీవ్రంగా పరిగణించారు. కర్నూలుకు చెందిన సంఘం రాష్ట్రస్థాయి ప్రతినిధులు ఒక చానల్‌తో మాట్లాడారు. దీనిపై పవన్ క్షమాపణ చెప్పాలన్నారు. "రాజకీయంగా ఎలాంటి విమర్శలైనా చేసుకోవచ్చు. కానీ... కులం పేరు ప్రస్తావించడం, ఏ రెడ్డి అయినా అని సవాల్ విసరడం ఏమిటి? పవన్ కల్యాణ్ వారిని వారించకపోవడం ఏమిటి? మా ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డికి ఎలాంటి హాని జరిగినా పవన్ కల్యాణ్‌దే బాధ్యత. మీరు తల తీస్తామంటే... పవన్ తల తీసేందుకు మేమూ సిద్ధం" అని తేల్చిచెప్పారు. సాకే పవన్ చేసిన వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదులు చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం నిర్ణయించినట్లు తెలిసింది. రాప్తాడుతో పాటు జిల్లాలోని పలు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

### మళ్లీ ఫ్యాక్షన్ తెస్తారా: తోపుదుర్తి

రాప్తాడు జనసేన నేత తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి అప్పటికప్పుడు అనంతపురం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. "సాకే పవన్ వ్యాఖ్యల గురించి పవన్‌కు తెలిసి జరగలేదనుకున్నాం. కానీ, ఈ వ్యాఖ్యలను ఆయన సమర్థించేలా మాట్లాడారు. పవన్ ఈ ప్రాంతంలో కల్లోలం సృష్టించేందుకు, మళ్లీ ఫ్యాక్షన్‌ను తీసుకురావడానికే పవన్ ప్రయత్నిస్తున్నారా' అని ప్రశ్నించారు.

## ఉద్యోగాలివ్వడమంటే...

# ఉన్నవి తీసేయడమా?

- **2.80 లక్షలిచ్చారు.. 4 లక్షల మందిని తీసేశారు**
- **అవి కూడా వైసీపీ కార్యకర్తలకే**
- **టమాటాకు గిట్టుబాటు ధరేదీ?**
- **మతమార్పిడిపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు**
- **మహిళల కోసం పోరాటం: పవన్**



మదనపల్లె టమాటా మార్కెట్‌లో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

మదనపల్లె, డిసెంబరు 5: 'జగన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక 5లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామంటే ఏమో అనుకున్నాను. ప్రభుత్వాన్ని ప్రశ్నించే పని ఉండదనుకున్నాను.. ఇప్పుడు ఉద్యోగాలు పోయాయని, ఉపాధి కోల్పోయామని రోడ్డుమీదకు వచ్చేవారి సంఖ్యే ఎక్కువగా ఉంది' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. మదనపల్లె వ్యవసాయ మార్కెట్లో రైతులతో గురువారం ఆయన భేటీఅయ్యారు. అనంతరం డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. నీరుగట్టువారిపల్లెలోని చేనేతకార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయా సందర్భాల్లో పవన్ మాట్లాడారు. 'మొదట ప్రకటించిందేమో 5లక్షల ఉద్యోగాలు.. తీసేసిందేమో 4 లక్షల మందిని.. ఇచ్చింది మాత్రం 2.80 లక్షల ఉద్యోగాలు' అని ఆక్షేపించారు. రాష్ట్రంలో 36వేల మంది సంఘమిత్రలు ఉండగా.. మూడేళ్లు పనిచేసినా, 40ఏళ్లు దాటినా వారిని తొలగిస్తామని జీవో జారీచేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'జగన్‌రెడ్డికి మతమార్పిడుల మీదున్న శ్రద్ధ.. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నలపై లేదు. రైతుకు ఎక్కడ చూసినా అన్యాయమే జరుగుతోంది. టమాటా రైతుల పరిస్థితి మరీ దారుణం. వారికి లాభాలు కాదుకదా.. కనీసం గిట్టుబాటు ధర కూడా లేదు. రైతు పక్షాన నిలిచి రైతు సమస్యల్ని తెలుసుకోవడానికి వచ్చిన నన్ను అనుమతి లేదంటూ ఆపుతారా.. కట్టడి చేయాలని ఆలోచిస్తారా? అది మీవల్ల కాదు. మీ కుర్చీలను మీరే కూలదోసుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. రైతుకు న్యాయం జరిగేవరకూ పోరాడతాం' అని స్పష్టం చేశారు. 'ప్రభుత్వాలు నడవాలన్నా, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలన్నా.. మహిళలు, ముఖ్యంగా మహిళా సంఘాల లీడర్లు కీలకం. అలాంటి వారి సేవలను గుర్తించకపోవడం దారుణం. మన ఉద్యోగాలు తీసేయడానికి జగన్ సొమ్ము ఇస్తున్నారా? భారతీ సిమెంటు కంపెనీ సొమ్ములిస్తున్నారా? లేదంటే వైసీపీ ఎమ్మెల్యేల సొమ్ములేమైనా ఇస్తున్నారా? అన్ని ప్రభుత్వాలు మహిళలను పావులుగా వాడుకుని తర్వాత విస్మరిస్తున్నారు. ఇదేనా మహిళా సాధికారతంటే? మహిళలు, సంఘాలకు న్యాయం జరిగేవరకూ జనసేన పోరాడుతుంది. తమకు జరుగుతున్న అన్యాయాన్ని నాకు చెప్పుకోవడానికి వస్తున్న మహిళలను రానివ్వకుండా అడ్డుకున్నారు. మదనపల్లెలో తయారయ్యే పట్టుచీరలకు బ్రాండ్ ఇమేజ్ కల్పించేలా కృషి చేస్తా. ఇక్కడ తయారయ్యే చీరలను బయటి ప్రాంతాల్లో విక్రయిస్తూ, కంచి, బెనారస్, ధర్మవరం పేరు పెట్టడమేంటి? దేశ, విదేశాల్లో పర్యటించి చేనేత వస్త్రాలను వాడాలని ప్రచారం చేస్తా. చేనేత వృత్తి ఒక కళ. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. కేంద్రం దృష్టికి తీసుకెళ్లి.. మదనపల్లెలో చేనేత, జౌళి పార్కు ఏర్పాటుకు, సిల్కు సబ్సిడీ పెంచడానికి ప్రయత్నిస్తా.'

### ఆ మహనీయుల్లో మోదీ..

'రెండున్నర దశాబ్దాలు ఆలోచించే పార్టీపెట్టాను. చనిపోవడానికి సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చాను. ఏమీ ఆశించకుండా రాజకీయ పోరాటంలో ఉన్న మహనీయులు ఎందరో! వారిలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు.'

# ఆదివారాల్లో నాలుగు పండుగలు

- **2020 సెలవులు ప్రకటించిన ఏపీ ప్రభుత్వం**

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది(2020)కి సాధారణ, ఐచ్ఛిక సెలవులను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో 17 రోజులు సాధారణ, 18 రోజులు ఐచ్ఛిక సెలవులు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు రెండో శనివారం, ఆదివారం సెలవు అని తెలిపారు. అలాగే, ఐచ్ఛిక సెలవులను ఐదుకి మించి వాడుకోకూడదని పేర్కొన్నారు. రంజాన్, బక్రీద్, మొహర్రం, ఈద్ మిలాదున్ నబీ పండుగలకు నెలవంక కనిపించే సమయాన్ని బట్టి, ఇతర హిందూ పండుగలకు తేదీలు మారితే అందుకనుగుణంగా సెలవులో సవరణలు చేస్తారు. రిపబ్లిక్‌డే, జగ్జీవన్‌రాం జయంతి, మొహర్రం, విజయదశమి ఆదివారం, దీపావళి రెండో శనివారంనాడు వచ్చాయి. ఎన్ఐ చట్టం కింద బ్యాంకులకు 13 రోజుల పాటు సెలవులు ఇచ్చారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

| పండుగ | తేదీ | వారం |
|---|---|---|
| భోగి | జనవరి 14 | మంగళ |
| మకర సంక్రాంతి | జనవరి 15 | బుధ |
| కనుమ | జనవరి 16 | గురు |
| గణతంత్ర దినోత్సవం | జనవరి 26 | ఆది |
| మహా శివరాత్రి | ఫిబ్రవరి 21 | శుక్ర |
| ఉగాది | మార్చి 25 | బుధ |
| శ్రీరామ నవమి | ఏప్రిల్ 2 | గురు |
| బాబూ జగ్జీవన్‌రాం జయంతి | ఏప్రిల్ 5 | ఆది |
| గుడ్ ఫ్రైడే | ఏప్రిల్ 10 | శుక్ర |
| అంబేడ్కర్ జయంతి | ఏప్రిల్ 14 | మంగళ |
| రంజాన్ | మే 25 | సోమ |
| బక్రీద్ | ఆగస్టు 1 | శని |
| కృష్ణాష్టమి | ఆగస్టు 18 | మంగళ |
| స్వాతంత్ర్య దినోత్సవం | ఆగస్టు 15 | శని |
| వినాయక చవితి | ఆగస్టు 22 | శని |
| మొహర్రం | ఆగస్టు 30 | ఆది |
| మహాత్మాగాంధీ జయంతి | అక్టోబరు 2 | శుక్ర |
| దుర్గాష్టమి | అక్టోబరు 24 | శని |
| విజయదశమి | అక్టోబరు 25 | ఆది |
| ఈద్ మిలాదున్ నబీ | అక్టోబరు 30 | శుక్ర |
| దీపావళి | నవంబరు 14 | శని |
| క్రిస్మస్ | డిసెంబరు 25 | శుక్ర |

## లోకం తీరు



మేడమ్.. దీన్ని ఉల్లి అంటారు.. ఇది ఘాటుగా ఉంటుంది.. దీన్ని కూరల్లో వాడతారు. ఇది అత్యంత ఖరీదైనది...

**చలికాలం**

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 19.0 | 27.8 |
| కడప | 19.0 | 31.0 |
| గుంటూరు | 19.3 | 30.7 |
| కర్నూలు | 21.3 | 29.9 |
| చిత్తూరు | 22.0 | 29.6 |
| ఒంగోలు | 22.1 | 29.8 |
| శ్రీకాకుళం | 24.0 | 30.0 |

### తేలికపాటి వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి వీస్తున్న తూర్పుగాలుల ప్రభావంతో గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కూడా అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తరువాత వర్షాలు క్రమేపీ తగ్గుతాయని వివరించింది. కాగా ఉత్తరాది నుంచి వీస్తున్న పొడిగాలులతో ఉత్తర కోస్తాలో చలిగాలులు వీచాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఉత్తర గాలులతో విశాఖ ఏజెన్సీలో మంచు కురవడంతోపాటు చలి తీవ్రత పెరిగిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.



### ఏ ఓడనైనా సోదాచేసే అధికారం కోస్ట్ గార్డ్‌కు

*మన దేశ సముద్ర జలాల్లోకి వచ్చే ఏ ఓడలోనైనా ప్రవేశించి, సోదాలు నిర్వహించడానికి, నేరాలకు పాల్పడే వారిని అరెస్టు చేయడానికి కోస్ట్ గార్డ్‌కు మరిన్ని అధికారాలు కల్పించాం. తీరప్రాంత భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. కోస్ట్‌గార్డ్ చట్టం-1978 ప్రకారం దళంలోని ప్రతి సభ్యుడికీ ఈ అధికారాలు కల్పించాం.*

**- అజయ్ కుమార్, రక్షణశాఖ కార్యదర్శి**



### అందరూ అడ్డుకునేవారే..!

*భూసేకరణ, పర్యావరణ అనుమతులే రహదారుల ప్రాజెక్టులకు ప్రధాన అవరోధంగా మారాయి. ప్రతి ఒక్కరూ పనులు ఆపమనేవారే. పని చేయండని ఒక్కరూ చెప్పరేం? అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో ప్రజలకు సానుకూల దృక్పథం ఉండాలి.*

**- లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**



### మానసిక ప్రశాంతతతో బీపీ దూరం

న్యూఢిల్లీ, డిసెంబరు 5: బీపీని అదుపులో ఉంచడంలో సరైన తిండి, వ్యాయామంతో పాటు మానసిక స్థితి కూడా ప్రభావం చూపుతుందని మానసిక శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మనసు ప్రశాంతంగా ఉండటం వల్ల బీపీ అదుపులో ఉండి, హృద్రోగాలు తగ్గుతాయన్నారు. ప్రశాంతత కోసం యోగా చేయడం, విహారయాత్రలకు వెళ్లడం లాంటివి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఫోన్లు, టీవీలు చూసే సమయాన్ని సాధ్యమైనంత తగ్గించుకోవాలని చెప్పారు.

### గర్భిణులకు మధుమేహం ఉంటే.. శిశువులకు హృద్రోగాల ముప్పు

లండన్, డిసెంబరు 5: గర్భిణులకు మధుమేహం ఉంటే వారికి పుట్టే శిశువులకు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందని డెన్మార్క్ శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైంది. మధుమేహంతో పాటు గుండెజబ్బులు ఉన్నవారి పిల్లలకు ఈ ముప్పు మరింత ఎక్కువని పరిశోధకులు తెలిపారు. ఈ పిల్లల్లో 40 ఏళ్ల వయసు కంటే ముందే జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గర్భవతులుగా ఉన్నప్పుడే సరైన చికిత్స అందించడం ద్వారా పిల్లల్లో ఈ వ్యాధులను నివారించడానికి అవకాశం ఉందని తెలిపారు.






www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








శుక్రవారం | 6-12-2019 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai | విజయవాడ సిటీ*




# మంటల్లో 'ఆమె'

## గత ఏడాది సామూహిక అత్యాచారం

## ఇప్పుడు కిరోసిన్‌పోసి నిప్పంటించారు

*అదే కథ! మరో అబల వ్యథ!! అత్యాచార బాధితురాలిని నిలువునా తగులబెట్టే యత్నం! ఆమెపై అత్యాచారం చేసిన దుండగులు.. న్యాయం కోసం వెళ్తున్న ఆమెపై దారికాచి దాడిచేశారు! యూపీలోని ఉన్నావ్‌లో గురువారం తెల్లవారుజామున జరిగిందీ దారుణం. ఒంటినిండా కమ్ముకుంటున్న మంటలు కాల్చేస్తుంటే.. సాయం కోసం హృదయవిదారకంగా రోదిస్తూ రోడ్డుపై పరుగెత్తిందా అభాగ్యురాలు!! 90 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది!! ఇది ఏ నగర శివార్లలోనో, జరిగిన దారుణం కాదు! తాము చేసిన అత్యాచారం గురించి బాధితురాలు బయటపెడుతుందేమోనన్న భయంతో అప్పటికప్పుడు చేసిన ఘోరం అంతకన్నా కాదు!! అత్యాచారం చేసిన ఏడాది తర్వాత.. ఐదుగురు రాక్షసులు పకడ్బందీ ప్లాన్‌తో చేసిన కిరాతకమిది!!*

**బెయిలుపై విడుదలైన నిందితుల ఘాతుకం**

- కాలుతూనే కిలోమీటరు పరుగు
- ఆ పరిస్థితుల్లోనే 112కు ఫోన్
- 90 శాతం కాలిన గాయాలు
- హుటాహుటిన ఢిల్లీకి తరలింపు
- 'ఉన్నావ్'లో మరో దారుణం

ఉన్నావ్, డిసెంబరు 5: వెంటాడారు. వేధించారు. సామూహిక అత్యాచారం చేశారు. దర్జాగా బెయిలుపై బయటికొచ్చారు! మళ్లీ వెంటాడారు. వేధించారు. చివరికి... బాధితురాలిని ఈ భూమ్మీదే లేకుండా చేసేందుకు నిప్పంటించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన ఘోరమిది. 'జస్టిస్ ఫర్ దిశ' అని దేశమంతా నినదిస్తున్న సమయంలోనే... ఒక అత్యాచార బాధితురాలిపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు,

మిగతా 12వ పేజీలో...

**క్రైం సీరియళ్లు, వీడియోలు చూసే..**

- అత్యాచారం చేసి దిశను చంపేశారు!
- ఫోన్‌ని భూమిలో పాతిపెట్టారు
- దర్యాప్తునకు 7 బృందాలు
- హత్యాచారం ఘటన 'సీన్ రీ-కన్‌స్ట్రక్షన్'

**నెట్‌లో అశ్లీలతపై రాజ్యసభ కమిటీ**

12 మంది సభ్యులు నెలలో నివేదిక



## అత్త మామల సంరక్షణలో అల్లుళ్లు, కోడళ్లకూ సమాన బాధ్యత

**వృద్ధులను నిర్లక్ష్యం చేయడం నేరం**

- కనిష్ఠంగా రూ.5 వేల ఫైన్ లేదా 3 నెలల జైలు శిక్ష
- పోషణకు ఇచ్చే గరిష్ఠపరిమితి 10 వేలు తొలగింపు
- ఎంత సంపాదిస్తే అంత మెయింటెన్స్ ఇవ్వాల్సిందే
- తిండి, ఆరోగ్యం, ఇల్లుతో మెయింటెన్స్ పరిధి పెంపు
- సీనియర్ సిటిజన్స్ సవరణ బిల్లుకు కేబినెట్ ఓకే

12

# కియాకు అండ

## మాది క్రియాశీల ప్రభుత్వం





1 కియా ప్రారంభోత్సవంలో సీఎం జగన్, ప్రతినిధులు 2 కారుపై సంతకం చేస్తున్న సీఎం

- ఆ సంస్థ మరింత విస్తరించాలి
- 11 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి
- 7 వేల మందికి పరోక్షంగా..
- అనుబంధ పరిశ్రమలతో ఇంకో 3,500 మందికి చాన్సు
- మరిన్ని విదేశీ కంపెనీలు రావాలి
- గ్రాండ్ ఓపెనింగ్‌లో జగన్ ఆకాంక్ష

అనంతపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో నిర్మించిన అంతర్జాతీయ కార్ల పరిశ్రమ కియాకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. దేశీయంగా కార్ల ఉత్పత్తిని ప్రారంభించిన కియా మోటార్స్ మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. తద్వారా రాష్ట్రంలో మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గురువారం అనంతపురం జిల్లా పెనుకొండ మండలం ఎర్రమంచి వద్ద ఉన్న కియా మోటార్స్ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకలో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో పరిశ్రమను నిర్మించినందుకు కంపెనీ బృందాన్ని అభినందించారు. కియా బాటలో మరిన్ని విదేశీ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. పరిశ్రమలో పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభిస్తే 11 వేల మందికి

మిగతా 8వ పేజీలో...

**కొత్త ఏడాదిలో కొత్త కార్లు**

- ఎంపీవీ, ఎస్‌యూవీలకు ప్రణాళిక
- 22 నెలల్లోనే కియా నిర్మాణం పూర్తి
- 3 నెలల్లోనే రెండో షిఫ్టు ఉత్పత్తి
- 4 నెలల్లో 40 వేల కార్ల విక్రయం
- అనంత నుంచే దేశమంతా సరఫరా
- త్వరలో మూడో షిఫ్టులో ఉత్పత్తి



# మళ్లీ నిరీక్షణే!

- ఆకస్మికంగా ఢిల్లీకి సీఎం జగన్
- షా పిలుపు కోసం ఎదురుచూపులు
- రాత్రి 10.30 గంటలకు సమయం
- అర్ధరాత్రిదాకా రాని పిలుపు
- నేడు ప్రధాని మోదీతో సమావేశం
- కడప ఉక్కు, అమ్మఒడికి ఆహ్వానం

న్యూఢిల్లీ/అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆకస్మికంగా ఢిల్లీకి వెళ్లారు. కడప జిల్లాలో ఈ నెల 23న జరగనున్న 'ఏపీ హైగ్రేడ్ స్టీల్స్' శంకుస్థాపనకు ప్రధాని మోదీని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలను ఆహ్వానించాలని నిర్ణయించారు. అయితే... అమిత్‌షా అప్పాయింట్‌మెంట్‌పై గతంలోలాగే దోబూచులాట

మిగతా 8వ పేజీలో...



అమరావతిపై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

## ప్రజలంతా తప్పు చేశానంటే

# సారీకి సిద్ధం

**దుష్ప్రచారంతో అమరావతిని చంపేస్తున్నారు**

- ప్రసిద్ధ రాజధానిని కోరుకోవడం తప్పా?
- నష్టం నాకు కాదు.. భావితరాలకే
- రాజధాని అంటే ఆదాయం, ఉద్యోగాలు
- విభజనతో ఒకసారి నష్టపోయాం
- రాజధానిని పాడుచేసుకుని నష్టపోవద్దు
- అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు అమరావతి నుంచే పనిచేస్తున్నాయి
- వర్సిటీలు, దాదాపు పూర్తయిన టవర్లు, పేదల ఫ్లాట్లు గ్రాఫిక్స్‌నంటారా?
- రౌండ్ టేబుల్ భేటీలో బాబు ప్రశ్న

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మనకొక ప్రపంచస్థాయి ప్రసిద్ధ రాజధాని ఉండాలనుకోవడం తప్పా.. అని మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. అమరావతి నిర్మాణంలో తాను తప్పు చేశానని ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలు అభిప్రాయపడితే క్షమాపణ చెప్పడానికి సిద్ధమని

మిగతా 11వ పేజీలో...

**దమ్ముంటే నిరూపించండి**

- వేల ఎకరాల ఇన్‌సైడర్ ట్రేడింగా?
- అమ్మిందే 176 ఎకరాలు: బాబు
- వైసీపీ ఆరోపణలకు జవాబులు

జీరో ఎఫ్‌ఐఆర్..

## సూపర్!

- ఏపీలో తప్పిపోయి, తెలంగాణలో దొరికిన బాలుడు
- పరిధి చూడని కృష్ణా జిల్లా పోలీసులు, తక్షణం అలర్ట్ 13

**పార్లమెంటు క్యాంటీన్లలో.. సబ్సిడీ వదులుకున్న ఎంపీలు** 12

ఆదివారాల్లో నాలుగు

## పండగలు

2020 సెలవులు ప్రకటించిన ప్రభుత్వం 2






# మనోడేలే... మాఫీ చేద్దాం!

- ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి క్వారీపై ప్రత్యేక ప్రేమ
- అక్రమాలను నిర్ధారించిన గనుల శాఖ, విజిలెన్స్
- 33వేల క్యూబిక్ మీటర్ల మెటల్ అక్రమ తవ్వకం
- సరిహద్దులు మీరినట్లు నివేదికలో స్పష్టీకరణ
- అదేం లేదని తేల్చిన మంత్రి పెద్దిరెడ్డి కోర్టు
- 1.91 కోట్ల అపరాధ రుసుము పూర్తిగా మాఫీ
- ఎంతో కొంత తగ్గించడం సర్వసాధారణమే
- వందశాతం మాఫీ ఇదే తొలిసారి!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అధికారులు అక్రమాలను నిర్ధారించారు! అపరాధ రుసుము చెల్లించాలని స్పష్టం చేశారు! కానీ... మంత్రిగారు మాత్రం అక్రమాలేం జరగలేదని తేల్చేశారు. అపరాధ రుసుము మొత్తం మాఫీ చేశారు! ఈ 'అక్రమం' అధికార పార్టీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిది! మాఫీ చేసింది... మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి! మనోడైతే చాలు... గనుల తవ్వకాల్లో అక్రమాలు మాఫీ అయిపోతాయ్! అపరాధ రుసుములూ రద్దవుతాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై సొంత సర్కారు మహా ఉదారత చూపింది. ఏకంగా 1.91 కోట్ల అపరాధ రుసుమును మాఫీ చేసేసింది. అనంతపురం జిల్లాలోని బొమ్మనహాల్ మండలం నేమకల్ గ్రామంలో రోడ్ మెటల్ తవ్వకాల కోసం సర్వే నంబర్ 253లో 21.372 హెక్టార్లను

మిగతా 9వ పేజీలో...



మదనపల్లెలో టమాటా రైతులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

**ఉద్యోగాలివ్వడమంటే.. ఉన్నవి తీసేయడమా?**

- 5 లక్షల మందికి ఇస్తామన్నారు
- 4 లక్షల మందిని తీసేశారు
- చివరకు 2.80 లక్షలిచ్చారు
- మతమార్పిడిపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు.. పవన్ ఫైర్

# పవన్ X రెడ్డి

## 'అనంత' నేత వ్యాఖ్యలతో వివాదం

- వైసీపీ నేతలు వేధిస్తున్నారని ఆవేదన
- ప్రకాశ్ రెడ్డే కాదు.. ఏ రెడ్డి అయినా సరే.. తలలు తీయడానికైనా సిద్ధమని ఆవేశం
- తీవ్రంగా స్పందించిన రెడ్డి సంఘం నేతలు
- పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- తల తీసేందుకు తామూ సిద్ధమని హెచ్చరిక
- జిల్లా ఎస్పీకి ఎమ్మెల్యే తోపుదుర్తి ఫిర్యాదు
- జనసేన అధిపతిపై ధ్వజం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జనసేన అధిపతి పవన్ కల్యాణ్ సభలో అనంతపురం జిల్లాకు చెందిన ఓ నేత చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై వైసీపీ నేతలతోపాటు రెడ్డి సంఘానికి చెందిన నేతలూ తీవ్రంగా స్పందించారు. చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్న పవన్.. గురువారం మదనపల్లెలో శ్రేణులతో సమావేశమయ్యారు. గత ఎన్నికల్లో అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం నుంచి జనసేన తరపున పోటీ చేసిన సాకే పవన్ కుమార్ ఈ కార్యక్రమంలో ఆవేశంగా మాట్లాడారు. అధికార పార్టీ నేతలు తప్పుడు కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి

మిగతా 2వ పేజీలో...



బలి పశువుగా మారుతున్న

# మన పీవీ!

## గుజ్రాల్ మాట పీవీ విని ఉంటే సిక్కుల ఊచకోత జరిగేది కాదు

- రాజకీయ గురువుపై మన్మోహన్ సంచలన వ్యాఖ్య
- తప్పుబట్టిన పీవీ మనుమడు.. క్షమాపణకు డిమాండ్
- రాజీవ్‌ను రక్షించడానికి పీవీపై నెపమా?: అకాలీదళ్
- దోషి రాజీవ్‌గాంధీయే: బీజేపీ.. రాజకీయ దుమారం

12



2

# చలి వేళ ఉల్లి సెగ

- ఉదయాన్నే ఇంటిని దాటి గడగడలాడుతూ లైనులో నిలబడ్డ రెండు గంటల్లోనే రైతుబజార్లలో స్టాక్ ఖాళీ
- ఎప్పుడొస్తే ఇస్తారంటూ.. అధికారులపై జనం ఫైర్
- ధర 150 చేరుకోవడంతో రాష్ట్రమంతటా మంటలు

# ఉన్నావ్‌లో మరో ఉన్మాదం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ మరో దారుణ ఘటనకు కేంద్రంగా నిలిచింది. గతంలో కుల్‌దీప్ సింగ్ సెంగార్ అనే బీజేపీ ఎమ్మెల్యే ఓ అత్యాచారం కేసులో నిందితుడు కావడంతో విస్తృత ప్రచారంలోకి వచ్చిన ఈ జిల్లాలో, గురువారం ఉదయం కొందరు వ్యక్తులు తాము గతంలో అత్యాచారం చేసిన యువతిపై కిరోసిన్ కుమ్మరించి ఆమెను నిలువునా తగులబెట్టారు. గత ఏడాది డిసెంబరులో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డ వీరంతా బెయిల్‌మీద బయటకు వచ్చి బాధితురాలిని అంతం చేసేందుకు సిద్ధపడ్డారు. సహాయాన్ని కోరుతూ మండుతున్న ఆ దేహంతోనే కిలోమీటరు మేర పరుగు తీసి చివరకు ఆమె కుప్పకూలింది. ఆమెను అమితవేగంగా దేశరాజధానిలోని ప్రముఖ ఆసుపత్రికి తరలించినప్పటికీ, దేహం 90శాతానికి పైగా కాలిపోయినందున తిరిగి ఈ లోకాన్ని చూసే అవకాశాలు తక్కువే.

అత్యాచారానికి గురైన యువతి గుడ్లనీరు కుక్కుకుంటూ ఇంట్లో పడివుండాల్సింది పోయి, తమపైనే కేసుపెట్టినందుకు ఈ యువకుల అగ్రకుల అహంకారం దెబ్బతిన్నది. ఆమెను హతమార్చడం ద్వారా ఆమె తమపై సాగిస్తున్న న్యాయపోరాటాన్ని అంతం చేయాలనుకున్నారు.. కేసు పని మీద స్వగ్రామం నుంచి వేకువజామునే రాయ్‌బరేలీకి కుటుంబీకులతో సహా బయలుదేరిన ఆమెను ఇంటికి కొద్దిదూరంలోనే వీరంతా అటకాయించి దాడి చేశారు. వీరిలో ఇద్దరు గత ఏడాది డిసెంబరులో ఆమెను అపహరించి, అత్యాచారం చేసినప్పటికీ ఈ ఏడాది మార్చిలో కానీ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. నిన్నగాక మొన్న కేంద్రహోంమంత్రి యూపీలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ విపక్షాలు యోగి పాలనపై విరుచుకుపడ్డాయి. రాజ్యసభలోనూ ఆగ్రహావేశాలు మిన్నంటాయి.

బాధితురాలికి ఎందుకు రక్షణ కల్పించలేదంటూ మహిళా కమిషన్ ఆగ్రహించింది. ఈ ఆగ్రహాలు, నివేదికలు, అరెస్టులు అటుంచితే, తమ జిల్లా మాజీ ఎమ్మెల్యే అడుగుజాడల్లోనే ఈ నిందితులూ నడిచారు. ఆరోపణలు వచ్చినప్పటికీ సెంగార్‌ను పోలీసులు ఎంతోకాలం అరెస్టుచేయలేదు. కేసు పెట్టినందుకు ప్రతీకారంగా బాధితురాలి తండ్రిని అక్రమ కేసులో ఇరికించి, లాకప్‌లో పెట్టి పోలీసులు సెంగార్ మనుషులతో కలిసి కొట్టిచంపేశారు. ఆ తరువాత ఎమ్మెల్యే అరెస్టయి జైల్లో ఉండగానే, బాధితురాలు ప్రయాణిస్తున్న వాహనాన్ని లారీతో ఢీ కొట్టించి హత్యచేయించే ప్రయత్నం ఒకటి జరిగింది. సమీపబంధువు, న్యాయవాది మరణిస్తే ఆమె నెలలతరబడి ఆసుపత్రిలో ఉండి చివరకు కోలుకుంది. ఈఘటనకు రెండువారాల ముందే తన ప్రాణాలకు ప్రమాదం ఉన్నదని ఆమె సుప్రీంకోర్టుకు ఓ లేఖ రాయడం, ఈ ఘటన తరువాత కానీ దానిని చూడని మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ కేసు సీబీఐకి అప్పగించడం తెలిసిందే. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నడుస్తున్నప్పటికీ కేసు దర్యాప్తు, విచారణ నత్తనడకనే సాగాయి. 45 రోజుల్లో తీర్పుచెప్పాలని ట్రయల్ కోర్టును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినా 80రోజులు దాటినా తీర్పు వెలువడలేదు.

ఈ దేశంలో అత్యాచారాలపై దర్యాప్తులు, విచారణలు ఎలా సాగుతున్నాయనడానికి దేశాన్ని కుదిపేసిన సెంగార్ కేసు చక్కని ఉదాహరణ. ఈయనపై పెట్టిన సెక్షన్లన్నీ ఇప్పటికే పలుచబడిపోయినాయన్న విమర్శలను అటుంచితే, ఇప్పటి ఘటనలో, అందునా ఒకవేళ బాధితురాలు మృతిచెందినపక్షంలో కేసు ఇకపై ఎలా సాగుతుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. హైదరాబాద్ దారుణం 'దిశ' విషయంలో పార్లమెంటులో మన నాయకులు ప్రదర్శించిన ఆగ్రహావేశాలను, ఏకరువుపెట్టిన కఠినాతికఠినమైన శిక్షల జాబితాను చూశాం. వెల్లువెత్తిన ప్రజాగ్రహానికి అనుగుణమైన భాషని వాడుతూ, కఠినచట్టాలు కాంక్షిస్తూ అద్భుత ప్రసంగాలు చేశారు తప్ప, క్షేత్రస్థాయి లోపాలు, వ్యవస్థల దిద్దుబాటు గురించి మాట్లాడింది లేదు. అత్యాచార కేసుల నమోదునుంచి తీర్పుల వరకూ మన తీరు సమూలంగా మారాల్సి ఉన్నదని చెప్పిందీ లేదు. దిశ కేసులో తక్షణం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పడినందుకు సంతోషించవలసిందే. కానీ, ఈ ఘాతుకానికి ముందు జరిగిన అనేక ఘోరమైన ఘటనల్లో ఇదే తీరున ప్రభుత్వాలు ఎందుకు స్పందించలేదన్నది ప్రశ్న. బాధితుల కుల, మత, ఆర్థిక, నివాస నేపథ్యాలు, ఆయా ఘటనలపై సమాజం వెలిబుచ్చిన ఆగ్రహాన్ని బట్టి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు నిర్ణయం జరుగుతోందన్న విమర్శలకు అతీతంగా ఇకనైనా వ్యవహరించాలి. బాధితులు ఎవరైనా న్యాయం చేకూరవలసిందే, నిందితులు ఎంతటివారైనా శిక్షలు పడాల్సిందే. కేసు నమోదు నుంచి, తీర్పు వెలువడేవరకూ నెలకొన్న తీవ్ర జాప్యమే అత్యాచార బాధితులపై మరిన్ని వేధింపులకు, దాడులకు, హత్యలకు కారణమవుతున్నదని ఉన్నావ్ ఘటనలు రెండూ తెలియచెబుతున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే, అత్యాచార ఘటనలన్నింటినీ సత్వరమే తేల్చే ఫాస్ట్‌ట్రాక్ వ్యవస్థ ఏర్పాటు జరగాలి.

# స్త్రీ జన విమోచకుడు

"మతాలకు సంబంధించిన చట్టాలలో జోక్యం చేసుకునే హక్కు పార్లమెంట్‌కు లేదనే వాదన అసంబద్ధం. ఈ పార్లమెంట్ పూర్తిగా సర్వోన్నతమైనది. ఏ మత సముదాయానికి సంబంధించి అయినా, మతానికి సంబంధించే కాక ఆ మతం వారి వ్యక్తిగత చట్టాలకు సంబంధించిన ఏ విషయాల్లోనైనా, పార్లమెంటు జోక్యం చేసుకోగలదు. ఏ మత సముదాయమూ తాము 'పార్లమెంట్‌కు అతీతం' అనే మానసిక స్థితిలో ఉండకూడదు" స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తాత్కాలిక జాతీయ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా అంబేడ్కర్ చేసిన వ్యాఖ్య ఇది. హైందవ సమాజంలో స్త్రీలపై వివక్ష, పీడనలను తొలగించడానికి సభలో ప్రవేశపెట్టిన హిందుకోడ్ ముసాయిదా బిల్లును జనసంఘ్, కాంగ్రెస్ మితవాదులు వ్యతిరేకించిన సందర్భంలో అంబేడ్కర్ ఈ మాటలన్నారు.

జీవిత పర్యంతం కఠోర శారీరక మేధోశ్రమతో, అందుకు దీటైన కార్యాచరణతో, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వాల ప్రాతిపదికన, సామాజిక విప్లవాన్ని గొప్ప ముందడుగు వేయించారు అంబేడ్కర్. న్యాయశాస్త్ర కోవిదుడుగా, రాజనీతిజ్ఞుడుగా, ఆర్థికవేత్తగా, అణగారిన వర్గాల నాయకుడిగా, మహిళా హక్కుల కోసం, సాధికారత కోసం అసమాన పోరాటం చేసిన విమోచకుడిగా చరిత్రను నిర్మించాడు అంబేడ్కర్.

ప్రత్యేకించి, మహిళా సాధికారతతోనే సామాజిక విప్లవం వర్ధిల్లుతుంది అనే సార్వత్రిక సత్యం వెలుగులో, స్త్రీల హక్కుల సాధనలో అంబేడ్కర్ సాటిలేని తోడ్పాటును అందించాడు. విద్య, ఉత్పాదక, రాజకీయ రంగాలలో స్త్రీలు సాధించిన అభివృద్ధే ఆయా దేశాల ప్రగతికి కొలమానం అని నమ్మిన అంబేడ్కర్ వారికి అనేకమైన రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన హక్కులను, రక్షణలను కల్పించాడు. దేశంలో అణగారిన వర్గాల పురుషులు మత, కుల, రాజకీయ పెత్తనానికి గురవుతున్నారు. స్త్రీలు ఈ మూడు ఆధిపత్యాలకు తోడు పురుషాధిపత్యానికి కూడా గురవుతున్నారు. ఈ స్థితిని గమనించి స్త్రీలకు వ్యక్తిత్వం ఉందని, ఆమెకు అన్నింటా పురుషులతో సమానత్వం అవసరమని భావించాడు అంబేడ్కర్.



జాతీయోద్యమ ఆకాంక్షలను ప్రతిఫలింపచేస్తూ రాజ్యాంగ రచనా క్రమంలో స్త్రీల సాధికారత కోసం అనేక ప్రకరణలను పొందుపర్చాడు అంబేడ్కర్. వీటిలో, 15(3)– స్త్రీలు బిడ్డలను రక్షించడానికి, వివక్షతను రూపుమాపడానికి రాజ్యం ప్రత్యేక నిబంధనలు రూపొందించే అధికారం; 39(ఎ)– లింగవివక్ష లేకుండా జీవనోపాధి పద్ధతులను కల్గిఉండడం; 39(డి)– స్త్రీ పురుషులకు సమాన పనికి సమాన వేతనం; 42– గర్భిణి స్త్రీలకు ప్రసూతి సౌకర్యం; 51ఎ(ఈ)– స్త్రీల గౌరవం తగ్గించు ఆచారాలను విడనాడటం వంటి ప్రకరణలు ముఖ్యమైనవి. అయితే స్త్రీలకు ఏర్పరచిన రాజ్యాంగ రక్షణల స్ఫూర్తికీ, హిందూ వ్యక్తిగత చట్టాలకూ ఏకరూపత లేదని గ్రహించాడు. జాతీయ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా విస్తృత అధ్యయనంతో స్త్రీలకు సమర్థనగా ఉన్న కొన్ని స్మృతులను ఆధారంగా చేసుకొని 9 భాగాలు, 8 షెడ్యూళ్ళు, 139 ప్రకరణలతో కూడిన హిందూ కోడ్ ముసాయిదా బిల్లును రూపొందించి నవంబర్ 17, 1947లో సెలక్ట్ కమిటీకి నివేదించాడు. దీనిపై చర్చ ఫిబ్రవరి 11, 1949 నుండి డిసెంబర్ 14, 1949 వరకు కొనసాగింది. ఈ బిల్లులో స్త్రీలకు ఆస్తిహక్కు, ఆస్తిని పొందడానికి అనుక్రమణిక, భరణం, స్త్రీ పురుషుల మధ్య వివాహ స్వేచ్ఛ, కుల మతాలకు అతీతంగా దత్తత, సంరక్షణ మొదలగు ఎన్నో అంశాలను పొందుపరిచాడు. దీనితో చరిత్రలో మొదటిసారిగా హిందూ స్త్రీ ఆస్తిని వారసత్వ హక్కుగా పొందటం, స్వతంత్రంగా అనుభవించడం, అమ్మడం, అలాగే ఒక కుమార్తెగా, ఒక భార్యగా, ఒక తల్లిగా పురుషునితో సమానంగా ఆస్తిని అనుభవించగలగటం వంటి హక్కులు లభించాయి. ఈ బిల్లు సహేతుక కారణం లేకుండా పురుషుడు రెండవ భార్యను కల్గి ఉండడంపై ఆంక్షలు విధించింది. వేలాది ఏళ్ళుగా స్థిరీకరించబడిన వివక్ష పునాదులు ఈ విప్లవాత్మక బిల్లుతో కదిలిపోయాయి. హైందవ సమాజం దద్దరిల్లిపోయింది. సనాతన వాదులు గగ్గోలు పెట్టారు. బిల్లును ప్రవేశపెడుతున్నప్పుడు 'ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ హిందు విమెన్' అనే శీర్షికతో స్త్రీల దయనీయ స్థితిగతులపై ఆలోచనాత్మక ప్రసంగం చేసాడు అంబేడ్కర్. ప్రగతిశీల భావాలు కల్గిన కాంగ్రెస్‌లోని నెహ్రూ వర్గం హిందూ కోడ్ బిల్లును గట్టిగా సమర్థించింది. ప్రధాని నెహ్రూ మాట్లాడుతూ భారతీయ ఆత్మకు, హుందాతనానికి, వినయానికి, తెలివికి ప్రతీకలైన స్త్రీల పట్ల అమలవుతున్న వివక్షను, ఆంక్షలను సమూలంగా తొలగించే చారిత్రక సందర్భం ఆసన్నమైనది అన్నారు. కాంగ్రెస్‌లోని పటేల్, పఠాభి, ప్రసాద్ వర్గం అనేక సవరణలు కోరింది. ఆరెస్సెస్ ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకించింది. నిరసన కార్యక్రమాలు చేపట్టి అంబేడ్కర్, నెహ్రూ దిష్టిబొమ్మలను తగులబెట్టింది. రేణుక రే అనే కాంగ్రెస్ సభ్యురాలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటానికి కనీస మద్దతు తెలపకుండా వ్యతిరేకించిన ఆరెస్సెస్‌కు, జన సంఘీయులకు నిరసన తెలిపే అర్హత లేదని విమర్శించారు.

ఫిబ్రవరి 5, 1951లో అంబేడ్కర్ మరల హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాడు. 1952లో జరిగే సార్వత్రిక ఎన్నికల తరువాత ఆమోదింపచేస్తానని నెహ్రూ హామీ ఇచ్చినా, మంత్రి మండలిలో అనేకమంది బిల్లును సమర్థించనందుకు అంబేడ్కర్ ఆశాభంగం చెంది మంత్రి వర్గం నుండి సెప్టెంబర్ 9, 1951న రాజీనామా చేశాడు. ఆధునిక ప్రపంచ చరిత్రలో మహిళా హక్కుల గురించి తన పదవికి రాజీనామా చేసిన మంత్రిగా నిలిచిపోయాడు. 1955–56 కాలంలో నెహ్రూ ప్రభుత్వం హిందూ కోడ్ బిల్లును ఆమోదింపచేసి దాని వెలుగులో హిందూ వివాహ, వారసత్వ, దత్తత, భరణాలపై చట్టాలను, ఇంకా అనేక రక్షణలను రూపొందించింది. నేడు ఆధునిక భారత స్త్రీలు ఓ మేరకైనా అనుభవిస్తున్న సాధికారతలో అంబేడ్కర్ స్ఫూర్తి ఉంది.

సమకాలీన భారతీయ సమాజంలో అంబేడ్కర్ స్ఫూర్తికి భిన్నంగా మనుధర్మ పునరుద్ధరణ శక్తులు రాజ్యమేలుతున్నాయి. పరువు హత్యలు, మోరల్ పోలీసింగ్, ఆదివాసీ దళిత స్త్రీలపై అకృత్యాలు నిత్యకృత్యమయ్యాయి. బిజెపి పాలిత రాష్ట్రాలలోని పాఠ్యాంశాలలో స్త్రీల పట్ల వివక్షను బోధించే పాఠాలు చేర్చారు. స్త్రీలు గృహకార్యాలకు పరిమితమవ్వాలని ఆరెస్సెస్ సంఘచాలక్ చెపుతున్నాడు. నచ్చిన స్త్రీని ఆమె అనుమతి లేకుండా వివాహం చేసుకోవచ్చని, బాల్య వివాహాలకు అనుమతిస్తామని మోదీ అనుచర ప్రజాప్రతినిధులు బాహటంగానే ప్రకటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆధునిక భారత పౌరులు, ముఖ్యంగా స్త్రీలు, తమ హక్కుల కోసం అంబేడ్కర్ బాటలో ఆయన ఆశయాల కొనసాగింపును ఉద్యమంలా చేపట్టాలి. సమగ్ర సామాజిక విప్లవాన్ని సాధించడమే మనం అంబేడ్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి.

స్త్రీలకు అన్నింటా పురుషులతో సమానత్వం అవసరమని భావించాడు అంబేడ్కర్. వేలాది ఏళ్ళుగా స్థిరీకరించబడిన వివక్ష పునాదులు అంబేడ్కర్ ప్రవేశపెట్టిన విప్లవాత్మక హిందూ కోడ్ బిల్లుతో కదిలిపోయాయి.

■ అస్నాల శ్రీనివాస్

(నేడు అంబేడ్కర్ వర్ధంతి)

# మోదీ – షా నేర్చుకోవలసిన 'పవార్ ప్లే'

■ రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

భారత దేశంలో శరద్‌పవార్ వంటి 'అంతుచిక్కని' రాజకీయ నాయకులు అతి కొద్ది మందే ఉంటారు. ఆయన ఎప్పుడు ఏం చేస్తారో ఎవరికీ తెలియదు. ఆయన చెప్పేదానికి చేసేదానికి పొంతన లేకుండా ఉంటుంది. అందుకే 'పవార్ ఆలోచన, పవార్ మాట, పవార్ పని... మూడూ ఒకదానికొకటి సంబంధం లేకుండా వేరు వేరుగా ఉంటాయి' అని ఒక రాజకీయ నానుడి ప్రచారంలో ఉండేది. గత నెలలో మహారాష్ట్రలో అధికారం కోసం జరిగిన నాటకీయ పరిణామాల్లో పవార్ పాత్ర ఏమిటి? అన్న సందేహాలకు ఈ నానుడి అర్థం చెబుతుంది. తన అన్న కొడుకు అజిత్ పవార్ బీజేపీతో జరిపిన సంప్రదింపుల గురించి శరద్ పవార్‌కు నిజంగా తెలియదా? ఆయనకు తెలియకుండానే నాటకం సాగిందా? లేక 'డబుల్ గేమ్' ఆడాడా? అనేదానికి జవాబు దొరకవచ్చు, దొరకక పోవచ్చు. కానీ, సంక్లిష్టమైన మహారాష్ట్ర రాజకీయ క్రీడలో పవార్ తన 80వ ఏట కూడా 'శత్రంజ్ కే కిలాడీ' అని మరోసారి రుజువు చేసుకున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. కొద్ది నెలల క్రితం పవార్ పార్టీ నేషనలిస్టిక్ కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు వచ్చి నాయకులు తలోదారి పట్టారు. ఆ రాష్ట్ర శాసన సభ ఎన్నికల ముందు ఆ పార్టీ ఎంపీ కూడా పార్టీ మారారు. ఆయన కుటుంబంలోనూ చీలకలు వచ్చినట్టే కనిపించింది. ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. దానితో పవార్ పని అయిపోయిందనే అందరూ భావించారు. అయితే, ఆయనపై కేసు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ చేసిన తప్పిదంగా పరిణమించింది. వృద్ధ నేత పవార్, యువ నేత ఫడణవీస్‌ల మధ్య బహిరంగ యుద్ధానికి కూడా అదే తెరలేపింది.

జాతీయ మీడియా అభివర్ణించినట్లు పవార్ రాష్ట్రవ్యాప్త ప్రజా నాయకుడు కాదు. వ్యవసాయ నేపథ్యం గల తన సామాజిక వర్గం వారు ఎక్కువగా నివసించే పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంలో మాత్రమే ఆయనకు గట్టి పట్టు ఉంది. ఈ కారణంగానే ఆయన ఏ రోజూ (కాంగ్రెస్‌లో ఉన్నా, ఎన్‌సీపీ స్థాపించాకనైనా) మహారాష్ట్రలో పూర్తి మెజారిటీ సాధించలేకపోయారు. అయితే, తన రాజకీయ చతురతతో ఫిరాయింపులు, పార్టీలను చీల్చడాలు, ఎన్నికల అనంతరం పొత్తులతోనే తన రాజకీయ అస్తిత్వాన్ని విస్తరింపజేసుకుంటూ వచ్చారు. కానీ, మహారాష్ట్ర దాటి ఆయన తన ప్రభావాన్ని చూపలేకపోయారు. ప్రధాన మంత్రి పదవీ ప్రయత్నాల్లో ఢిల్లీ స్థాయి రాజకీయాల్లో గెలవలేకపోయారు. అలాగని ఆయన నిర్లక్ష్యం చేయదగ్గ నాయకుడు కాదు. అలుపెరుగని నేత, రాజకీయ వ్యూహకర్త, దేశ వ్యాప్తంగా రాజకీయ సంబంధాలు కలిగిన నేతగా ఉన్నారు. 'రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులంటూ ఉండరు, శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి' అన్న దానికి నిలువెత్తు రూపంగా ఉంటారు శరద్ పవార్. అవసరాన్ని బట్టి ఆయన ఏ పార్టీలతోనైనా, ఏ పార్టీ నాయకులతోనైనా, ఎవరితోనైనా సంబంధాలు నెలకొల్పుకోగలరు. 2015లో పవార్ 75వ వసంతోత్సవానికి నరేంద్ర మోదీ, సోనియా గాంధీ వంటి అతిరథ మహారథులంతా హాజరయ్యారు. సోనియా గాంధీ 'విదేశీయత'కు వ్యతిరేకంగానే 1999లో ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)ని స్థాపించారు. అదే కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలోనూ, మహారాష్ట్రలోనూ సంకీర్ణాలు చేసుకోగలిగారు. ఇటువంటి నేర్పరితనమే ఆయనను సుదీర్ఘ కాలం 'అధికారం'లో మనగలిగేలా చేసింది. సరిగ్గా చెప్పాలంటే ఆయన సంకీర్ణ యుగ రాజకీయ నేత. 1978లో జనసంఘ్‌ను, సోషలిస్టులను ఒకే గొడుగు కిందకు తెచ్చి పీడీఎఫ్ పేరుతో తన నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగారు. ఈ ప్రయోగం రెండు సంవత్సరాలకన్నా ఎక్కువ నిలువలేకపోయింది. కానీ పవార్ రాజకీయ వ్యూహ సామర్థ్యాన్ని తెలపడమే కాదు, స్వప్రయోజనాల కోసం ఆయన ఎలాంటి సిద్ధాంతాలు, రాద్ధాంతాలను లెక్కచేయడనేది కూడా స్పష్టమైంది. శివసేన తనకు




'రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులంటూ ఉండరు, శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి' అన్న దానికి నిలువెత్తు రూపం శరద్ పవార్. అవసరాన్ని బట్టి ఆయన ఏ పార్టీలతోనైనా, ఏ పార్టీ నాయకులతో అయినా, ఎవరితోనైనా సంబంధాలు నెలకొల్పుకోగలరు. 2015లో పవార్ 75వ వసంతోత్సవానికి నరేంద్ర మోదీ, సోనియా గాంధీ వంటి అతిరథ మహారథులంతా హాజరయ్యారు. సోనియా గాంధీ 'విదేశీయత'కు వ్యతిరేకంగానే 1999లో ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి ఎన్‌సీపీని స్థాపించారు. అదే కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలోనూ, మహారాష్ట్రలోనూ సంకీర్ణాలు చేసుకోగలిగారు. ఇటువంటి నేర్పరితనమే ఆయనను సుదీర్ఘ కాలం 'అధికారం'లో మనగలిగేలా చేసింది.

శత్రువే అయినా ఏనాడు కూడా పవార్ ఆ పార్టీ అధినేత బాల్ థాకరేను ఒక పరిమితికి మించి విమర్శించలేదు. ఇలాంటి పరస్పర గౌరవం లేదా పరస్పర సౌకర్యంతోనే రాజకీయాలు నెరపిన పవార్–థాకరే సంబంధాలు మహారాష్ట్రలో 'సంప్రదింపుల రాజకీయాల'కు నిదర్శనంగా నిలిచాయి. బెంగాల్, తమిళనాడు రాజకీయాల మాదిరిగా వ్యక్తిగత కక్షలు, కార్పణ్యాలతో ఒకరినొకరు దూషించుకోవడం, కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడడం, జైళ్ల పాలు చేయడం వంటివి మహారాష్ట్రలో ఎప్పుడూ జరగలేదు. 'క్విడ్ ప్రో కో' పద్ధతిలోనే ఇక్కడి రాజకీయాలు కొనసాగాయి. ఇలాంటి స్థితిలోని రాజకీయాలను ఫడణవీస్–అమిత్ షా–మోదీ బ్రాండు రాజకీయాలు చెల్లాచెదురు చేశాయి. రాజకీయ ప్రత్యర్థులపై అవినీతి కేసులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు అవుతూండడం రాజకీయ నాయకుల్లో భయాందోళనలు రేకెత్తించాయి. బీజేపీలో చేరిన వారికి 'రక్షణ' హామీ లభిస్తుండడంతో పాటు, చేరని వారిపై కేసులు నమోదు అవుతున్నాయి. దీనితో అభద్రత, శత్రుపూరిత వాతావరణం నెలకొంది. బీజేపీ సుదీర్ఘకాల మిత్రపక్షమైన శివసేనలోనూ ఇలాంటి భయాందోళనలే తలెత్తాయి. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అంటూ అమిత్ షా ఇచ్చిన పిలుపుతో కాంగ్రెస్‌కు ఎదురైన పరిస్థితులను వారు పోల్చుకున్నారు. దానితో, బీజేపీతో సంకీర్ణం కొనసాగించడం తమ ఆస్తిత్వానికే ముప్పు తెస్తుందన్న ఆలోచనలు శివసేన నేతలకు కలిగాయి. ఈ ఆలోచనలు, ఆందోళనలనే అవకాశంగా మలుచుకుని పవార్ శివసేనతో 'పొత్తు' కలిపారు. ఎన్నికలవేళ అయితే సేన–ఎన్‌సీపీల మిత్రత్వం ఊహకు కూడా అందనిది. అనూహ్యాలను సాధించటమే పవార్ ప్రత్యేకత. చాలా మంది అనుకుంటున్నట్లు ఇక్కడి ఫలితాలు సూచించేది మోదీ వ్యతిరేకత కాదు, మోదీ–షా–ఫడణవీస్ త్రయం పట్ల ఇతర పార్టీలు, నాయకుల్లో తలెత్తిన ఇలాంటి అనుమానాలు, ఆందోళనలే కారణం. అందువల్లే దూరందూరంగా మసులుకుంటున్న వారంతా తమ మనుగడ కోసం ఏకమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. మహారాష్ట్రలో ప్రస్తుత సేన–ఎన్‌సీపీ సంకీర్ణం మనగలుగుతుందా లేదా అనేదాని కంటే, బీజేపీ భయాందోళనల నుంచి బయటపడి, తమను తాము రక్షించుకోవడానికి దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలకు ఈ సంకీర్ణం ఒక దారి చూపిందనే విషయాన్ని అర్థం చేసుకోవడం ప్రధానం. ప్రధాన మంత్రి 'సహకార సమాఖ్య వ్యవస్థ' గురించి మాట్లాడుతూనే, మరోపక్క వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయపార్టీలను 'తొక్కేసే' ప్రయత్నాలను చేయటం వల్ల ఆయా పార్టీలతో బీజేపీ సంబంధాలు తెగదెంపులవుతున్నాయి. మోదీ మొదటి హయాంలో తెలుగు దేశం, రెండో హయాంలో ఇప్పుడు శివ సేనకు ఇదే అనుభవం కలిగింది. ఈ వరుసలో బహుశా జనతాదళ్ (యు) ఉండొచ్చు.

'నరేంద్ర–దేవేంద్ర' నినాదంతోనే తాము మహారాష్ట్ర ఎన్నికల పోరు కొనసాగించామని, కాబట్టి ఫలితాల అనంతరం శివసేన చేసింది నమ్మక ద్రోహమని బీజేపీ వాదిస్తున్నది. అయితే, శివసేనతో అధికారం పంచుకోకుండా బీజేపీని నిలువరించినదేమిటి? ముడుచుకు కూచున్న మిత్రుడైన శివసేన అధినేత ఉద్ధవ్‌తో ప్రధాని సమావేశమైనా, స్వయంగా అమిత్ షాయే ఠాకరే నివాసానికి వెళ్లి చర్చలు జరిపినా సంకీర్ణ యత్రాలు ఫలించకపోవడానికి బీజేపీ చేస్తున్న ఆధిపత్య రాజకీయాలు, ఆ పార్టీ నాయకుల ఆధిపత్య వైఖరులే కారణం. అవును, ఐదేళ్లు బీజేపీ ముఖ్యమంత్రే పదవి ఉంటే తమ పార్టీ ఉనికిని దెబ్బతీస్తారన్న భయంతోనే శివసేన ముఖ్యమంత్రి పదవిపై 55:50 అంటూ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వంలో తమకు ఎక్కువ మంత్రి పదవులు ఇవ్వనిదీ తమను తగ్గించడంలో భాగమని శివసేన భావించింది.

బీజేపీలోని ఇద్దరు అగ్రనేతలు రాజకీయ చాణక్యులే, కానీ చిన్న పార్టీలను భయపెట్టీ బెదిరించీ చాణక్య నీతిని అమలు చేయలేరు. అహంభావాలు దెబ్బతినకుండా చాతుర్యంతో పని నెరవేర్చుకోవాలి. ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంబించాలే గానీ భయపెట్టి ఎదుటి వారిని లొంగదీసుకోవడం అన్ని వేళలా సాధ్యం కాదు. అధికారం ద్వారా ప్రత్యర్థి పార్టీలను అణగదొక్కడం అనుమానాలకు, శత్రుత్వాలకే దారి తీస్తుంది. ఈ విషయంలో షా–మోదీలు పవార్ విధానాన్ని నమూనాగా స్వీకరించాలి.

**చివరి మాట:** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఉన్న శరద్ పవార్‌ను 'మీరెప్పుడైనా రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్ గురించి ఆలోచించారా?' అని అడిగాను. దానికాయన 'నేనింకా యువకుడినే' అంటూ ప్రశ్నను నిర్ద్వందంగా తిరస్కరించారు. నిరంతర యవ్వనమే రాజకీయ అధికారానికి దారి అనేది ఈ కథలోని నీతి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

# కఠినశిక్షలతో అత్యాచారాలు ఆగుతాయా?



లైంగిక అత్యాచారం గురించి సమాజ ఆలోచనా రీతులు మారకుండా పరిస్థితి మారుతుందని ఆశించగలమా? స్త్రీలు అత్యాచారం విషయంలో అబద్ధాలు ఆడతారనే బలమైన నమ్మకం ఇప్పటికీ లేదూ? అసలు అత్యాచారాలని, ఆ స్త్రీ చనిపోతే తప్ప, ఇప్పటికీ హింసగా పరిగణించడం లేదు కదా! బాధితులు ఫిర్యాదులే చెయ్యలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు, పట్టుబడిన ఒకరిద్దరికి కఠినమైన శిక్షలు వెయ్యటం వల్ల పరిస్థితి మారి, పట్టుబడని రేపిస్టులు భయపడతారని భావించటం కష్టం.

'నిర్భయ' ఘటన కాలంలో జరిగిన చర్చే ఇప్పుడు 'దిశ' అత్యాచారం, హత్య సందర్భంలో పునరావృతమవటం ఆశ్చర్యంగా, బాధాకరంగా ఉంది. ఈ ఘోరమైన హత్యాచారాలు ఆగాలంటే నిందితులను బహిరంగంగా ఉరి తియ్యటం లేదా కఠిన శిక్షలు విధించడమొక్కటే మార్గమన్న శుష్క, బాధ్యతా రహితమైన వాదన సామాన్యుల నుంచి రాజకీయ నాయకుల వరకూ చేస్తుంటే భయం వేస్తోంది. లైంగిక అత్యాచారం రోజువారీ ఎంత సాధారణంగా జరుగుతోందో తెలియని అజ్ఞానం, మన సమాజంలో పురుషులు ఈ రకంగా ఎందుకు తయారవుతున్నారనే అవగాహనా రాహిత్యం ఇందుకు కారణం. నేరపరిశోధనా వ్యవస్థ, పోలీసులు, న్యాయవ్యవస్థ, న్యాయవాదులు, న్యాయమూర్తుల వైఖరులు ఎలా ఉంటాయో తెలియనితనం మధ్య సోషల్ మీడియాలో అజ్ఞాన తీర్పులు, పార్లమెంటులో అవివేక పరిష్కారాలు వెలువడుతున్నాయి.

ముందుగా దిశ లేదా ఆదిలాబాదులో ఇలాగే హత్యాచారానికి గురయిన కరుణ (పేరు మార్చాను) బతికుంటే ఏమి జరిగేదో ఆలోచిద్దాం. జరిగిన దాని గురించి వారిని, వారి కుటుంబాలని సమాజంలో బంధువులు, ఇరుగు పొరుగు వాళ్ళు, తెలిసిన, తెలియని వాళ్ళు అనేక రకాల అవమానాలకు గురిచేసేవారు. దిశకి పెళ్ళవటం ఎట్లా అని బంధువులు గుచ్చి గుచ్చి అడుగుతుండేవారు. కుటుంబం మద్దతిచ్చినప్పటికీ ఇద్దరికీ పనికెళ్ళటం దుర్లభంగా మారి ఉండేది. ప్రభుత్వ పరంగా గాని, ప్రయివేటు పరంగా గాని, ఇటువంటి అత్యాచారానికి గురయిన స్త్రీలకి ఆ భయోత్పాతం నుండి బయట వెయ్యటానికి అవసరమయిన వైద్య సదుపాయాలు పెద్దగా లభించి ఉండేవి కాదు. దిశకి కొంతలో కొంత లభించినా, కరుణకి ఆ అవకాశం లేక దాన్నుండి బయట పడటానికి ఆమెకి జీవిత కాలం పట్టి ఉండేది. ఈ లోపల ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత కుంటుపడి ఉండేది.

ఇక నేర పరిశోధనా వ్యవస్థకొద్దాం. ముందుగా, కుటుంబ సభ్యులు ఆయా స్త్రీలు కన్పించట్లేదని పోలీసులకి ఫోన్ చేసినప్పుడు వాళ్ళు సరిగ్గా స్పందించలేదని, చట్ట విరుద్ధంగా పేరు, వివరాలు బయట పెట్టేశారని గుర్తుంచుకుందాం. ప్రజా పోరాటం లేకున్నట్లయితే, దిశకి అవసరం లేకపోయినా చట్ట విరుద్ధమయిన రెండు వేళ్ళ పరీక్ష జరిగుండేది. ఆమెకి బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారా అని, కరుణకి ఆ ముద్దాయిల్లో ఎవరయినా తెలుసా అనే ఎంక్వైరీ జరిగేది. సమయానికి ముద్దాయిలని గుర్తించే పెరేడ్ జరగటం, చార్జిషీట్ దిశ విషయంలో జరిగినా, కరుణ విషయంలో జరిగుండేవి కాదు. ఆమె కేసు పరిశోధనలో తాత్సారం తప్పకుండా జరిగుండేది. ఇదంతా జరిగి, ఈ రెండు కేసులు కోర్టుకి వెళితే, ముద్దాయిల తరఫు డిఫెన్స్ లాయర్లు తమ వృత్తి ధర్మం ప్రకారం ఆ సమయంలో వాళ్లిద్దరూ అక్కడ ఎందుకున్నారు అని, వాళ్ళిద్దరి లైంగిక చరిత్ర, ముద్దాయిలు వారికి తెలుసా, వారు ఎందుకు రేపిస్టులతో సంఘర్షించలేదు, వొంటి మీద గాయాలెందుకు లేవు వంటి ప్రశ్నలతో విసిగించి, నిందించి, అవమానించి, వారి వర్ణనల్లో తప్పులు వెతికి ముద్దాయిలని రక్షించటానికి ప్రయత్నించేవారు. ఎందుకు ఫిర్యాదు చేశామా, ఎందుకు బతికున్నామా అని బాధితులకి అనిపించేలా కోర్టుల వాతావరణం ఉంటుందని ప్రతీక్ష బాక్సీ వంటి లీగల్ స్కాలర్ చెప్పిన రీతిలో ట్రయల్ జరిగుండేది. ఈ లైంగిక చరిత్ర గురించిన ప్రశ్నల బాధ కుల, వర్గ రీత్యా కరుణకి ఎక్కువగా, దిశకి తక్కువగా ఉండేది. ఇదే కారణాల వల్ల కరుణపై అత్యాచారం చేసినవారికి తక్కువ శిక్ష పడే అవకాశాలు కూడా ఉండేవి.

ఇదీ క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి. ఈ పరిస్థితుల వల్లే లైంగిక అత్యాచారాల కేసుల్లో శిక్షలు పడ్డవి, పడుతున్నవి చాలా తక్కువ. ఇప్పటికీ సమాజంలో లైంగిక అత్యాచార బాధితుల పట్ల చులకన, చిన్న చూపు, అవమానకరమైన చూపులు, చేష్టలు మామూలు. యువతులనయితే వారి శీలం పోయిందని, వారిలో ఏదో తప్పుంది కాబట్టే వారిపై అత్యాచారం జరిగిందని భావిస్తారు. అందరూ వారిని, వారి కుటుంబాన్ని దూరం పెడతారు. వారిదే తప్పని, వారినే నిందిస్తారు. పోలీసుల దగ్గరికి వచ్చేవి ప్రాణాల మీదకి వచ్చినవి, ఎక్కువగా మెడికో లీగల్ కేసులు ఉంటాయి. దేశంలో చాలా మంది పోలీసుల చిట్టాలో స్త్రీలపై జరిగే లైంగిక నేరాలు దొంగతనాల కంటే చిన్న స్థాయి నేరాలు. లైంగిక అత్యాచారాలని అత్యధిక పోలీసు స్టేషన్లలో సరిగ్గా పట్టించుకోరు. దిశ కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఫిర్యాదు చేసిన మహిళ గురించే పోలీసులు అవమానకరంగా మాట్లాడతారు. దేశంలో ఇతరచోట్ల అత్యాచారం జరిగిందని ఫిర్యాదు చెయ్యటానికి వెళ్లిన స్త్రీలపై పోలీసులు కూడా అత్యాచారానికి పాల్పడిన సంఘటనలు లేకపోలేదు. హాస్పిటళ్లలో డాక్టర్లతో సహా అందరూ అత్యాచారం కేసులో వైద్య పరీక్షలకు తీసుకెళ్లిన బాధితుల్ని జూలో జంతువులని చూసినట్లు చూస్తారు. కనీస మానవీయ స్పృహ లేకుండా హేళనగా చూస్తారు. చాలామంది డాక్టర్లకి రెండు వేళ్ళ పరీక్ష నేర స్మృతి నుండి తీసేశారని, కాబట్టి చెయ్యకూడదని తెలియదు. ఇక కోర్టుల్లో వాయిదాలపైన వాయిదాలు అయ్యి కేసులు కొన్ని ఏళ్ల పాటు సాగుతూ ఉంటాయి. చిన్న పిల్లలుగా అత్యాచారాలకి గురైన వారు తీర్పు సమయానికి పెళ్ళీడుకు వచ్చిన ఘటనలు ఎన్నో. న్యాయ పోరాటానికి కొన్నిసార్లు దశాబ్దాలు పడతాయి. అందుకే ఇప్పటికీ లైంగిక అత్యాచారాల గురించి ఫిర్యాదుచేసే ఆడవాళ్ళ, బాలికల సంఖ్య అతి తక్కువ. జరిగే వాటిల్లో కేవలం రెండు నుంచి ఐదుశాతం మాత్రమే రిపోర్టు అవుతాయని ఒక అంచనా. తండ్రులు, సోదరులు, మామలు, బాబాయిలు, మొగుళ్ళు చేసే లైంగిక అత్యాచారాలు అసలు బయటికి రావు. దినపత్రికల క్రైమ్ పేజీలో అప్పుడప్పుడు కనపడతాయి. చిన్న పిల్లలపై జరిగే వాటిల్లో అబ్బాయిలు, బాలుర మీద జరిగే లైంగిక అత్యాచారాలు సగానికి సగంవున్నాయని క్రైమ్ స్టాటిస్టిక్స్ చెప్తున్నాయి. ట్రాన్స్‌జెండర్ స్త్రీలపై రోజూ జరిగే అత్యాచారాలు, హత్యలు ఇంకా చట్ట పరిధిలోకే రాలేదు. అంటే పట్టుబడిన నేరస్థుల సంఖ్య కంటే అసలు నేరస్థుల సంఖ్య అనేక వందల రెట్లు ఎక్కువ. బాధితులు ఫిర్యాదులే చెయ్యలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు, పట్టుబడిన ఒకరిద్దరికి కఠినమైన శిక్షలు వెయ్యటం వల్ల పరిస్థితి మారి, పట్టుబడని రేపిస్టులు భయపడతారని భావించటం కష్టం.

రేపిస్టులందరినీ ఉరికంబం ఎక్కిస్తే, మన దేశంలో పురుష జనాభా శాతం తగ్గిపోయే ప్రమాదం ఉంది..!



లైంగిక అత్యాచారం గురించి సమాజ ఆలోచనా రీతులు మారకుండా ఈ పరిస్థితి మారుతుందని ఆశించగలమా? స్త్రీలు అత్యాచారం విషయంలో అబద్ధాలు ఆడతారనే బలమైన నమ్మకం ఇప్పటికీ లేదూ? అసలు అత్యాచారాలని, ఆ స్త్రీ చనిపోతే తప్ప, ఇప్పటికీ హింసగా పరిగణించడం లేదు కదా! అంతే కాక, మనం వివిధ రకాల హత్యాచారానికి వేర్వేరు రకాలుగా ఆ స్త్రీ కులం, వర్గం, ప్రాంతం, జెండర్, రాజకీయ అస్తిత్వాలను బట్టి స్పందిస్తాం. అత్యాచారానికి గురయిన స్త్రీ బ్రతికి బయట పడితే ఆమెని మనిషిగా గౌరవంతో చూడటం మనకింకా తెలియదు. వారి పట్ల మానవీయంగా ఎలా ప్రవర్తించాలో సమాజం నేర్పట్లేదు. అత్యాచారానికి గురయిన స్త్రీని శీలంచెడిన స్త్రీగా చూడటం మాత్రమే మనం నేర్చుకున్నాం. స్త్రీల శీలమంటే వారి శరీరాలలో ఉందనే సమాజం ఇప్పటికీ చెపుతోంది. దాని దృష్టిలో స్త్రీలంటే ప్రధానంగా పురుషుల లైంగిక వాంఛలకు పనికొచ్చే వస్తువులు– వివాహం బయట, లోపల కూడా. అందుకే అత్యాచార వ్యతిరేక నిరసనలు ఆయా స్త్రీలు వివాహ వ్యవస్థకి పనికిరారనే భయం, బాధ నుంచి వస్తున్నాయి ఎక్కువగా. స్త్రీలు వ్యక్తులనీ, లైంగిక అత్యాచారం వారి శరీరాన్నీ వ్యక్తిత్వాన్నీ ఆత్మ గౌరవాన్నీ గాయపరుస్తుందనీ, శరీరంపై హక్కుకి హాని కలిగిస్తుందన్న అవగాహన, స్పృహ అత్యాచార వ్యతిరేక నిరసనల్లో కూడా ఇంకా రాలేదు.

ఇంత పెద్ద సంఖ్యలో రేపిస్టులు ఎందుకు తయారు అవుతున్నారనేది మనల్ని మనం వేసుకోని మరొక ప్రశ్న. ఇంత మంది పురుషులు స్త్రీల శరీరాల్ని కేవలం తమ లైంగికేచ్ఛకి వాడుకునే వస్తువులుగా భావించటానికి కారణాలేంటి? అసలు మన పురుషుల్లో, యువకుల్లో ఎంతమందికి లైంగిక చర్య ఇద్దరు మనుషుల పరస్పర అంగీకారంతో కూడుకుని వుండాలని తెలుసు? స్త్రీలకి వాంఛలు, ఇష్టాయిష్టాలు ఉండవని, ఉండకూడదని, వారు కేవలం పురుషుల వాంఛలకు, ఇష్టాలకి పనికొచ్చే వస్తువులని నేర్పింది సంప్రదాయ సమాజం. దాన్ని ఈ ఆధునిక సమాచార యుగంలో కొనసాగిస్తోంది– నేటి సమాజంలోని కుటుంబాలు, విద్యావ్యవస్థ, సినిమాలు, ఇంటర్నెట్, సోషల్ మీడియాలే కదా? ఈ ధోరణులు మారకుండా యువకులు, పురుషులు ఎట్లా మారతారు? విద్యా సంస్థల్లో లైంగికత, లైంగిక సంబంధాల గురించి సరయిన దృక్పథం నేర్పాలంటే అడ్డుపడేది యాజమాన్యం, ఆ తరువాత తల్లి దండ్రులు, వెనుకాడేది టీచర్లు. ఎవరూ ఏమీ నేర్పకపోతే ఇంటర్నెట్ పోర్నోగ్రఫిక్ సైట్ల నుండి లైంగిక సంబంధాల గురించి నేర్చుకుంటున్నారు ఈ తరం యువకులు. దిశ చనిపోయిన తరువాత ఆమె అత్యాచార వీడియో కోసం పోర్నోగ్రఫిక్ సైట్లలో వెతికిన 8 లక్షల వ్యక్తులు వీళ్లల్లో భాగమే. పురుషత్వం ఇలా తయారవుతున్న నేపథ్యంలో, ఇతరుల శరీరాలు కేవలం వాడుకుని పారేసే వస్తువులు కాదని పురుషులకి ఈ సమాజం ఎలా నేర్పాలనుకుంటోంది? వారిని రేపిస్టులుగా తయారవకుండా ఎలా ఆపాలనుకుంటోంది? ఈ రకంగా 'మగబుద్ధి'ని పెంచి పోషిస్తున్న సమాజంలో పట్టుబడని లైంగిక అత్యాచారాల సంఖ్య, రేపిస్టుల సంఖ్య తగ్గే అవకాశమేదీ?

దిశ హత్యలో పట్టుబడిన నిందితులకు బహిరంగంగా ఉరి వెయ్యాలని ఉత్సాహపడుతున్నవారు అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, వీళ్ళనీ ఇంకా పట్టుబడని అనేకమంది నేరస్తుల్నీ తయారు చేస్తోంది మన సమాజం, మన వ్యవస్థలేనని. రేపిస్టులందరినీ ఉరికంబం ఎక్కించాలంటే మన దేశంలో పురుష జనాభా శాతం తగ్గిపోయే ప్రమాదం నిజంగా వుంది. మనం త్వరగా చెయ్యాల్సింది ఈ లైంగిక అత్యాచారాలని ప్రేరేపించే సంస్కృతిని కట్టడి చెయ్యడం. అత్యాచార బాధితులకి అవసరమయిన సహాయ సహకారాలు అందించే వ్యవస్థలని ఏర్పర్చుకోవటం. బాధితుల మాటలు నమ్మటం. పోలీసులు బ్రతికున్న బాధితులపైన అత్యాచారాన్ని కూడా సీరియస్‌గా తీసుకుని తమ శైలి మార్చుకుని అత్యాచార నిందితులు అందరికీ శిక్షలు పడేట్లుగా చూడటం. కోర్టుల వాతావరణాన్ని బాధితులకి అనుగుణంగా మార్చటం. బాధితులకి మానసిక స్థైర్యాన్నిచ్చే వైద్యపరమయిన వసతులని తయారు చెయ్యటం, దానికి వైద్య వ్యవస్థని సన్నద్ధం చెయ్యటం. అత్యాచార బాధితులు ఎందుకు బ్రతికున్నామా అనుకొనే ప్రస్తుత పరిస్థితుల నుండి జరిగిన దాంట్లో మా తప్పేమీ లేదు, మేము గౌరవంతో బ్రతుకుతాం అన్న పరిస్థితిని సమాజ వైఖరులు మార్చటం ద్వారా తీసుకు రావటం. ఇవన్నీ చెయ్యకుండా పట్టుబడ్డ నలుగురో, ఐదుగురో నిందితులని క్రూరంగా చంపేస్తే లైంగిక అత్యాచారాలు తగ్గుతాయనుకుంటే అంతకన్నా హాస్యాస్పదం ఇంకోటి ఉండదు!

■ ఎ. సునీత

జీన్స్, లెగ్గింగ్స్, జెగ్గింగ్స్ ధరించినప్పుడు సౌకర్యంగా ఉండే షార్ట్ కుర్తాలు బెటర్ ఛాయిస్. కాటన్, సింథటిక్ మెటీరియల్స్‌లో దొరికే ఈ చిట్టిపొట్టి కుర్తాలు స్టయిలిష్ లుక్ తెచ్చిపెట్టడంతో పాటు 'షార్ట్ అండ్ స్వీట్'గా కనిపిస్తాయి!

సొగసు



# షార్ట్ & స్వీట్

లతలు, పువ్వుల డిజైన్లు ఉన్న షార్ట్ కుర్తాలు యాంకిల్ లెంగ్త్ జీన్స్ మీదకు సూటవుతాయి. ఈ డ్రెస్‌కు పెన్సిల్ హీల్స్‌ను మ్యాచ్ చేస్తే చూడముచ్చటగా కనిపించవచ్చు.

చికన్ వర్క్ కుర్తాల్లో షార్ట్ లెంగ్త్ కూడా ఉంటాయి. ఇవి కాలేజీ అమ్మాయిలకు చక్కగా సూటవుతాయి. సినిమాలు, షికార్లకు ఈ రకం కుర్తాలు అనువైన స్టయిల్!

షార్ట్ కుర్తా ఫుల్ హ్యాండ్స్ వేసినా, షార్ట్ హ్యాండ్ ఉన్నా, స్లీవ్‌లెస్ అయినా.... ఎలా ఉన్నా అందంగానే ఉంటుంది. కాబట్టి సందర్భాన్ని బట్టి అనువైన కుర్తా ఎంచుకోవాలి!



'దిశ' ఘటన ఎన్నో ప్రశ్నలను లేవనెత్తింది. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల మీద దేశమంతా గళం విప్పుతోంది. ఈ నేపథ్యంలో, మహిళల భద్రతపై యు.ఎన్. ఉమన్ ఇండియా చేపట్టిన 'ఆరెంజ్ ది వరల్డ్' ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తోంది.

# మార్పు కోసం టిక్ 'టాక్'తో...




చైతన్యం

# KaunsiBadiBaatHai (కౌన్‌సీబడీబాత్‌హై)

ఇప్పుడు 'టిక్‌టాక్'లో విస్తృతంగా ట్రెండింగ్ అవుతున్న హ్యాష్‌ట్యాగ్. ఒక ఉన్నతాశయంతో చేపట్టిన ప్రచారానికి ఈ స్పందన మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది.

**ఇంతకీ దీని వెనుక ఉన్న కథేమిటి?**

ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న యు.ఎన్. ఉమన్ ఇండియా సంస్థ లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తోంది. 'మహిళలపై అఘాయిత్యాల నిరోధక ప్రపంచ దినోత్సవం' సందర్భంగా వినూత్నమైన ప్రచారాన్ని ఈ సంస్థ చేపట్టింది. మహిళలపై జరుగుతున్న హింస నుంచి ప్రపంచాన్ని విముక్తం చేయడం, ఆ దిశగా అవగాహన పెంచడానికీ, ఆచరణాత్మకమైన స్ఫూర్తిని ఇవ్వడం ఈ ప్రచారంలో ముఖ్యాంశాలు. దీని కోసం తక్కువ నిడివి వీడియోలకు ప్రపంచస్థాయిలో ప్రధాన గమ్యస్థానంగా మారిన 'టిక్‌టాక్'తో ఒప్పందం చేసుకుంది.

**ర్యాప్ ఫర్ ఛేంజ్!**

'ఆరెంజ్ ది వరల్డ్' పేరిట ఈ ప్రచారం నవంబర్ 25న (ప్రపంచ మహిళా హింసా నిరోధక దినం) ప్రారంభమయింది. పదహారు రోజుల పాటు కొనసాగి, డిసెంబర్ 10న (అంతర్జాతీయ మానవహక్కుల దినం) ముగుస్తుంది. దీనిలో భాగంగా టిక్‌టాక్ వినియోగదారులకు 'ర్యాప్ ఫర్ ఛేంజ్' అనే ఛాలెంజ్ విసిరారు. KaunsiBadiBaatHai కు మద్దతుగా వారు వీడియోలను రూపొందించేలా ప్రోత్సహిస్తున్నారు. మహిళలపై జరుగుతున్న హింసను రూపుమాపడానికీ, మహిళలపై జరిగే అన్ని హింసాత్మక రూపాల నుంచీ ప్రపంచాన్ని విముక్తం చేయడానికీ చిహ్నంగా ఆరెంజ్ రంగు అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. అందుకే KaunsiBadiBaatHai వీడియోల్లో ఆరెంజ్ రంగు ఛాయలు ఉండాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. అలాగే 'కౌన్‌సీ బడీ బాత్ హై' అనే ప్రచార ర్యాప్ గీతం తాలూకు సౌండ్ ట్రాక్‌ను టిక్‌టాక్ యూజర్లు ఉపయోగించుకోవచ్చు. ఢిల్లీకి చెందిన పదహారేళ్ళ అబ్బాస్ అలీ దీన్ని రాశాడు. ఆదిత్య షెఖావత్ సంగీతం అందించారు. మహిళలపై జరిగిన హింసాత్మక సంఘటనలను ప్రధానంగా పేర్కొంటూ, సామాజిక-సాంస్కృతిక రూపాల్లోని అనౌచిత్యాలను ఈ గీతం ప్రశ్నిస్తుంది.

GENERATION EQUALITY STANDS AGAINST RAPE




**89 కోట్ల వీక్షణలు...**

"మన పరిసరాలను మహిళలకూ, బాలికలకూ సురక్షితంగా మార్చాలి. వారిపై జరిగే హింస వల్ల కలిగే దుష్పరిణామాలు, చెల్లించాల్సిన మూల్యం చాలా ఉంటాయి. టిక్‌టాక్ భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రచారం చైతన్యం పెంచుతుందనీ, హింసపై మౌనాన్ని వీడి ప్రజలు సంఘటితమయ్యేలా చేస్తుందనీ మేము ఆశిస్తున్నాం" అంటున్నారు యు.ఎన్. ఉమన్ ఇండియా డిప్యూటీ కంట్రీ రిప్రజెంటేటివ్ నిష్ఠా శ్యామ్. వారం రోజుల్లో టిక్‌టాక్‌లో ఈ ప్రచారాన్ని దాదాపు 89 కోట్ల మంది వీక్షించడాన్ని గమనిస్తే ఈ ప్రచారం ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా వెళుతోందని స్పష్టమవుతోంది..

విజేత



విదేశీ విద్య అనేది సామాన్యులకు అందని ద్రాక్ష. అయితే అర్హతలు ఉంటే, విదేశీ విద్యను ఉచితంగా సొంతం చేసుకోవచ్చని నిరూపించింది స్రష్టవాణి. హైదరాబాద్‌కు చెందిన ఈ న్యాయ విద్యార్థిని ఏకంగా 60 లక్షల రూపాయల ఆస్ట్రేలియా స్కాలర్‌షిప్‌ను దక్కించుకుని వార్తల్లోకెక్కింది! తెలంగాణ నుంచి ఈ అవకాశం పొందిన తొలి న్యాయ విద్యార్థి ఆమె. 'ఛేంజ్ ది వరల్డ్' అనే 'వలింగాంగ్' యూనివర్సిటీ ఉపకార వేతనం గురించీ, అర్హత పొందడానికి తాను చేసిన కృషి గురించీ స్రష్టవాణి ఏం చెబుతున్నారంటే...

# ఆమె వాణి అదిరింది!

"నాకు విదేశాల్లో ఉన్నతవిద్య అభ్యసించాలనే కోరిక ఉండేది. న్యాయ విద్య పూర్తయిన తర్వాత ప్రయత్నాలు చేద్దామని అనుకున్నా. అయితే అదృష్టవశాత్తూ ఆ అవకాశం చదువు మధ్యలోనే దక్కింది. నేను పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లో అయినా... బెంగుళూరులోని రేవా యూనివర్సిటీలో 'లా' సీటు రావడంతో చేరిపోయా. మా దగ్గరి బంధువు ద్వారా 'ఛేంజ్ ది వరల్డ్' అనే స్కాలర్‌షిప్ ఒకటి ఉందనీ, ఆ స్కాలర్‌షిప్‌కి అర్హులైన అభ్యర్థుల కోసం 'స్టడీపాత్' కన్సల్టెన్సీ వెతుకుతోందనీ తెలిసింది.

అన్ని అర్హతలూ ఉండి, ఆర్థిక స్థోమత లేని కారణంగా విదేశాల్లో చదవలేని వారి కోసమే ఈ స్కాలర్‌షిప్. ఈ స్కాలర్‌షిప్‌తో నూటికి నూరు శాతం ట్యూషన్ ఫీజు మినహాయింపు పొందవచ్చు. అయితే దీన్ని పొందడానికి కేవలం విద్యార్హతలు ఒక్కటే సరిపోవు. అభిరుచులూ ఉండాలి. భవిష్యత్తు పట్ల స్పష్టమైన దృక్పథం కలిగి ఉండాలి. రాత పరీక్షలో కూడా అర్హత సాధించాలి. వీటన్నిటిలో నేను నెగ్గాను. అన్నిటికన్నా ముఖ్యంగా రెండు నిమిషాల నిడివి ఉండే వీడియో రికార్డు చేసి, స్కాలర్‌షిప్ అందిస్తున్న యూనివర్సిటీకి పంపించాలి. ఎంపికలో అదే కీలకమైన ఘట్టం!

**ఆ వీడియోలో....**

'ఛేంజ్ ది వరల్డ్'... పేరుకు తగ్గట్టు, నా రచనా వ్యాసంగాన్ని ఉపయోగించుకుని ప్రపంచంలో మార్పు ఎలా తీసుకురాగలనో 'వలింగాంగ్' యూనివర్సిటీ పెద్దలకు రెండు నిమిషాల నిడివిగల వీడియో ద్వారా వివరించాను. వీడియోలో తొలుత నన్ను నేను పరిచయం చేసుకుని, నాన్న అరవిందకుమార్, అమ్మ ఆశ



స్రష్టవాణి కుటుంబంతో షెల్లీ కర్నాటి, పీటర్ ముర్రే...

గురించి టూకీగా చెప్పాను. అలాగే నాకున్న కవితలు రాసే అభిరుచి ఆధారంగా లా విద్యకు, వృత్తికి ఎలా న్యాయం చేయగలనో చెప్పాను. రచనా వ్యాసంగం విద్యకు, పురోగతికి ఎలా దోహదపడుతుందో చెప్పాను. సూటిగా, స్పష్టంగా నేను ఇచ్చిన వివరణ వారికి నచ్చి నన్ను ఎంపిక చేశారు.

**ఇప్పటికీ నమ్మలేకపోతున్నా...**

బెంగుళూరులో నా రెండేళ్ల న్యాయ విద్య పూర్తయిపోయింది. కాబట్టి మిగతా రెండేళ్ల న్యాయ విద్యను కొనసాగించడానికి నాకు 'వలింగాంగ్' యూనివర్సిటీ వెసులుబాటు కల్పించింది. ఈ స్కాలర్‌షిప్ బహూకరించడానికి ఆస్ట్రేలియా నుంచి స్వయంగా యూనివర్శిటీ పెద్దలు రావడం గొప్ప విషయం. మరీ ముఖ్యంగా నాకు స్కాలర్‌షిప్ అందించడానికి వచ్చిన యూనివర్సిటీ ప్రతినిధి నా పుస్తకం 'వైల్డ్ వింగ్స్' నుంచి కొన్ని కవితలు వినిపించడంతో ఆశ్చర్యానికి లోనయ్యాను. ఇలాంటి స్కాలర్‌షిప్ నాలాంటి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా వెళ్తున్నా. ఈ అవకాశాన్ని నూటికి నూరు శాతం సద్వినియోగం చేసుకుని, యూనివర్సిటీ నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకుంటాను.

● **గోగుమళ్ల కవిత**, ఫొటోలు: **అశోకుడు**

## 'స్టడీపాత్' అండదండలు!

'ఛేంజ్ ది వరల్డ్' స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న కొన్ని లక్షల మంది అభ్యర్థుల్లో స్రష్టవాణి ఒకరు. ఈ స్కాలర్‌షిప్ దక్కించుకోవాలంటే ఆంగ్ల భాషకు సంబంధించిన పరీక్షలో కనీసం 6 పాయింట్లు సాధించాలి. ఇందులో విజేతగా నిలిచిన స్రష్ట ఆస్ట్రేలియాలో చదువుకుని, ఉద్యోగంలో స్థిరపడేంత వరకూ 'స్టడీపాత్' తనకు అండగా ఉంటుంది.

- **షెల్లీ కర్నాటి,** సి.ఈ.వో, స్టడీపాత్, ఆస్ట్రేలియా

## అన్ని విధాలా అర్హురాలు!

'వలింగాంగ్' యూనివర్శిటీ వరల్డ్ ర్యాంకింగ్‌లో 212, న్యాయ విద్యలో 78వ స్థానాల్లో ఉంది. స్రష్ట ఈ స్కాలర్‌షిప్‌కి ఎంపికవడానికి కారణం ఆమెలో ఉన్న ప్రత్యేకమైన అంశాలే! 'రచనా వ్యాసంగం ద్వారా ప్రపంచాన్ని మార్చగలను' అంటూ ఆమె చెప్పిన వీడియో వివరణ మమ్మల్ని ఆకర్షించింది. దాంతో ఈ స్కాలర్‌షిప్‌కి ఆమె అన్ని విధాలా అర్హురాలని నిర్ధారించుకుని ఎంపిక చేశాం!"

- **పీటర్ ముర్రే,** అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ మేనేజర్

# సాయంకాలపు సొబగులు!

నగ ధగ

సాధారణంగా రిసెప్షన్లు, పుట్టిన రోజు పార్టీలు, సంగీత్ లాంటి వేడుకలు సాయంత్రం వేళల్లోనే ఉంటాయి. ఆ సమయాల్లో ధరించే దుస్తులకు తగిన నగలతో ముస్తాబు అయితే ఆ వేడుకల్లో అందాల బొమ్మల్లా వెలిగిపోవచ్చు.



ఈవెనింగ్ పార్టీల్లో ధరించే లేత రంగులకు మ్యాచ్ అవ్వాలంటే, పూర్తి బంగారంతో తయారైనవి కాకుండా ముత్యాలు, కలర్ బీడ్స్, డైమండ్స్, అన్‌కట్స్‌తో తయారైన నగలు ధరించాలి. పూర్తి బంగారు నగలు ఇష్టపడేవారు భారీ నగలు



కాకుండా చూడడానికి స్టయిల్‌గా, సింపుల్‌గా ఉండే నగలే ఎంచుకోవాలి. పార్టీవేర్ నగల ట్రెండ్‌లో భాగంగా ఈ కోవకు చెందిన నగలు మార్కెట్లో దొరుకుతున్నాయి. వజ్రాల నగల్లో 4 నుంచి 5 లక్షల్లో నెక్లెస్‌లు ఎంచుకోవచ్చు.

**ఎలాంటి డైమండ్స్?**

**వజ్రాల నగలు:** వజ్రాల వెలుగుల ముందు ఎలాంటి ధగధగలైనా దిగదుడుపే! కాబట్టి ఈవినింగ్ పార్టీల కోసం డైమండ్ నగలను ఎంచుకోవడమే మేలు! వజ్రాల నగల మీద పెట్టుబడి ఎప్పటికీ వృథా కాదు. కాబట్టి రాళ్లు పొదిగిన తీరులో ప్రత్యేకత ఉన్న నగలను ఎంచుకోవాలి.

**స్వరోస్కీ:** ఇవి చూడడానికి అచ్చు గుద్దినట్టు వజ్రాల నగలనే పోలి ఉంటాయి. వజ్రాల నగలు కొనలేని వారికి ఈ నగలు చక్కని ప్రత్యామ్నాయం. అయితే తక్కువ ధరలో దొరికే ఈ అమెరికన్ డైమండ్స్ రకం రాళ్లు పెట్టుబడిగా పనికి రావు. మార్పిడి చేసే సమయంలో రిటర్న్ వ్యాల్యూ రాదు. కాబట్టి వజ్రాల నగలు ఎంచుకోవడమే మేలు!

**నగల అలంకరణ:** చోకర్ లేదా నెక్లెస్, బ్రేస్‌లెట్, హెవీ ఇయర్ రింగ్స్, వడ్డాణం... ఇలా పార్టీకి తగిన నగలు ధరించవచ్చు. ముత్యాలు, అన్‌కట్ డైమండ్స్‌తో తయారైన వడ్డాణాలు ఈవెనింగ్ పార్టీలకు సూటవుతాయి.



● **మంజులా రావు**
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్

విశేషం




# గీత... అందరి కోసం!

**శ్రీకృష్ణుణ్ణి వ్యాసుడు స్తుతించే గీతా ధ్యాన శ్లోకాలలోని నాలుగో శ్లోకం ఇలా చెబుతోంది: "ఉపనిషత్తులు' అనే కామధేనువు నుంచి శ్రీకృష్ణుడు అనే గోవుల కాపరి పితికిన పాలు భగవద్గీత. అర్జునుడు లేగ దూడ' అని. అయితే గోవు ఇచ్చిన పాలన్నీ కేవలం లేగ దూడ ఒక్కటే తాగలేదు. మిగిలిన పాలు ప్రజలవి! గీతామృతం కూడా ఒక్క అర్జునుడి కోసమే కాదు, తరతరాల యుగ యుగాల భారతీయుల కోసం!**

కురుక్షేత్రంలో అటు కౌరవ సేన, ఇటు పాండవ సేన యుద్ధానికి సన్నద్ధమవుతున్నాయి. అతిరథ మహారథులంతా సమరానికి సంసిద్ధంగా ఉన్నారు. శ్రీకృష్ణుడు రథాన్ని నడుపుతున్నాడు. అర్జునుడు ఆసీనుడై ఉన్నాడు. ఇంకో నిమిషంలోనో, అర నిమిషంలోనో బాణాలు సంధించడమే తరువాయి! ఇంతలో ఎదురుగా ఉన్న కౌరవ సేనను అర్జునుడు చూశాడు. భీష్మ, ద్రోణ, దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, వికర్ణాదులను వీక్షించాడు. అంతే! అర్జునుడి వెన్నులో సన్నని వణుకు.

"కృష్ణా! నేను యుద్ధం చెయ్యలేను" అని అన్నాడు అర్జునుడు.

అప్పుడు అర్జునుడికి (18 అధ్యాయాల్లో) 700 శ్లోకాల్లో సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు కృష్ణుడు. నాటికీ, నేటికీ, ఏనాటికీ ఉపకరించే సమాచారం అది. జీవితంలోని అయోమయాల్ని తీర్చి, గమ్యాన్ని చేర్చే దిక్సూచి అది. దాని పేరే భగవద్గీత! ఈ గీతోపదేశాన్ని శ్రీకృష్ణుడు ప్రశాంత వాతావరణంలో చేయలేదు. చల్లని గాలులు వీచే తపోవన ఆశ్రమ ప్రాంగణంలో చేయలేదు. హాయిగా పురాణ కాలక్షేపంలా ఓ దేవాలయంలో చెప్పలేదు. మరెక్కడ చెప్పాడు? యుద్ధరంగంలో చెప్పాడు. కల్లోలమైన మనసుకు ధైర్యాన్ని బోధిస్తూ చెప్పాడు. కష్టాలు వస్తే ఎలా చిరునవ్వు చిందిస్తూ ఉండాలో చెప్పాడు. స్థైర్యాన్నీ, ధైర్యాన్నీ ఎలా పొందాలో చెప్పాడు. అన్నిటికీ మించి- అసలు మనిషిగా నువ్వేం సాధించాలో చెప్పాడు.

"శతాబ్దాలుగా మనం దుఃఖించాం. దుఃఖించినది ఇక చాలు" అంటారు స్వామి వివేకానంద. అదే విధంగా శతాబ్దాలుగా ఆ గీతామృతాన్ని మనం పూజలకే పరిమితం చేశాం. పూజించింది చాలు. ఇక మనం ఆ పాలను తాగాల్సిన సమయం ఆసన్నమైంది. తాగి- నరనరానా, కణకణానా జీర్ణించుకోవాల్సి ఉంది. ఆ పాలు అందించే శక్తి శరీరమంతా వ్యాపించాల్సి ఉంది. ఆ పాలు నేల పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది.

మీరు ఒక నదిని దాటాలి. దాని పేరు 'జీవితం'. 'ప్రస్తుత స్థితి, లక్ష్యం' అనేవి రెండు తీరాలు. అంటే మీరు ఇప్పుడు ఉన్న తీరం నుంచి 'లక్ష్యం' అనే తీరానికి చేరుకోవాలి. కాలం ఆ నదిలో నీరులా ప్రవహిస్తోంది. కాలవాహిని అలల వాలున మీరు ఎదురీది, సాఫల్యం సాధించాలి. సమస్యల సుడిగుండాలు, కష్టాల తిమింగలాలు ఉండనే ఉన్నాయి. అయినా మీరు పయనించక తప్పదు తీరాన్ని చూడక తప్పదు. 'సంకల్పం' అనే పడవలో మీరు చేసే ప్రయాణానికి శ్రీకృష్ణుడే నావికుడు! భగవద్గీతే దిక్సూచి!!

ఈనాడు మనిషి ఆందోళనలకూ, ఒత్తిళ్ళకూ నిలయంగా మారాడు. నరాల బలహీనతకు కర్మాగారంగా, ఆత్మహత్యలకు కేంద్రంగా మారాడు. మానసిక దృఢత్వాన్నీ, ఆంతరంగిక అభివృద్ధినీ విస్మరించడమే దీనికి కారణం. మనిషి బయటకు ప్రయాణం చేస్తూ, తనలోకి ప్రయాణించడం మరచిపోవడమే ఇందుకు కారణం. ఈ రహస్యాన్ని పదుల శతాబ్దాల కిందటే కృష్ణుడు గుర్తించాడు. ఈ రోజున మన ఆత్మహత్యలకు కారణం 'ఆంతరంగికమైన ఆందోళన' అని ఆనాడే కృష్ణుడు గుర్తించాడు. ఆ రహస్యాల విశేషాలను భగవద్గీతలో గుదిగుచ్చి చెప్పాడు. అదీ భగవద్గీత విశిష్టత.

"నీవు నీ పని చేసుకుంటూనే స్వచ్ఛమైన, సమర్థమైన సహాయకారిగా సమాజానికి ఉపకరించాల"ని చెబుతోంది- గీత. జీవితంలోనే యోగులుగా ఉండమంటోంది - గీత. జీవించడంలోనే యోగత్వం పొందమంటోంది - గీత. నీవు పని చేస్తూ, అందరితోపాటు జీవిస్తూ, నీ మనసును క్రమపద్ధతిలో ఉంచుకోవాలని ఉద్ఘోషిస్తోంది - గీత. అలజడి వస్తే అదిరిపోకుండా, కష్టం వస్తే కుంగిపోకుండా యుద్ధం చేయమంటోంది - గీత. ఆగ్రహాన్ని నిగ్రహించుకొని, ఆవేశాన్ని అణచుకొని, కోపాన్ని అదిమిపెట్టుకొని ప్రశాంతంగా ఉండమంటోంది - గీత. నీలో ఉన్న దివ్యకాంతిని ముందుగా నువ్వే గుర్తించమంటోంది - గీత. అలా గుర్తించి... ఆ వెలుగులో నువ్వూ, లోకమూ కాంతిమయం కావాలంటోంది -గీత.

భగవద్గీత ఏడవ అధ్యాయంలోని తొలి శ్లోకంలో శ్రీకృష్ణుడు ఇలా అంటాడు: "అర్జునా! అనన్య ప్రేమతో నాయందు ఆసక్తి కలిగి ఉండి, యోగంలో నిమగ్నుడవవ్వు, నన్ను తెలుసుకో".

భగవద్గీతలో శ్రీకృష్ణుడు చాలాసార్లు ఇలాగే పేర్కొనడం కనిపిస్తుంది. "నాపై ఆసక్తి కలిగి ఉండు. నా నిజ స్వరూపం తెలుసుకో" అని అర్జునుడితో శ్రీకృష్ణుడు పదేపదే అంటాడు. ఇది కొంచెం స్వోత్కర్షలా అనిపించవచ్చు. కానీ దీని వెనుక ఒక అద్భుత స్ఫూర్తి దాగుంది. జీవితంలో అన్ని కోణాల్లో విజయం సాధించిన వ్యక్తి నుంచి స్ఫూర్తి పొందడం, అతణ్ణి అనుసరించడం చెడ్డ పని కాదు కదా! అందుకే శ్రీకృష్ణుడు ప్రతిసారీ ఆ మాట అంటున్నాడు. అర్జునుడు ఆయనను అనుసరించాడు. అందుకే ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో అజేయుడై నిలిచాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పిన చక్కని చిట్కాలను మనం అనుసరించి ముందుకు సాగాలి.

"అబ్బే, అదేం కుదరదు. మేం నాస్తికులం. శ్రీకృష్ణుడు దేవుడేమిటి?" అంటే అలాగే కానివ్వండి. కానీ ఆ చిట్కాల్ని గొంతులో పోసుకొని, నరనరానా జీర్ణించుకోవడంలో తప్పేముంది? అయినా 'కుదరదు' అంటారా? ఒక పని చేయండి. ఆ కృష్ణుడి స్థానంలో మీకు తెలిసిన సక్సెస్‌ఫుల్ పర్సన్ పేరు పెట్టుకోండి. గాంధీ, ఐన్‌స్టీన్, స్వామి రంగనాథానంద, మీ నాన్నగారు... మీ ఇష్టం. ఆ ప్రముఖుల జాబితా ఏదైనా కావచ్చు. వారి నుంచి స్ఫూర్తి పొంది, మంచి లక్షణాలను పొంది ముందుకు సాగండి. అప్పుడు యుద్ధంలో గెలుపు మీదే! ఆనాడు కురుక్షేత్రంలో పాంచజన్య శంఖారావంతో శ్రీకృష్ణుడు చెప్పింది ఇదే కదా! అర్జునుణ్ణి కర్మవీరుడైన అనాసక్త యోగిగా మార్చి, కర్తవ్యాన్ని నూరిపోసింది ఇదే కదా! జీవితమనే యుద్ధరంగంలో అన్నీ ఉండి, అసంతృప్తితో రగిలిపోతున్న వారికి 'స్థితప్రజ్ఞత్వం' అనే ఔషధాన్ని అందించిదీ ఇదే కదా! 'ఏం కావాలో తెలియడం లేదు కానీ మొత్తం మీద ఏదో కావాలి. ఆ ఏదో ఎక్కడ, ఎప్పుడు, ఎలా దొరుకుతుంది?' లాంటి ప్రశ్నలతో కాగి, కాలిపోతున్న వారికి సమాధానం కూడా ఇదే కదా! అదే కదా గీతాసారాంశం విశిష్టత!!

● ఆకెళ్ళ రాఘవేంద్ర

నవజీవనవేదం

## వాస్తవ స్వరూపం తెలుసుకోవాలి!

ఈవేళ సమాజంలో అత్యాచారాలు పెరిగిపోవడానికి, అక్రమ సంబంధాలు ఏర్పడటానికి, వివాహబంధాలు తెగిపోవడానికి, లంచగొండితనానికి అలవాటు పడడానికి ప్రధాన కారణం ఇంద్రియ నిగ్రహం లేకపోవడం. అనుభవిస్తున్న భోగాల మీద వాస్తవిక దృష్టి మనకు లేకపోవడం. మరి పూర్వం ఉన్నంతగా ఇంద్రియ నిగ్రహం ఎందుకు ఉండడం లేదు. దానికి కారణం శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో వివరించాడు. జాగ్రత్తగా ఉండమని చెబుతున్నాడు.

**యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః**

ఇంద్రియాలు సామాన్యమైనవి కావు. మదించి వేస్తాయి. కొన్ని పథకాలు రూపకల్పన చేసే సమయంలోనే విఫలమవుతాయని తెలుసు. అయినా తాత్కాలిక లబ్ధి కోసం చేస్తారు. ఇంకొన్నిసార్లు నిర్మాణ సమయంలోనే విఫలమయ్యే ఏర్పాట్లు చేస్తారు. దేవుడు కూడా ఈ మానవాళి రూపకల్పనలో ఒక మాయ చేశాడు. ఆ డిజైనే ఇంద్రియ వ్యామోహం. ఇంద్రియాలు ఏదో రకంగా కంగారు పెట్టేసి, రభస చేసేసి మనస్సును హరించి వేస్తాయి. అలాంటి ఏర్పాటు సృష్టిలో ఎందుకుందీ అంటే, ఒకటి నాశనం అవుతుంటే కొత్తది పుడుతుంది. ఇంద్రియాలు పండితుడైన వాణ్ణి కూడా కిందికి లాగేస్తాయి. ఆకులు, అలములు తిని ఏళ్ల తరబడి తపస్సులు చేసిన విశ్వామిత్రుడు, పరాశరుడు సైతం ఇంద్రియ నిగ్రహం కోల్పోయారు. ఇక ఈనాటి మామూలు మనుషుల సంగతేమిటి? వింధ్యపర్వతం సముద్రంలో తేలడం ఎంత నిజమో, మనుషులకు ఇంద్రియ నిగ్రహం ఉంటుందన్నది అంతే నిజం! అందుకే మనం ఇంద్రియాల విషయంలో ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండాలి. ఇంద్రియ నిగ్రహం ఉండాలంటే వస్తువు వాస్తవ స్వరూపాన్ని ఆలోచించాలి. ఈ స్త్రీని, పురుషున్ని గానీ పొందితే మనకు వచ్చేదేమిటి? ఈ బంగారం కానీ, డబ్బు గానీ పొందితే మనకు ఒరిగేదేమిటి? ధన కనక వస్తువులలో దేనిమీద వ్యామోహం కలిగినా ఒక్క క్షణం మనం ఆలోచిస్తే వాటి నుంచి బయటపడగలుగుతాం.





● గరికిపాటి నరసింహారావు

ధర్మపథం

## వ్యత్యాసం అదే!

బుద్ధుడు కొందరు శిష్యులను వెంటపెట్టుకొని ఒక రోజు గంగాతీరానికి వచ్చాడు. అక్కడి నుంచి ఆవలి తీరానికి చేరాలి. అందరూ పడవ ఎక్కారు. ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నాయి. చల్లని గాలి మెల్లగా వీచసాగింది. నావ సరంగు తెరచాపలు ఎత్తాడు. పడవ వేగం పెరిగింది. మధ్యాహ్నం దాటింది. సూర్యుణ్ణి క్రమేపీ నల్లని మేఘాలు కప్పేశాయి. వాతావరణం చాలా హాయిగా ఉంది. మరి కొద్దిసేపట్లో వర్షం పడేలా ఉంది. ఆ వాతావరణాన్ని చూసి కొందరు ప్రయాణికులు, మరికొందరు అన్యమత తీర్థ యాత్రికులు ఆ ఒడ్డునే ఆగిపోయారు.



బుద్ధుడు ఎక్కిన పడవ నది మధ్యకు చేరింది. ఆ చల్లని ఆహ్లాదకర వాతావరణంలో భిక్షువులు అడిగిన ప్రశ్నలకు బుద్ధుడు గంభీరంగా జవాబులు చెబుతున్నాడు.

"భిక్షువులారా! మానవ జీవితం దుఃఖమయం. ఆ దుఃఖం... ఇదిగో, ఈ నదిలో ప్రవహించే నీరు లాంటిది. ఈ నీటి ప్రవాహాన్ని దాటి, ఆవలి తీరానికి సురక్షితంగా చేరాలంటే ఇలాంటి బలమైన పడవ కావాలి. నా ధర్మం అటువంటిది. నా మార్గం అటువంటిది. అది మానవుల్ని కేవలం 'దుఃఖం' అనే నదిని దాటించే నావ లాంటిది. ఈ పడవ మనల్ని సురక్షితంగా ఆవతలి ఒడ్డుకు చేరుస్తుంది. అలాగని దీన్ని మనం నెత్తిన పెట్టుకొని మనం వెళ్ళాల్సిన చోటుకు తీసుకుపోతామా? నావ మీద ఎంత ప్రేమ ఉన్నా అది తగని పని. నదిని దాటించడంతో దాని పని ముగిసిపోయినట్టే! నా ధర్మం కూడా మిమ్మల్ని దుఃఖ ప్రవాహాన్ని దాటించి, అవతలకు చేర్చే సాధనం మాత్రమే! ఆ ప్రవాహాన్ని దాటాక దాని అవసరం ఇక ఉండదు. మీరు అప్పుడు కూడా దాన్ని నెత్తికి ఎత్తుకొని పోవాల్సిన అవసరం లేదు" అని చెప్పాడు.

భిక్షువులు శ్రద్ధగా వింటున్నారు. దూరంగా ఆకాశం గర్జిస్తోంది. పడవ నడిపేవారు కూడా బుద్ధుని ప్రబోధాల మీదే ధ్యాస పెట్టారు. పడవ నెమ్మదిగా అవతలి తీరానికి చేరింది. భిక్షువులు తాము బయలుదేరిన తీరం వైపు చూశారు. తమతో పాటు రాకుండా ఆ తీరంలోనే ఆకాశం వైపు చూస్తూ, అటూ ఇటూ తిరుగుతున్న వారు కనిపించారు.

పడవ దిగిన భిక్షువులు ఒడ్డుకు చేరగానే "భగవాన్! వారు ఇంకా అవతలే ఉండిపోయారు" అన్నారు బుద్ధుడితో.

"భిక్షువులారా! అవును. జలాశయాల మీద దాటిపోవడానికి సామాన్యులు, భీరులు, ప్రమత్తులు తెప్పలను వెతుక్కుంటూ ఉండే లోపే, ప్రజ్ఞానులు జలాశయాలను దాటి అవతలి తీరానికి చేరుకుంటారు. వారికీ, వీరికీ మధ్య వ్యత్యాసం అదే! నిరంతరం వెతుకులాట, ఏమరపాటు, అలసత్వం ఉంటే మనం ఎప్పుడూ ఉన్నచోటే ఉండిపోతాం. " అని ఆయన చెప్పాడు.

బుద్ధుని ప్రత్యేకత ఇదే! నిత్య జీవితంలో అనుభవంలోకి వచ్చే ప్రతి సంఘటననూ ఒక ఉదాహరణగా చూపించి, ధర్మాన్ని తేలిగ్గా అర్థమయ్యేలా చెప్పేవాడు. అందుకే ఆయనను 'మహాశాస్త' (మహా గురువు) అంటారు.

● బొర్రా గోవర్ధన్

సందేశం



## చేప కడుపులో సజీవంగా...

ఒకసారి యూనుస్ ప్రవక్త ప్రయాణిస్తున్న పడవ తుపానులో చిక్కుకుపోయింది. అది గాలికి చిగురుటాకులా వణికిపోసాగింది. పడవలో మరికొందరు ప్రయాణికులతో పాటు సామానుకూడా చాలా ఉంది. ప్రయాణికులు తమ సామాన్లను పడవ నుంచి విసిరేశారు, అయినా పడవలో బరువు ఇంకా ఎక్కువగా ఉంది. దాన్ని తగ్గించకపోతే పడవకు ప్రమాదం. కాబట్టి ఒక వ్యక్తిని సముద్రంలోకి విసిరేస్తే బరువు తగ్గుతుందనీ, మిగిన వాళ్ళు బతుకుతారనీ అనుకున్నారు. అందరి పేర్లతో చీటీలు రాసి, వాటిలో ఒకటి తీశారు. యూనుస్ ప్రవక్త పేరు వచ్చింది.

ఆయన చాలా మంచి వ్యక్తి అనీ, గౌరవనీయుడనీ వాళ్ళకు తెలుసు. అలాంటి మనిషిని సముద్రంలో వదిలెయ్యడానికి వాళ్ళు ఇష్టపడలేదు. మళ్ళీ చీటీలు తీశారు, యూనుస్ ప్రవక్త పేరే వచ్చింది. చివరిసారిగా చూద్దామని ఇంకోసారి తీశారు. అప్పుడు కూడా ఆయన పేరే వచ్చింది. 'ఇది అల్లాహ్ అభీష్టం' అని ఆయన గుర్తించారు. తనంతట తానే లేచి, అల్లాహ్ పేరు స్మరిస్తూ సముద్రంలో దూకారు. భారీ అలల్లో కలిసిపోయారు. అల్లాహ్ తుపానుతో కల్లోలంగా ఉన్న సముద్రంలోంచీ యూనుస్‌ను కాపాడడం కోసం ఒక చేప ఆయనను మింగేసేలా చేశాడు.

ఆయన కళ్ళు తెరిచేసరికి, తడితడిగా, మెత్తగా ఉన్న నేల మీద ఉన్నట్టు భావించారు. చుట్టూ ఉన్న ప్రదేశం మూసేసిన గుహలా ఉంది. చాలా చీకటిగా ఉంది. కెరటాల్లో పడవలకు తగిలే కుదుపుల వంటివి ఆయనకు తగులుతున్నాయి. దీంతో తాను ఒక చేపలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అల్లాహ్‌ను యూనుస్ తలచుకొని, ఇంతకుముందు అల్లాహ్ అభీష్టాన్ని సకాలంలో గుర్తించనందుకు పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఆయన ప్రార్థనను అల్లాహ్ ఆలకించాడు. ఆయనను కక్కేయాల్సిందిగా చేపను ఆజ్ఞాపించాడు. వెంటనే తనను పైకి ఏదో తోసేస్తున్న అనుభూతి యూనుస్‌కు కలిగింది. మెత్తని నేలమీదకు వచ్చి పడ్డారు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించారు.

ఒక నిర్జన ప్రదేశంలో ఒంటరిగా, బలహీనంగా ఒక ఆకుల పొదలో యూనస్ పడి ఉన్నారు. ఎండ నుంచి ఆ ఆకులు రక్షణ కల్పిస్తున్నాయి. అక్కడ ఉన్న పండ్లు, కాయలతో ఆయన ఆకలి తీర్చుకున్నారు. శక్తిని పుంజుకొని, తన స్వస్థలమైన నైనవాహ్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రజల్లో వచ్చిన మార్పు ఆయనకు ఆనందం కలిగించింది. వారు ఆయనను సాదరంగా స్వాగతించి, తాము నిజమైన దేవుణ్ణి విశ్వసించడం ప్రారంభించామని చెప్పారు. వారంతా కృతజ్ఞతా సూచకంగా ప్రార్థనలు చేశారు.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలిపారు: "యూనుస్‌ను చేప మింగేసింది. అప్పుడు అతను తనను తానే నిందించుకోసాగాడు. ఒకవేళ (అల్లాహ్) పవిత్రతను అతను కొనియాడడంలో నిమగ్నుడై ఉండకపోతే, పునరుత్థాన దినం వరకూ చేప కడుపులోనే ఉండిపోయేవాడు."

(దివ్య ఖుర్‌ఆన్- అస్ సఫ్ఫాత్ 37: 141-143)

● మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం



## మనసు సారవంతం కావాలి!

ఒక రోజున యేసు ప్రభువు బోధ వినాలని చాలా మంది ప్రజలు ఆయన చుట్టూ చేరారు. వారందరినీ చూసి చిరునవ్వు నవ్విన యేసుప్రభువు ఒక కథ చెప్పాడు.

"ఒక రైతు తన పొలంలో విత్తనాలు చల్లడానికి వెళ్ళాడు. ఆ విత్తనాలు రకరకాల ప్రదేశాల్లో పడ్డాయి. కొన్ని దారిలో పడ్డాయి. మరికొన్ని రాళ్ళ మీద పడ్డాయి. ఇంకొన్ని ముళ్ళ పొదల్లో పడ్డాయి. మరికొన్ని సారవంతమైన నేల మీద పడ్డాయి. దారిలో పడిన విత్తనాలను పక్షులు వచ్చి, తిన్నాయి. రాళ్ళ మీద పడిన విత్తనాలు చాలా కొద్ది సమయంలోనే ఎదిగాయి. కానీ ఎండ వేడికి చచ్చిపోయాయి. ముళ్ళ పొదల్లో పడిన విత్తనాలు కూడా మొలిచినా, చుట్టూ ఉన్న ముళ్ళని అవి అధిగమించలేకపోయాయి. ఇక సారవంతమైన మట్టిలో పడిన విత్తనాలు లోతుగా నాటుకున్నాయి, పటిష్టంగా పెరిగాయి, మంచి ఫలాన్ని ఇచ్చాయి."

కథను ముగించిన తరువాత ఆయన ఇలా చెప్పాడు:

"దేవుని వాక్యాలు విత్తనాలలాంటివి. కఠినమైన హృదయం ఉన్న వారి చెవుల్లో పడిన వాక్యాలు దారిలో పడిన విత్తనాలు. అలాంటి వ్యక్తులు దేవుని వాక్యం విన్నా, దాన్ని ఆమోదించరు. సువార్తపై కేవలం ఆసక్తి చూపించే వ్యక్తులకు వినిపించిన వాక్యాలు రాతి మీద పడిన విత్తనాలు. పరీక్ష ఎదురైనప్పుడు నిలబడేటంత దృఢంగా వారి విశ్వాసం ఉండదు. ఇక, కొందరు వ్యక్తులు సువార్తను స్వీకరిస్తారు, కానీ జీవితంలో అనేక ప్రలోభాలూ, సమస్యలూ వారి మనసులనూ, ఆలోచనలనూ ఆక్రమిస్తాయి. వారు ముళ్ళ పొదలో పడిన విత్తనం లాంటివారు. సారవంతమైన నేల మీద పడిన విత్తనం లాంటి విశ్వాసి దేవుని వాక్యాన్ని వింటాడు, స్వీకరిస్తాడు, దాని వేర్లను తనలో లోతుగా నిలుపుకొంటాడు. దానితో పాటే జీవితంలో ఎదుగుతాడు".

దేవుని వాక్యాన్ని స్వీకరించే స్థితికి విశ్వాసి తనను తాను సిద్ధం చేసుకోవాలి. మనసును సారవంతం చేసుకోవాలి.

లిటిల్స్

దారి కనుక్కోండి!



## ఆక్సిజన్ లేకుంటే తుప్పు పట్టదు

కిడ్‌సైంటిస్ట్

**కావలసినవి:** ● రబ్బరు బిరడా ఉన్న సీసా ● చిన్న గాజు గొట్టం ● ఇనుపరజను ● కొద్దిగా వెనిగర్.

మనుషులు, జంతువులు జీవించడానికి ఆక్సిజన్ అవసరం. ఆ విషయం మీకు తెలుసు కదా! అలాగే గాలిలో ఉండే తేమ ఇనుముతో కలవడం వల్ల తుప్పు పడుతుంది. అది రసాయన చర్య. అంటే ఆక్సిజన్ ఉంటేనే ఇనుము తుప్పు పడుతుంది. ఈ విషయాన్ని ప్రయోగం ద్వారా నిరూపిద్దాం. ముందుగా కొద్దిగా ఇనుపరజను, నీళ్లతోనూ, వెనిగర్‌తోనూ తడిపి సీసాలో వెయ్యండి. గాజు గొట్టంను రబ్బరు బిరడాలో నుంచి దూర్చి సీసా మూతి బిగించండి. బొమ్మలో చూపిన విధంగా గాజు గొట్టం సగం ఖాళీగా ఉన్న వైపు, సగం నీళ్లున్న గ్లాసులో పెట్టండి. ఇప్పుడు ఏం జరుగుతుందో తెలుసా? ఇనుపరజను ఆక్సిజన్‌ను వాడుకుంటుంది. ఇది నెమ్మదిగా జరిగినప్పటికీ గాజు గొట్టంలోని నీళ్ల వల్ల మనకు తెలుస్తుంది. మొత్తం ఆక్సిజన్ అంతా ఉపయోగించుకోగానే సీసాలో ఐదోవంతు గాజు గొట్టంలో నీళ్లు నిండి ఉంటాయి. దీనివల్ల వాతావరణంలో 1/5వ వంతు ఆక్సిజన్ నిండి ఉందని రుజువు అవుతుంది.



### సరైన నీడను గుర్తించండి



### పదాలను పట్టికలో కనిపెట్టండి

letter A

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| P | S | A | N | A | N | C | H | O | R | P |
| L | P | Q | L | E | A | P | R | A | U | Y |
| A | B | U | L | A | P | P | L | E | B | R |
| X | E | A | A | C | I | J | C | Y | M | A |
| E | H | R | O | B | C | T | K | T | A | N |
| P | O | I | S | C | Y | C | E | R | I | T |
| Z | J | U | M | K | A | P | R | O | N | D |
| Z | N | M | R | I | L | R | U | C | E | S |
| L | A | M | B | U | L | A | N | C | E | H |
| J | I | S | E | E | N | G | I | D | E | I |
| E | A | C | C | O | R | D | I | O | N | P |




### డైలీ సుడోకు-215

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | | | 2 | | 7 | | 3 | |
| | | | 3 | | | 5 | | 6 |
| 5 | | 8 | | 6 | | 4 | 2 | |
| | | | 9 | | | | 7 | 1 |
| | | 5 | | | | 9 | | |
| 1 | 6 | | | | 4 | | | |
| | 4 | 1 | | 7 | | 3 | | 9 |
| 9 | | 2 | | | 3 | | | |
| | 7 | | 4 | | 1 | | | 2 |

**ఎలా పూరించాలి?**

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 214 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 9 | 8 | 5 | 4 | 3 | 1 | 2 | 7 |
| 3 | 4 | 1 | 8 | 2 | 7 | 9 | 5 | 6 |
| 5 | 7 | 2 | 1 | 9 | 6 | 4 | 3 | 8 |
| 7 | 1 | 6 | 9 | 5 | 2 | 8 | 4 | 3 |
| 4 | 2 | 3 | 7 | 1 | 8 | 5 | 6 | 9 |
| 9 | 8 | 5 | 6 | 3 | 4 | 2 | 7 | 1 |
| 2 | 6 | 7 | 4 | 8 | 1 | 3 | 9 | 5 |
| 1 | 3 | 9 | 2 | 6 | 5 | 7 | 8 | 4 |
| 8 | 5 | 4 | 3 | 7 | 9 | 6 | 1 | 2 |



Adhiroh Creative Signs
PRESENTS
మిస్ మ్యాచ్
....is the real Match
నేడే విడుదల
NV NIRMAL KUMAR
G SRIRAM RAJU - K BHARAT RAM
BHUPATHY RAJA GANESH CHANDHRRA GIFTON ELIAS
Mis(s) Match




నేడే విడుదల
KAUSHIK REDDY PRESENTS
అశ్వమేధం
DIRECTOR NITIN G
INTRODUCING ACTION HERO DHRUVA KARUNAKAR
A NEW AGE ACTION THRILLER
WORLDWIDE RELEASE BY LAXMI NARAYANA MOVIES




DWAYNE JOHNSON
JACK BLACK
KEVIN HART
KAREN GILLAN
NICK JONAS
AWKWAFINA
జుమాంజీ
మరో ప్రపంచం
IN ENGLISH, HINDI, TAMIL & TELUGU
REAL D 3D, 3D, IMAX 3D, 4DX & MX4D
DECEMBER 13
#Jumanji
/JumanjiMovie
/sonypicturesofindia
/sonypicsindia
/sonypicturesindia
KFC ENTERTAINMENT RELEASE




నేడే విడుదల
కామాగ్ని కీలల్లో కాలి భూడిదైపోయిన
డాక్టర్ అమృత యథార్థ కథే ఈ కలియుగ
కలియుగ
Ch Subramanyam Durga Malleshwar Rao M.A Tirupathi
ADITYA MUSIC




KCW SARASWATHI SUKLA PRESENTS
KARTIKEYA CREATIVE WORKS
SVE RELEASE
FROM THE MAKERS OF RX100
ప్రపంచ వ్యాప్తంగా
నేడే విడుదల
90ML
Producer ASHOK REDDY GUMMAKONDA
Written & Directed by SEKHAR REDDY YERRA
ANUP RUBENS CHANDRABOSE
J. YUVARAJ S.R. SEKKHAR GM SEKHAR VENKAT K. SURYA NARAYANA




నేడే విడుదల
'మంచి రసగుల్లా లాంటి సినిమా'
PRESENTS
A FLYING COLOURS ENTERTAINMENT PRODUCTION
భాగ్యనగరవీధుల్లో
గమ్మత్తు
NO ACTION ONLY COMEDY NO SENTIMENT
DIRECTOR-PRODUCER Y SRINIVASA REDDY
STORY-SCREENPLAY-DIALOGUES PARAM SURYANSHU MUSIC SAKETH KOMANDURI DOP BARANI K DARAN EDITOR AVULA VENKATESH
ART DIRECTOR RAGHU KULKARNI LINE PRODUCER CHITRAM SRINU CHOREOGRAPHER RAJ PYDE
EXECUTIVE PRODUCER DHANUNJAYA KUMAR EXECUTION NARAYANA JAMPA PRO VAMSI KAKA
నవ్వుకునోళ్లకు నవ్వుకున్నంత!
U/A
ADITYA MUSIC

# మళ్లీ నిరీక్షణే!

(మొదటి పేజీ తరువాయి)

చోటు చేసుకుంది. షా పిలుపు కోసం గురువారం అర్ధరాత్రి దాకా జగన్ వేచి చూసినా ఫలితం లభించలేదు. గురువారం మధ్యాహ్నం వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి, లోక్‌సభలో వైసీపీ పక్ష నేత మిథున్ రెడ్డి అమిత్‌షాను కలిశారు. జగన్‌కు అప్పాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. రాత్రి పది తర్వాత తన నివాసానికి రావాల్సిందిగా ఆయన సూచించినట్లు తెలిసింది. రాత్రి 10.30 గంటలకు అమిత్‌షాను జగన్ కలుస్తున్నారని మీడియాకు సమాచారం అందింది. గురువారం సాయంత్రమే జగన్ ఢిల్లీకి చేరుకున్నారు. రాత్రి 10 గంటల సమయంలో సీఎం ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్.. అమిత్‌షా నివాసానికి వెళ్లారు. అయితే, ఆయన కార్యాలయ వర్గాలు జగన్‌కు అప్పాయింట్‌మెంట్‌పై ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. నిర్దిష్టమైన సమయం కూడా ఇవ్వలేదు. ప్రవీణ్ ప్రకాశ్ నుంచి ఫోన్ రాగానే షా నివాసానికి బయలుదేరాలని జగన్ కూడా ఎదురు చూశారు. కానీ, అర్ధరాత్రి వరకు వేచి చూసినా ఇదే పరిస్థితి కనిపించింది. ప్రవీణ్ ప్రకాశ్ కూడా అమిత్‌షా నివాసం నుంచి తిరిగి వచ్చేశారు. దీంతో గురువారం అప్పాయింట్‌మెంట్ లేనట్లేనని, బహుశా శుక్రవారం సమయం ఇవ్వవచ్చుననే అంచనాకు వచ్చారు. జగన్‌కు అక్టోబరు 21వ తేదీన కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఆయన ఆరోజు మధ్యాహ్నం ఢిల్లీకి వచ్చినప్పటికీ అమిత్‌షాను కలవలేకపోయారు. మరుసటి రోజున, అదికూడా అమిత్‌షా పుట్టిన రోజున ఆయనను కలిసి శుభాకాంక్షలు మాత్రమే చెప్పగలిగారు. ఇక... శుక్రవారం ఉదయం జగన్ ప్రధానిని కలిసి ఉక్కు పరిశ్రమ శంకుస్థాపనకు.. వచ్చే నెల 9వ తేదీన 'అమ్మ ఒడి' కార్యక్రమం ప్రారంభానికి రావాలని ఆహ్వానిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే... అమిత్‌షా అప్పాయింట్‌మెంట్‌పైనా స్పష్టత కోసం వేచిచూస్తున్నాయి.

**ఆకస్మికంగా ఢిల్లీకి...:** సీఎం జగన్ ఢిల్లీ పర్యటన ఆకస్మికంగా ఖరారైంది. గురువారం ఆయన అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన కియ కారు గ్రాండ్ ఓపెనింగ్ వేడుకకు హాజరయ్యారు. ఆ తర్వాత తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. అధికారిక కార్యక్రమాలకు ప్రధానిని, హోంమంత్రిని ఆహ్వానించాలని నిర్ణయించి... వారి అపాయింట్‌మెంట్ కోరుతూ అభ్యర్థనలు పంపారు. అనంతరం జగన్ హుటాహుటిన ఢిల్లీకి బయల్దేరారు.

**అనంతలో ముభావంగా...:** గురువారం ఉదయం అనంతపురం జిల్లాలో 'కియ' కార్ల పరిశ్రమ ప్రారంభోత్సవంలో జగన్ కాస్త ముభావంగా కనిపించారు. తన ప్రసంగాన్ని కూడా మూడు నిమిషాల్లో ముక్తసరిగా ముగించారు. అనంతపురం పర్యటనలో ఉండగానే తన ఢిల్లీ టూర్‌ను ఖరారు చేసుకున్నారు. సీఎం ఢిల్లీ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం కూడా ఉందా అనే చర్చ మొదలైంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. బీజేపీకి తాను ఏనాడూ దూరం కాలేదని వ్యాఖ్యానించారు. అమిత్‌షా అంటే తనకు ఇష్టమని.. వైసీపీ నాయకులకు మాత్రం భయమని ఎద్దేవా చేశారు. పవన్‌ను తాము పట్టించుకోవడమే లేదని.. రాజకీయంగా గుర్తించడం లేదని మంత్రులు, వైసీపీ నేతలు అంటూనే.. ఆయనపై విమర్శల దాడిని తీవ్రతరం చేశారు. ఇదే సమయంలో 'కడప ఉక్కు' శంకుస్థాపనకు ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళ్లడం ప్రాముఖ్యం సంతరించుకుంది.

## జగన్ సర్కారు నిర్ణయం

**▸▸ ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది..లోక్‌సభలో కేంద్ర మంత్రి వెల్లడి**

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) సమీక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈ రంగంలో పెట్టుబడిదార్ల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని కేంద్ర పునరుత్పాదక ఇంధన, విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ అన్నారు. గురువారం లోక్‌సభలో టీడీపీపీ నేత గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. జగన్ ప్రభుత్వ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌లోనే కాక దేశంలో విద్యుత్ రంగం అభివృద్ధిపైనే వ్యతిరేక ప్రభావాన్ని చూపుతోందని తెలిపారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిదారులతో కుదుర్చుకున్న పీపీఏల సమీక్షకు సంబంధించి కేంద్ర హోం శాఖతో తాము ఎలాంటి చర్చలు జరపలేదని చెప్పారు.

# కియాకు అండ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యక్షంగా, ఏడు వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. అనుబంధ పరిశ్రమల ద్వారా మరో 3,500 మందికి ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయని చెప్పారు. కియాకు అనుకూలంగా వ్యవహరిస్తామని.. తమది క్రియాశీల ప్రభుత్వమని పేర్కొన్నారు. కియా పరిశ్రమ భారతదేశంలో అధికారికంగా తమ ఉత్పత్తులు ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. సంస్థ భారత్ విభాగం ఎండీ-సీఈవో క్యూఖ్యాన్ షిమ్ మాట్లాడుతూ.. కియా ప్రీమియం ఎంపీవీ మోడల్‌ను 2020లో ప్రారంభిస్తామని తెలిపారు. 'భారతదేశంలో మా సంస్థకు చెందిన యుటిలిటీ వాహనం బ్రాండ్ ఇమేజ్‌ను బలోపేతం చేసుకోనుంది. అక్టోబరు, నవంబరుల్లో సెల్టోస్ విక్రయాలు బాగున్నాయి. ఇది దేశంలోనే అత్యుత్తమ విక్రయ కాంప్యాక్ట్ ఎస్‌యూవీగా నిలిచింది. అనంతపురంలో మా తదుపరి ఉత్పత్తి ప్రీమియం కార్నివాల్ ఎంపీవీని 2020 ఫిబ్రవరిలో జరిగే ఇండియా ఆటోఎక్స్‌పోలో ప్రదర్శిస్తాం' అని వెల్లడించారు. కార్యక్రమంలో కొరియన్ అంబాసిడర్ షిమ్ బాంగ్ కిల్, కియా గ్లోబల్ సీఈవో హన్ వూ పార్క్, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, మేకపాటి గౌతమ్‌రెడ్డి, శంకరనారాయణ, గుమ్మనూరు జయరాం, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ, కలెక్టర్ గంధం చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

### సీఎం ప్రసంగంపై యువత నిరుత్సాహం..

గ్రాండ్ ఓపెనింగ్ వేడుకలో జిల్లా వెనుకబాటుతనం, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి వంటి అంశాలపై సీఎం మాట్లాడతారని యువత ఆశించింది. కానీ ఆయన ముక్తసరి ప్రసంగంతో నిరుత్సాహానికి గురయ్యారు. ప్రధానంగా పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకు ఉద్యోగాలిచ్చే ఊసే జగన్ ఎత్తకపోవడం విమర్శలకు దారితీస్తోంది. మూడున్నర నిమిషాలు మాత్రమే మాట్లాడి ఆయన తిరుగు పయనమవడంతో వైసీపీ శ్రేణులూ నిరుత్సాహపడ్డాయి.

## కొత్త ఏడాదిలో కొత్త కార్లు

- ▸▸ ఎంపీవీ, ఎస్‌యూవీలకు ప్రణాళిక
- ▸▸ 22 నెలల్లో నిర్మాణం పూర్తి
- ▸▸ 3 నెలల్లోనే రెండో షిఫ్టు ఉత్పత్తి
- ▸▸ 4 నెలల్లో 40 వేల కార్ల విక్రయం
- ▸▸ 'అనంత' నుంచే దేశమంతటా సరఫరా
- ▸▸ త్వరలో మూడో షిఫ్టులో ఉత్పత్తి
- ▸▸ కియా కర్మాగారం పనితీరు

అనంతపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిన 22 నెలల్లోనే అనంతపురం జిల్లాలో కంపెనీ నిర్మాణం పూర్తిచేసిన కియా.. 3నెలల్లో రెండో షిఫ్టులో కూడా ఉత్పత్తి ప్రారంభించింది. తొలికారు సెల్టోస్‌ను మిడ్ ఎస్‌యూవీ రేంజ్‌లో ఉత్పత్తి చేసింది. వచ్చే ఏడాదిలో కొత్త మోడల్స్‌ను తీసుకురానుంది. మల్టీపర్పస్ వెహికల్ (ఎంవీ), ఎస్‌యూవీ ఉత్పత్తిని ప్రారంభించనుంది. ఎంవీకి కార్నివాల్ అని పేరుపెట్టింది. సుమారు రూ.40 లక్షల ధరతో కార్నివాల్‌ను వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభించి విక్రయించనుంది. దేశం మొత్తానికీ అనంతపురం జిల్లాలోని ప్లాంటు నుంచే కార్లను సరఫరా చేస్తుండడం విశేషం. దేశవ్యాప్తంగా 160 నగరాల్లో షోరూమ్‌లు నిర్వహిస్తోంది. వాటన్నిటికీ ఇక్కడి నుంచే కార్లను పంపుతోంది. గతంలో ట్రయల్ ప్రొడక్షన్ ప్రారంభించిన ఆ కంపెనీ ...ఇప్పుడు అన్ని విభాగాలను పూర్తిచేసి గురువారం మరోసారి గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం నిర్వహించింది. ఈ ప్లాంటు కోసం 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. ఇక్కడ తయారైన తొలి కారు సెల్టోస్.. విక్రయాలు ప్రారంభించిన మొదటిరోజే 6,064 కార్లను విక్రయించి రికార్డు సృష్టించింది. తొలి 4 నెలల్లో 40,649 కార్లను అమ్మింది. ప్లాంటు, అనుబంధ విభాగాల్లో కలిపి 12 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. ఈ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 70 వేల కార్లు కాగా.. దీనిని త్వరలోనే ఏడాదికి 3లక్షల ఉత్పత్తి స్థాయికి చేరుకునేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం రెండు షిఫ్టుల్లో ఉత్పత్తి చేస్తున్న ఈ ప్లాంటు.. మూడో షిఫ్టు ఉత్పత్తినీ రాబోయే రోజుల్లో ప్రారంభించనుంది.

### 450 రోబోలు..

కియాకు ప్రపంచవ్యాప్తంగా 14 కార్ల తయారీ ప్లాంట్లు ఉండగా.. మన రాష్ట్రంలోనిది 15వది. అనంతపురం జిల్లా ఎర్రమంచి వద్ద నిర్మించిన ఈ కర్మాగారం అత్యంత అధునాతనమైనది. ఒకరకంగా చెప్పాలంటే కియా ఇతర ప్లాంట్ల కంటే ఆధునికం. కాలుష్య ఉద్గారాలు జీరో స్థాయిలో ఉండేలా రూపొందించింది. ఈ ప్లాంటులో ఉన్న 450 రోబోలు.. బాడీ షాప్, పెయింట్, అసెంబ్లింగ్ సెక్షన్లలో తమ పని తాము చేసుకుంటూ వెళ్తాయి. మరోవైపు.. నైపుణ్యాలతో సంబంధం లేని ఉద్యోగాలన్నీ స్థానికులకే కియా కల్పిస్తుంది. నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాలను ప్రస్తుతానికి బయటివారికి ఇచ్చినా.. ఇక్కడే నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని కూడా ఏర్పాటుచేసి స్థానికులకు శిక్షణ ఇస్తోంది. అంటే రాబోయే రోజుల్లో నైపుణ్యాలున్న ఉద్యోగాలు కూడా స్థానికులకే వచ్చే అవకాశాలున్నాయి. పలు అనుబంధ యూనిట్లు కూడా వచ్చాయి. కియా ప్లాంటు ఏర్పాటుతో అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిపై భూముల విలువలు పెరిగాయి. హైవేకు అటూ ఇటూ ఒకప్పుడు ఖాళీ బీడు భూములు మాత్రమే దర్శనమిచ్చేవి. గత కొన్నేళ్లలో వచ్చిన యూనిట్ల ఫలితంగా ఇప్పుడు పలుచోట్ల నిర్మాణాలు, ప్లాంట్లు పూర్తి కావస్తున్నాయి.

## క్యా 'కియా' జగన్‌జీ

**▸▸ నిన్నటి దండుగ.. నేడు పండుగెలా అయ్యిందో!**

**▸▸ ట్విటర్‌లో లోకేశ్**



అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "టీడీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమానికి పేర్లు మార్చడం, రంగులేయడం, మళ్లీ మళ్లీ ప్రారంభోత్సవాలు చేయడం... క్యా 'కియా' జగన్మోహన్‌రెడ్డి సాబ్! మీ చేతకానితనం వల్ల దేశమంతా ఏపీని చూసి నవ్వుతోంది" అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. గురువారం ట్విట్టర్ వేదికగా విమర్శలు సంధించారు. "వైఎస్ జగన్ గారూ, ముద్దొస్తున్నాడని పక్కింటివారి పిల్లోడికి మీ ఇంటి పేరు పెట్టుకొన్నట్టే: చంద్రబాబు తెచ్చిన కియా మీ నాయన మహామేత తెచ్చాడనడం లాగే ఉంది. చంద్రన్న ప్రారంభించిన కియాకి మళ్లీ రిబ్బన్ కట్ చేయడానికి సిగ్గనిపించలేదా?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. "కమీషన్ల కోసమే చంద్రబాబు కియా తెచ్చారన్నారుగా..! మరి నిన్న అదే పరిశ్రమ ప్రారంభానికి ఎంత కమీషన్ ముట్టిందో మీకు? మీరు విపక్షంలో ఉంటే కియా దండగ. మీరు సీఎం అయితే కియాతో పండగా?" అన్నారు.

### ఉల్లి కోసం ఉద్యమాలు చేయాలా?

"ఆరు నెలల జగన్ పాలనలో ప్రజలు ఇసుక కోసం ధర్నాలు, ఉల్లి కోసం ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. కేజీ ఉల్లిపాయల కోసం కూడా ప్రజలు ప్రాణాలు తీసే పరిస్థితి తెచ్చింది ఈ ప్రభుత్వం. విజయనగరంలో పరిస్థితి ఇదీ. గతంలో చంద్రబాబు పాలనలో ఉల్లిపాయల ధరలు పెరిగితే, రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ ఉల్లిపాయలు సరఫరా చేశాం. కానీ 30 మంది సలహాదారులను పెట్టుకొని కూడా ప్రజలను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు జగన్ గారూ" అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

## 'ఫైరింగ్ రేంజ్' భూములు వెనక్కి

**▸▸ అనంతలో రక్షణశాఖకు కేటాయింపు రద్దు**

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాల్లో ఫీల్డ్‌ఫైరింగ్ రేంజ్ కోసం రక్షణశాఖకు ఇచ్చిన భూములను వెనక్కు తీసుకుంటూ రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. భూములు కేటాయించి పదేళ్లు అవుతున్నా, ఇంత వరకు రక్షణ శాఖ నుంచి రూ 325.కోట్లు సర్కారుకు చేరలేదు. పైగా, నిర్వాసితులకు పరిహారం విషయంలో స్పష్టత లేదు. దీంతో ఆ భూములను వెనక్కి తీసుకొని, రైతులకే తిరిగి అందించాలని సర్కారు ఉత్తర్వులు ఇచ్చింది. ఇకపై రైతులు ఆ భూములను సాగుచేసుకోవచ్చు. అవసరానికి అమ్ముకోవచ్చు అంటూ ఉత్తర్వుల్లో స్పష్టతనిచ్చింది. అనంతపురం జిల్లా ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కనగానపల్లి, కంబదూరు మండలాల పరిధిలోని 14,780.14 ఎకరాలను రక్షణ శాఖకు 2009 ఏప్రిల్ 20 న సర్కారు కేటాయించింది. నాటి భూ కేటాయింపు ఉత్తర్వు ల ప్రకారం, రక్షణ శాఖ కొన్ని నిబంధనలు పాటించడంతోపాటు నిర్వాసితుల పునరావాసంలో పాల్గొనాలి. ఇందుకోసం రూ.352 కోట్లపైనే ఖర్చుకానుంది. ఈ సొమ్మను రక్షణ శాఖే భూ సేకరణ విభాగంలో డిపాజిట్ చేయాల్సి ఉంది. అయితే, పదేళ్లు గడుస్తున్నా డిపాజిట్ సొమ్మురాక పోగా, భూ వినియోగంపై నిబంధనల మేరకు రక్షణ శాఖ నుంచి స్పష్టత రావడం లేదు. మరోవైపు ఆ భూములను రైతులు కూడా ఉపయోగించుకోలేకపోతున్నారు. దీంతో ఆ కేటాయింపును రద్దు చేస్తూ రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకుంది. అదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి ఆమోదం తీసుకుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు (జీవో 492) జారీ చేసింది.

## విద్యార్థులు తినే అన్నమే టీచర్లకు కూడా!

**▸▸ ఆహార నాణ్యత కోసం సంక్షేమ గురుకులాల్లో సరికొత్త ప్రయోగం**

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యతపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇకపై ఆయా విద్యాలయాల్లో పనిచేసే టీచర్లకు విద్యార్థులు తినే అన్నాన్నే వడ్డించనున్నారు. గురుకుల సొసైటీ నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు 'అన్నపూర్ణ' యాప్ తదితర చర్యలు తీసుకున్నా.. గురుకుల విద్యార్థులకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందడం లేదని అధికారులు గుర్తించారు. స్టడీ అవర్‌లో ఉన్న టీచర్లు కూడా విద్యార్థులతో కలిసి ఉదయం టిఫిన్, రాత్రి భోజనం చేయాలని కమిటీ సభ్యులు సూచించారు. వీటిని ఫొటోలుగా తీసుకుని 'అన్నపూర్ణ వెబ్‌పోర్టల్'లో విధిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ విధానాన్ని కచ్చితంగా పాటించేలా సొసైటీ బోర్డు మెంబర్లు సెక్రటరీ రాములుకు పూర్తి అధికారాలు కల్పించారు.

## ఇష్టానుసారం ఫీజులు పెంచారు!

**▸▸ పీజీ కోర్సుల ఫీజు పెంపుపై హైకోర్టులో జూనియర్ డాక్టర్ల సంఘం**

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల్లో పీజీ కోర్సుల ఫీజును ప్రభుత్వం ఇష్టానుసారం పెంచిందని, ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం హైకోర్టును అభ్యర్థించింది. పీజీ కోర్సుల ఫీజులు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం 2017లో జారీ చేసిన జీవోలను సవాల్ చేస్తూ అదే ఏడాది జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్‌తో పాటు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సుష్మ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గురువారం చీఫ్‌జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఫీజుల నియంత్రణ కమిటీ సిఫారసులు లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు పెంచిందని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొనగా, ఫీజుల పెంపు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని ప్రతివాదుల తరపు న్యాయవాదులు వివరించారు. అయితే, సమయాభావం కారణంగా విచారణను జనవరి 23కు వాయిదా వేశారు.

నవ్య | చిత్రజ్యోతి

## ప్రేయసి కోసం..



ఐశ్వర్యారాజేశ్

అధిరోహ క్రియేటివ్ సైన్స్ ఎల్.ఎల్.పి. సంస్థ తన తొలి ప్రయత్నంగా నిర్మించిన 'మిస్ మ్యాచ్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఉదయ్‌శంకర్, ఐశ్వర్యారాజేశ్ జంటగా నటించారు. తమిళనాట 'సలీమ్' వంటి విభిన్న చిత్రాన్ని రూపొందించిన ఎన్వీ నిర్మల్‌కుమార్ ఈ చిత్రానికి దర్శకుడు. చిత్ర నిర్మాతలు జి.శ్రీరామ్ రాజు, భరత్‌రామ్ మాట్లాడుతూ 'స్పోర్ట్స్ నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. ఓ ప్రేమికురాలి విజయం కోసం ప్రేమికుడు పడే తపనను చూపించే చిత్రమిది. చిత్రకథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయి. ఉదయ్‌శంకర్, ఐశ్వర్యారాజేశ్‌లకు మరింత పేరు తెచ్చే సినిమా అవుతుంది. తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

## ఇకపై మంచి సినిమాలే చేస్తా

**- సాయి తేజ్**



అంజనా దేవి, సాయి తేజ్

సాయి తేజ్, రాశీ ఖన్నా జంటగా నటిస్తున్న 'ప్రతి రోజూ పండగే' సినిమా ట్రైలర్‌ను చిరంజీవి తల్లి అంజనా దేవి బుధవారం విడుదల చేశారు. మారుతి దర్శకత్వంలో బన్నీ వాసు నిర్మించారు. అల్లు అరవింద్ సమర్పకుడు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రం గురించి సాయి తేజ్ మాట్లాడుతూ "చిత్రలహరి' సినిమాతో నా సెకండ్ కెరీర్ స్టార్ట్ అయ్యింది. ఇప్పటినుండి అన్ని మంచి సినిమాలే ఇస్తాను. ఈ సినిమా బాగా వచ్చిందంటే కారణం మా టీమ్. మారుతి ఫీల్ గుడ్ సినిమా ఇచ్చారు. గీతా ఆర్ట్స్, యూవీ బ్యానర్స్‌లో వర్క్ చెయ్యడం మర్చిపోలేని అనుభూతినిచ్చింది" అని అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "తేజ్ తన పాత్రకే కాకుండా ఇతర పాత్రలకు ప్రాధాన్యం ఇస్తాడు. చిరంజీవి గారి దగ్గర ఉన్న ఈ లక్షణం తేజ్‌లో ఉండడం విశేషం. ఈ సినిమాను ఫ్యామిలీ మొత్తం కలిసి చూడాలి. మారుతి చక్కని ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దారు. అంజనాదేవి గారు మా ట్రైలర్ విడుదల చెయ్యడం సంతోషం" అని అన్నారు. "ట్రైలర్ చూసినవారంతా బావుందంటున్నారు. సత్యరాజ్, రావు రమేశ్ పాత్రలు గుర్తుండిపోతాయి" అని మారుతి చెప్పారు.

## నేను ఈ కాన్సెప్ట్‌తో సినిమా చేయాలనుకున్నా!

**- సుకుమార్**



అనన్య, దినేశ్‌తేజ్

"క్రాస్ టైమ్ కనెక్షన్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. నేను ఈ కాన్సెప్ట్‌తో సినిమా చేయాలనుకున్నాను. ఓ సినిమా హిట్టవ్వాలంటే ఏయే అంశాలు కావాలో... అవన్నీ ఈ సినిమాలో ఉన్నాయి. కాన్సెప్ట్ బేస్డ్ ఫిల్మ్స్ బాగా ఆడుతున్న రోజులివి. హరిప్రసాద్‌కు మంచి పేరు తెస్తుంది" అని దర్శకుడు సుకుమార్ అన్నారు. దినేశ్‌తేజ్, అనన్య జంటగా హరిప్రసాద్ జక్కా దర్శకత్వంలో ప్రసాద్‌రావు పెద్దినేని నిర్మిస్తున్న 'ప్లే బ్యాక్' టీజర్‌ను ఆయన విడుదల చేశారు. "పెద్ద కథను కెమెరామెన్ బుజ్జి సహకారంతో 35 రోజుల్లో చిత్రీకరించాం. నటీనటులందరూ అద్భుతంగా చేశారు" అని హరిప్రసాద్ అన్నారు. "కొత్త కథ, కథనాలతో వస్తున్న చిత్రమిది. సంగీతానికి, ముఖ్యంగా నేపథ్య సంగీతానికి మంచి స్కోప్ ఉన్న చిత్రమిది" అని సంగీత దర్శకుడు క్రమాన్ అన్నారు.






# జనం మధ్యలో ఉరి తీయాలి

**- రాశీ ఖన్నా**

*"ప్రస్తుతం తెలుగు సినిమాలతో చాలా బిజీగా ఉన్నా. ఇప్పుడు సౌత్ సినిమాకు రీచ్ ఎక్కువగా ఉంది. హీరోయిన్‌లకు మంచి పాత్రలు దక్కుతున్నాయి. అందువల్లనే బాలీవుడ్, హాలీవుడ్‌లో ట్రై చేయాలన్న ఫీలింగ్ రాలేదు. మంచి క్యారెక్టర్ వస్తే.. ఏ భాషలో అయినా నటిస్తా. ఎక్కడ మంచి పని దొరికితే అక్కడకు వెళ్తా" అని రాశీఖన్నా అన్నారు. తాజాగా ఆమె నటించిన చిత్రం 'వెంకీమామ'. కె.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా నటించిన ఈ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా రాశీఖన్నా గురువారం విలేకర్లతో మాట్లాడారు.*



ఇందులో నా క్యారెక్టర్ పేరు హారిక. ఫిల్మ్ మేకర్‌గా కనిపిస్తా. ఓ ఇబ్బందికర పరిస్థితిలో చిక్కుకొని ఎలా తిప్పలు పడిందనేది ఫన్నీగా ఉంటుంది. చైతూతో సినిమా చేయాలంటే లవ్‌స్టోరీ, ఇంటెన్స్ ఉన్న కథ కావాలి. అవన్నీ ఈ సినిమాలో ఉన్నాయి. ఫస్టాఫ్‌లో నేను ఎక్కువ కనిపిస్తా. సెకెండాఫ్ అంతా మామా అల్లుళ్ల ఎమోషన్ మీద నడుస్తుంది. సినిమా మొత్తం సిచ్యువేషనల్ కామెడీ ఉంటుంది. వెంకటేశ్‌గారికి ఎప్పటి నుంచో అభిమానిని. హిందీలో అనువాదమైన ఆయన చిత్రాలెన్నో చూశా. 'ఎఫ్2' మూడుసార్లు చూశా. ఆయన ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ యునీక్‌గా ఉంటాయి. ఆయనలా కామెడీ చేయడం ఎవరితరం కాదు. ఒక వ్యక్తిగా ఆయనంటే చాలా అభిమానం. బాబీతో 'జై లవకుశ' చేశాను కాబట్టి ఆయనతో నా కంఫర్ట్ లెవల్ బావుంది.

**సింగర్ కావాలనుకున్నా...**

ఒకేసారి రెండు సినిమాలు చేస్తున్నప్పుడు లేని ఒత్తిడి రెండు సినిమాలు రిలీజ్ అవుతున్నప్పుడు ఎందుకు? సినిమా సక్సెస్ అనేది నా చేతిలోనే ఉండదు కదా! 'ప్రతిరోజూ పండగే', 'వరల్డ్ ఫేమస్ లవర్' సినిమాలు పార్‌లల్‌గా చేశా. రెండూ భిన్నమైన పాత్రలే. 'వెంకీమామ'కు డబ్బింగ్ చెప్పలేదు కానీ, 'వరల్డ్ ఫేమస్ లవర్'కు డబ్బింగ్ చెబుతున్నా. నా గొంతు డబ్బింగ్‌కి సూటవుతుంది. సింగింగ్ అంటే నాకు చాలా ఇష్టం. త్వరలో తెలుగులో ఓ పాట పాడబోతున్నా. నేను సింగర్ కావాలనుకున్నా. కానీ హీరోయిన్ అయ్యా. ఎదిగేకొద్దీ ఆలోచనలు మారుతుంటాయి కదా. నా ఆలోచన కూడా అలాగే మారి హీరోయిన్ అయ్యా.

**మంచి పని దొరికితే చాలు...**

ప్రతీ రంగంలో పోటీ ఉంది. పోటీ లేకపోతే రిలాక్స్ అయిపోతాం. ఇద్దరి మధ్య కాంపిటీషన్ ఉంటేనే ముందుకెళ్లగలం. 'శ్రీనివాస కల్యాణం' నాకు బాగా నచ్చిన సినిమా. ఆ సినిమా రిజల్ట్ విషయంలో నేనేమీ డిజప్పాయింట్ కాలేదు. ఎక్కడో ఎమోషనల్‌గా దానికి కనెక్టయ్యాను.

**నడి రోడ్డు మీద ఉరి తీయాలి...**

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మహిళా డాక్టర్ ఘటన ఎంతో బాధ కలిగించింది. అలాంటివి జరిగినప్పుడు కోపం, భయం.. రెండూ కలుగుతాయి. ఆ నీచానికి పాల్పడిన వాళ్లను జనం మధ్యలో ఉరి తియ్యాలనేంత కోపం వచ్చింది. సమాజంలో చెడు జరిగినప్పుడల్లా మనం ఏం చేయలేకపోతున్నాం అని ఫ్రస్ట్రేషన్ వస్తుంది. కానీ మనం మన అభిప్రాయాలు మాత్రమే చెప్పగలం. అంతకు మించి ఏం చెయ్యగలం? ఇలాంటి విషయాల గురించి నేను మాట్లాడగలను కానీ, వాళ్లను చంపలేనుగా. ఆ పని చెయ్యాల్సింది న్యాయ వ్యవస్థ. వ్యక్తులుగా మనం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

**పెప్పర్ స్ప్రే వాడాలి.**

ఎవరైనా మీ దగ్గరకు వచ్చి తప్పుగా ప్రవర్తిస్తే.. ఏమాత్రం ఆలోచించకుండా పెప్పర్ స్ప్రే వాడాలి. అదిప్పుడు చాలా ఇంపార్టెంట్. కనీసం మనల్ని మనం రక్షించుకోవడానికి కొంత టైమ్ దొరుకుతుంది. ఎక్కడికి వెళ్తున్నా ఆడవాళ్లు తమతో పెప్పర్ స్ప్రే తీసుకుపోవాలి. సమాజంలో ఆడవాళ్లతో ఎలా మెలగాలి, ఎలా గౌరవించాలి అన్నది పిల్లలకు పెద్దలు నేర్పించాలి.

**ఆలోచనలో ఉన్న పొరపాటు...**

సినిమాల్లో అశ్లీలత ఎక్కువైందనీ, స్త్రీలను కించపరిచేలా సినిమాలు ఉంటున్నాయని చాలామంది పాయింట్ అవుట్ చేస్తున్నారు. అది జనాల తలలో ఉన్న అభిప్రాయమంతే. ఏం కించపరుస్తున్నారు? డ్రస్సుల గురించి కూడా మాట్లాడుతున్నారంటే అది వారి ఆలోచనా విధానంలో ఉన్న తేడా. వాళ్ల తల్లి పెంపకంలో ఉంటుంది. ఒకరికి కరెక్టనిపించేది, ఇంకొకరికి తప్పనిపిస్తుంది. మనిషి ఆలోచనా విధానం మారాలి. మంచి మెసేజ్ ఉన్న సినిమా చూస్తాం. తర్వాత ఆ మెసేజ్‌ని మర్చిపోతాం.

## సీనియర్ నిర్మాత ఆలపాటి రంగారావు కన్నుమూత



సీనియర్ నిర్మాత ఆలపాటి రంగారావు బుధవారం రాత్రి గుజరాత్ కచ్ జిల్లా ఆరిపూర్‌లోని స్వగృహంలో కన్ను మూశారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. శ్రీనాథ్ మూవీస్, శ్రీనాథ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకాలపై శోభన్‌బాబు హీరోగా 'ప్రతీకారం', 'రాజ్‌కుమార్', రాజేంద్రప్రసాద్‌తో 'నాకూ పెళ్లాం కావాలి', చంద్రమోహన్‌తో 'కాయ్ రాజా కాయ్', 'చిన్నారి స్నేహం', సుమన్‌తో 'న్యాయానికి శిక్ష', శారదతో 'మా తెలుగు తల్లి' చిత్రాలు నిర్మించారు. హిందీలో 'దోస్తీ దుష్మన్' సినిమా తీశారు. రంగారావుకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## పాట విన్నాను... బావుంది!

**- శ్రీవిష్ణు**



దొరైరాజు, సమ్మోహన, శ్రీవిష్ణు, శ్రీమానస్

"నన్ను ఇండస్ట్రీకి పరిచయం చేసింది దొరైరాజుగారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న సినిమాలో పాటను విడుదల చేయడం సంతోషంగా ఉంది. నేను ఈ పాట విన్నాను... బావుంది. పాట, సినిమా హిట్టవ్వాలని కోరుకుంటున్నా" అని శ్రీవిష్ణు అన్నారు. శ్రీమానస్, సమ్మోహన జంటగా దొరైరాజు వూపాటి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'పటారుపాళెం ప్రేమకథ'. సౌజన్యా దొరైరాజు, బీఆర్ బాలు, కె రామకృష్ణ ప్రసాద్, వి. లతారెడ్డి నిర్మాతలు. ఈ సినిమాలోని 'ఏడవున్నావే ఏడవున్నావే' పాటను శ్రీవిష్ణు విడుదల చేశారు. "నిజాయతీగా తీసిన చిత్రమిది. త్వరలో విడుదల తేదీ చెబుతాం" అని దొరైరాజు అన్నారు.



రీశాట్-2బీఆర్1 ఉపగ్రహం (ఊహాచిత్రాలు)

# 11న రీశాట్ ప్రయోగం

- పీఎస్ఎల్వీ-సీ48తో నింగిలోకి
- మరో 9 విదేశీ ఉపగ్రహాలు కూడా
- ఇది 50వ పీఎస్ఎల్వీ ప్రయోగం

శ్రీహరికోట (సూళ్లూరుపేట), డిసెంబరు 5: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 50వ పీఎస్ఎల్వీ ప్రయోగానికి సిద్ధమవుతోంది. కార్టోశాట్-3 విజయంతో జోష్ మీదున్న ఇస్రో.. ఈనెల 11న స్వదేశానికి చెందిన రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం రీశాట్-2బీఆర్1తోపాటు మరో 9 విదేశీ వాణిజ్య ఉపగ్రహాలను రోదసీలోకి ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రయోగానికి పీఎస్ఎల్వీ-సీ48 రాకెట్‌ను వినియోగిస్తున్నట్టు ఇస్రో ప్రకటించింది. షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి ఈ నెల 11న మధ్యాహ్నం 3.25 గంటలకు ఈ ప్రయోగాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. కాగా.. ఇస్రో పీఎస్ఎల్వీ రాకెట్లతో ప్రయోగం నిర్వహించడం ఇది 50 సారి. ఈ రాకెట్ ద్వారా మనదేశ రక్షణ రంగం కోసం 628 కిలోల బరువున్న రీశాట్ 2బీఆర్1 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. దీనితోపాటు అమెరికాకు చెందిన 6, ఇజ్రాయిల్, ఇటలీ, జపాన్‌లకు చెందిన ఒక్కొక్క ఉపగ్రహాన్ని ఇస్రో కక్ష్యల్లోకి ప్రవేశపెట్టనుంది.

## పొందూరు ఖాదీపై పోస్టల్ కవర్



పొందూరు, డిసెంబరు 5: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పొందూరు ఖాదీపై పోస్టల్ కవర్‌ను పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం.వెంకటేశ్వర్లు, జేసీ-2 రెడ్డి గున్నయ్య గురువారం విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లా పొందూరులో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విదేశీ వస్తువుల బహిష్కరణలో గాంధీజీ కారణంగా ప్రముఖ పాత్ర పోషించిన పొందూరు ఖాదీపై పోస్టల్ కవర్ విడుదల చేయడం తమ శాఖకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. గున్నయ్య మాట్లాడుతూ.. పొందూరు సన్న ఖాదీ తెలియని వారుండరని, అటువంటి ఖాదీకి తపాలాశాఖ మరింత ప్రచారం ఇచ్చేలా ప్రత్యేక కవర్‌ను విడుదల చేయడం అభినందనీయమన్నారు.

# మనోడేలే.. మాఫీ చేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

'కాపు రామచంద్రారెడ్డికి కేటాయించారు. ఈ క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగుతున్నాయని .. హద్దులు దాటి తవ్వకాలు సాగాయని గనుల శాఖ గుర్తించింది. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిగింది. క్వారీలో 33,360 క్యూబిక్ మీటర్ల మేర రోడ్ మెటల్‌ను అక్రమంగా తవ్వేశారని నిర్ధారించారు. దీనికి స్పష్టమైన ఆధారాలున్నాయని కూడా తేల్చారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులతోపాటు అనంతపురం గనుల శాఖ సహాయ సంచాలకుడు కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇందుకు అపరాధ రుసుముగా రూ.1,91,82,000 చెల్లించాలని గనుల శాఖ ఈ ఏడాది మే 5వ తేదీన నోటీసు ఇచ్చింది. ఎమ్మెల్యేతోపాటు ఇలా క్వారీలలో నిబంధనలు అతిక్రమించిన పలువురికి కూడా నోటీసులు జారీ చేసింది.

### మంత్రి కోర్టులో మాఫీ

గనుల శాఖ నోటీసుకు కాపు రామచంద్రారెడ్డి జూన్ నాలుగో తేదీన సమాధానం ఇచ్చారు. తాను నిబంధనలు అతిక్రమించలేదని.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు శాఖ దర్యాప్తు నివేదికను ఇవ్వాలని తాము కోరినప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. తాను నిబంధనలు అతిక్రమించనందున అపరాధ రుసుమును రద్దు చేయాలంటూ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోర్టులో రివిజన్ అప్లికేషన్ వేశారు. దీనిపై మంత్రి కోర్టు సానుకూలంగా స్పందించింది. నిబంధనలు అతిక్రమించలేదంటూ మొత్తం జరిమానాను రద్దు చేసేసింది. ఈ తీర్పు అధికారులతోపాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. సొంత శాఖ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇచ్చిన నివేదికలను విశ్వసించకుండా... కేవలం తమ పార్టీ ఎమ్మెల్యే వాదనతో ఏకీభవించడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలోనూ గనుల శాఖ వేసిన అపరాధ రుసుమును కొంతమేర తగ్గించిన దాఖలాలు ఉన్నాయి. కానీ, ఇలా మొత్తం వందశాతం మాఫీ చేయడం బహుశా ఇదే మొదటి సారి అని అధికారవర్గాలు చెబుతున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే కావడంలో ఈ స్థాయిలో ఉదారత ప్రదర్శించారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## బడికీ రంగు పులిమేశారు!



కృష్ణలంక(విజయవాడ), డిసెంబరు 5 : వైసీపీ రాజకీయ రంగుల హంగు పరాకాష్టకు చేరుతోంది. వాటర్ ట్యాంకులకు, రోడ్లకు.. ఆఖరికి పలుచోట్ల శ్మశానవాటికలకూ వైసీపీ రంగులద్దడంపై విమర్శలు వస్తున్నా వెనక్కి తగ్గడంలేదు. గతంలో ఏపార్టీలు అధికారంలో ఉన్నా బడి...గుడి జోలికి వెళ్లలేదు. పాఠశాలలకు ఆ పార్టీల రంగులు వేయలేదు. అధికారంలోకి రాగానే కాదేది వైసీపీ రంగులకనర్హమన్న రీతిలో.. తాజాగా.. కృష్ణలంక పొట్టి శ్రీరాములు హైస్కూల్‌కూ వైసీపీ రంగులద్దారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'పొట్టి శ్రీరాములు పాఠశాలను సర్వ శిక్షా అభియాన్ నిధులతో చాలా కాలం క్రితం నిర్మించారు. దీనికి పార్టీ రంగులు ఎలా వేస్తారు? వైసీపీ నేతలు బడులను కూడా వదలడం లేదు.. ఇక ఆలయాలనూ వదలరేమో' అంటూ ఆ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు.

## బధిర యువతిపై అత్యాచారం

- ఒంటరి మహిళపై అత్యాచారయత్నం

ఉప్పలపాడు, కనిగిరి టౌన్, డిసెంబరు 5: దిశా ఘటన దేశాన్ని కుదిపేస్తున్నప్పటికీ అక్కడక్కడా అత్యాచార ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ప్రకాశం జిల్లా వలేటిపాలెం మండల పరిధిలో బధిర యువతి బుధవారం సాయంత్రం తన మేనల్లుడితో కలిసి రేషన్ షాపునకు వెళ్లింది. తిరిగొచ్చే సమయంలో వరుసకు అన్న అయ్యే ప్రభాకర్ ఆమెను పక్కనున్న బ్యారన్‌లోకి లాక్కెళ్లి అత్యాచారం చేసి పారిపోయాడు. బాధితురాలి అక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. కనిగిరి పట్టణంలోని గుడి వద్ద ఒక మహిళ కొబ్బరికాయలు, పూజ సామాగ్రి అమ్ముకొని జీవనం సాగిస్తుంటుంది. గురువారం ఉదయం భక్తుల రద్దీ తగ్గడంతో కిశోర్ అనే యువకుడి సాయంతో కొబ్బరికాయల బల్లను తన ఇంటి ముందుకు చేర్చుకుంది. అనంతరం ఆమె వెనుకే ఇంట్లోకి వెళ్లి అత్యాచారానికి యత్నించగా ఎదురు తిరగడంతో వంటగదిలో ఉన్న కత్తితో ఆమె గొంతుపై గాయపరిచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు కిశోర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

### హస్తినలో మన గళం

## నాబార్డు రుణంతో పోలవరం ఆలస్యం

- కేంద్రమే నేరుగా బడ్జెట్‌లో కేటాయించాలి: సుబ్బిరామిరెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా పరిగణిస్తున్న పోలవరం జాతీయ ప్రాజెక్టుకు అవసరమైన నిధులన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే నేరుగా బడ్జెట్‌లో కేటాయించాలి. విభజన చట్టం ప్రకారం ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత కేంద్రానిదే" అని కాంగ్రెస్ ఎంపీ టీ సుబ్బిరామిరెడ్డి స్పష్టంచేశారు. ఆయన గురువారం ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కొత్తగా నాబార్డు ద్వారా రుణం తీసుకొని కేటాయించాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. గతంలో రూ.1400 కోట్లు కేంద్రం మంజూరు చేసి, నాబార్డు నుంచి ఆ నిధులు విడుదల చేయించాలని చేసిన ప్రయత్నం విఫలమైందని ఆయన గుర్తుచేశారు. కేంద్రం సకాలంలో నిధులివ్వకపోతే పోలవరాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేయలేమని, ఆ జాప్యం వల్ల ప్రాజెక్టు అంచనా వ్యయం ఇంకా పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## కౌలురైతుకు రుణాలివ్వాలి: రఘురామకృష్ణం రాజు

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "దేశంలోని రైతాంగంలో 50-60 శాతం కౌలుదారులే. వారికి బ్యాంకులు రుణాలు ఇవ్వవు. దీంతో అధిక వడ్డీకి ప్రైవేటు వ్యక్తుల నుంచి రుణాలు తీసుకొంటున్నారు. కౌలురైతుకు బ్యాంకులు రుణాలివ్వాలి" అని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు విజ్ఞప్తిచేశారు. వివిధ కారణాలతో పంట నష్టం - రైతులపై ప్రభావం అనే అంశంపై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఫసల్ బీమా యోజన కింద బీమా పరిహారాన్ని పొందేందుకు దరఖాస్తు చేసుకోడానికి కేంద్రం మూడు రోజుల సమయం మాత్రమే ఇస్తోందనీ, మరింత సమయం ఇవ్వాలని కోరారు.

## రుణ మాఫీలు సమస్యలను పరిష్కరించవు: పోచా

రైతు రుణ మాఫీలు మౌలిక సమస్యలను పరిష్కరించబోవని వైసీపీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి అభిప్రాయపడ్డారు. రుణ మాఫీ విధానాన్ని సమీక్షించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల సప్లై చైన్, రవాణా, నిల్వ వంటి వాటిలో అధిక నిధులు వెచ్చించాలని సూచించారు. వాతావరణ మార్పులతో వ్యవసాయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోడానికి పరిశోధనలపై దృష్టి పెట్టాలని అన్నారు. కాగా, రాష్ట్రంలో రైతులను ఆదుకోడానికి సీఎం జగన్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నారని వివరించారు.

# దారికాసిన మృత్యువు!

- ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు.. నలుగురు యువకుల దుర్మరణం
- మృతులు కృష్ణాజిల్లా నందిగామ వాసులు



నందిగామ రూరల్, డిసెంబరు 5: మృత్యువు దారికాసింది!. నడిరోడ్డుపై నలుగురు యువకుల ప్రాణాలను పొట్టన పెట్టుకుంది! నందిగామకు చెందిన ముగతా మనోజ్ (22), వడ్డాణపు దుర్గాప్రసాద్ (24), ఎం.అనిల్‌కుమార్ (28), కురువెళ్ల అరవింద్ (21) కారులో విజయవాడ వైపు వెళుతున్నారు. కొద్దిదూరం వెళ్లగానే అతివేగానికి కారు టైరు పేలిపోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, అనిల్‌కుమార్‌ను ప్రభుత్వ ఆస్పతికి తరలించేసరికి మరణించాడు

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

లింగాల, డిసెంబరు 5: కడప జిల్లాలో అప్పులబాధతో ఓ రైతు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పులివెందుల నియోజకవర్గం లింగాల మండల పరిధిలోని పార్నపల్లె గ్రామంలో సత్తెన్న (60)కు ఎకరా పొలం ఉంది. ఇందులో అరటి పంట సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు సంవత్సరాల నుంచి నష్టాలు రావడంతో సుమారు రూ.10 లక్షలు అప్పులు చేశాడు. సాగు కలిసి రాకపోవడంతో పాటు, రుణదాతల ఒత్తిడి పెరగడంతో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.



## కొమరవోలులో చంద్రబాబు సతీమణి పూజలు

పామర్రు, డిసెంబరు 5: కృష్ణాజిల్లా పామర్రు మండల పరిధిలోని కొమరవోలులో అమరలింగేశ్వర దుర్గా నాగేశ్వరస్వామి దేవస్థానాన్ని గురువారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సందర్శించారు. ఆలయంలో విఘ్నేశ్వర పూజ, స్వామివారికి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అభిమానుల సెల్ఫీ ఆరాటం

- పిలిపించి సరదా తీర్చిన బాలకృష్ణ



బాలకృష్ణను సత్కరిస్తున్న యువకులు

గన్నవరం: సెల్ఫీల హడావుడితో ముందుగా అభిమానులను వారించిన సినీ నటుడు, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అనంతరం మళ్లీ పిలిపించఇ వారి సరదా తీర్చారు. బాలకృష్ణ హైదరాబాద్ నుంచి గురువారం గన్నవరం ఎయిర్‌పోర్టుకు రాగా విజయకుమార్ అనే అభిమాని సెల్ఫీకి ప్రయత్నించాడు. బాలకృష్ణ ఇక చాలని వారించినా సెల్ఫీలు తీస్తుండటంతో ఫోన్ లాక్కొని తర్వాత పిలిచి ఫోన్ ఇచ్చేశారు. అయితే యువకుల ఆరాటం చూసి వారిని పిలవాలని సిబ్బందికి చెప్పారు. సాయంత్రం బాలకృష్ణ హైదరాబాద్ వెళ్లే సమయంలో ఆ యువకులకు ఫోన్‌చేసి ఎయిర్‌పోర్టుకి పిలిపించగా... సెల్ఫీలు దిగి అనంతరం బాలకృష్ణకు శాలువాకప్పి సన్మానించారు.

# వైసీపీ నేతల వేధింపులు!

- ఐకేపీ వీఓఏ ఆత్మహత్యాయత్నం

భీమడోలు, డిసెంబరు 5: వైసీపీ నాయకుల వేధింపులు తట్టుకోలేక ఐకేపీ వీఓఏ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం పూళ్ళ శివారు ఎంఎంపురం గ్రామంలో ఘంటా రమణకుమారి ఏడేళ్లుగా వీఓఏగా పనిచేస్తున్నారు. వైసీపీ గ్రామ నేతలు కొందరు ఆమెను విధుల నుంచి తొలగించాలంటూ వెలుగు అధికారులపై ఒత్తిడి తేవడంతో పాటు రమణకుమారిని కూడా వేధిస్తున్నారని గ్రామస్థులు, బాధితురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఒత్తిడికి గురవుతున్న తల్లిని చూసి ఆమె కుమారుడు బుధవారం రాత్రి సదరు నాయకులపై గొడవకు దిగాడు. ఈఘటనలతో మనస్తాపం చెందిన రమణకుమారి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు పూళ్లలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే గురువారం ఎంఎంపురం వెళ్లిన సీఐటీయూ నాయకులు రమణకుమారిని పరామర్శించారు. వైసీపీ గ్రామ నేతల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు వారికి వివరించింది. కాగా, ఈ వ్యవహారంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని భీమడోలు ఎస్ఐ శ్రీహరిరావు చెప్పారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

## రైల్వే పోస్టుల భర్తీలో తెలుగువారికి అన్యాయం

- కేంద్ర మంత్రి గోయల్‌కు చలసాని శ్రీనివాస్ లేఖ

విజయవాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైల్వే అప్రెంటిషిప్ పోస్టుల భర్తీలో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించేది లేదంటూ ఆంధ్రా మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ కేంద్రానికి లేఖ రాశారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు చలసాని రాసిన లేఖను ఆ సంస్థ అధ్యక్షుడు జి.అప్పలనాయుడు గురువారం మీడియాకు విడుదల చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో 4103 అప్రెంటిషిప్ ఉద్యోగాల భర్తీలో ఇతర జోన్ల వారికి అవకాశం కల్పించటం దురదృష్టకరమని చలసాని పేర్కొన్నారు. దీనివల్ల దక్షిణాది వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఉద్యోగాలకు నిర్వహించే పరీక్షలలో కూడా ఉత్తరాది వారికి అవకాశం కల్పిస్తే తెలుగు రాష్ట్రాల్లోని యువత భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. పరీక్షలను ఇంగ్లిషు, హిందీలో నిర్వహించటం వల్ల దక్షిణాది వారికి ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. ప్రాంతీయ భాషల్లో కూడా పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఉమ్మడిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించే క్రమంలో ఇచ్చిన హామీలపై కేంద్రం పూర్తిగా దృష్టి పెట్టకపోవటం విచారకరమన్నారు. విశాఖ రైల్వే డివిజన్ ఎత్తివేయటం సమంజసం కాదన్నారు.

## మంత్రి కన్నబాబుపై కేసు కొట్టివేత

విజయవాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కురసాల కన్నబాబుపై 2009 ఎన్నికల సమయంలో నమోదైన కేసును విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం కొట్టేసింది. 2009 ఎన్నికల్లో కన్నబాబు ప్రజారాజ్యం పార్టీ తరపున తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. పోలింగ్ రోజున కరప మండలంలోని పోలింగ్ కేంద్రంలోకి అక్రమంగా ప్రవేశించారని కేసు నమోదైంది. దీన్ని విజయవాడలోని ప్రజాప్రతినిధుల కేసుల ప్రత్యేక న్యాయస్థానం విచారించింది. ఈ విచారణలో కన్నబాబుపై నేరం రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి కేసును కొట్టివేస్తూ గురువారం తీర్పు చెప్పారు.

## డాక్టర్ కర్రి రామారెడ్డికి 31వ డిగ్రీ

గోదావరి సిటీ (రాజమహేంద్రవరం), డిసెంబరు 5: నిత్య విద్యార్థి, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంకాం డిగ్రీ పొందారు. గత డిగ్రీలు, డిప్లొమాలు కలుపుకుని ఇది ఆయనకు 31వ డిగ్రీ. ఈ ఏడాది సాధించిన వాటిలో 3వ డిగ్రీ. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 39 ఏళ్లుగా మానసిక వైద్యుడిగా సేవలందిస్తున్న ఆయన 67 ఏళ్ల వయసులో పీజీ డిగ్రీ సాధించారు.

## మాజీ ఎమ్మెల్యే యాళ్లూరి కన్నుమూత



గిద్దలూరు, డిసెంబరు 5: ప్రకాశం జిల్లా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే యాళ్లూరి వెంకటరెడ్డి(79) కన్నుమూశారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రాచర్ల మండలం చెర్లోపల్లికి చెందిన వెంకటరెడ్డి ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా చాలాకాలం పనిచేశారు. 1989లో ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీచేసి పరాజయం పాలయ్యారు.

## పెళ్లికి ఒప్పుకోలేదని తల్లిపై యాసిడ్!

- 'బాండ్' రాసివ్వలేదని యువతి గొడవ

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి, డిసెంబరు 5 : ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదన్న కారణంతో తల్లిపై ఓ కూతురు యాసిడ్ దాడి చేసింది. శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ ముకుంద కథనం ప్రకారం.. శ్రీకాకుళం పట్టణంలో నివాసం ఉంటున్న యువతి (30) ఓ అబ్బాయిని ప్రేమించింది. తనకు అతడితోనే పెళ్లి చేయాలని తల్లిదండ్రులను పట్టుబడుతోంది. దీనిపై కొన్నాళ్లుగా ఆ ఇంట్లో వివాదం నడుస్తోంది. గురువారం కూడా ఈ విషయం ఇంట్లో ప్రస్తావన రాగా.. చివరకు తల్లిదండ్రులు.. కుమార్తె ప్రేమ వివాహానికి అంగీకరించారు. అయినా, 'మీ మాటపై నాకు నమ్మకం లేదు, బాండ్ పేపర్‌పై ఈ విషయాన్ని రాసివ్వండి' అంటూ యువతి పట్టుబట్టింది. దీంతో వివాదం మరింత పెద్దదైంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న బాత్‌రూమ్‌కు వినియోగించే యాసిడ్‌ను యువతి తన తల్లిపై పోసేసింది. దీంతో ఆమె ముఖంపై చిన్న గాయమైంది. దుస్తులు కూడా కొంతమేర కాలి ముద్దయ్యాయి. 'డయల్ 100' నంబర్‌కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి, యువతికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని.. డయల్ 100 ఆధారంగా వారిని స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టామని ఎస్ఐ ముకుంద తెలిపారు. ఇదిలా ఉండగా, తాను ఉద్దేశపూర్వకంగా తన తల్లిపై దాడి చేయలేదని యువతి విలేకరులకు వివరణ ఇచ్చింది.

## విజయనగరం చేరుకున్న అశోక్



అశోక్‌గజపతిరాజుకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

విజయనగరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు సుదీర్ఘ కాలం తరువాత విజయనగరంలోని స్వగృహానికి గురువారం చేరుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ సరిగ్గా 168 రోజుల కిందట చికిత్స కోసం ఆయన ఢిల్లీ వెళ్లారు. వెన్నుపూసకు శస్త్రచికిత్స అనంతరం అక్కడే కొంతకాలం విశ్రాంతి తీసుకున్నారు. పైడితల్లి అమ్మవారి పండగకు ఈ కారణంగానే రాలేకపోయారు. ఆయన గురువారం జిల్లాకు వస్తున్నట్లు తెలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అశోక్ అభిమానులు విశాఖ ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఆహ్వానం పలికారు. స్వగృహానికి చేరుకున్న ఆయనకు సింహాచల దేవస్థానం, పైడితల్లి అమ్మవారి ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. 168 రోజుల పాటు విజయనగరం పట్టణానికి దూరంగా ఉండటం ఇదే మొదటిసారని అశోక్ వెల్లడించారు.

## 4 వీఐపీ టికెట్లు రూ.10 వేలు

- తిరుమలలో వెలుగుచూసిన మరో అక్రమం

తిరుమల, డిసెంబరు 5:. ఓ ఎమ్మెల్యే సిఫారసు లేఖపై వీఐపీ బ్రేక్ టికెట్లు పొంది, దర్శనానికి వచ్చిన నలుగురు భక్తులను విజిలెన్స్ అధికారులు విచారించి.. వాటిని బ్లాక్‌లో కొనుగోలు చేసినట్టు గుర్తించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరామరాజు అనే వ్యక్తి 5వ తేదీ ఉదయం బ్రేక్ దర్శనం కోసం తెనాలి ఎమ్మెల్యేనుంచి సిఫారసు లేఖ పొందారు. ఆ లేఖ ద్వారా వెంకటరామరాజు సహా కర్ణాటకలోని తుముకూరుకు చెందిన నలుగురి పేర్లతో ఐదు బ్రేక్ దర్శన టికెట్లు పొందారు. అయితే, గురువారం ఉదయం దర్శనానికి వెంకటరామరాజు లేకుండా కర్ణాటక భక్తులే రావటంతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద విజిలెన్స్ అధికారులకు అనుమానం కలిగింది. ఆ నలుగురిని విచారించగా కల్యాణ్‌రాజు అనే వ్యక్తి నాలుగు వీఐపీ బ్రేక్ టికెట్లను రూ.10 వేలకు తమకు విక్రయించినట్టు వెల్లడించారు. ఈ మేరకు భక్తుల నుంచి ఫిర్యాదు తీసుకున్న విజిలెన్స్ అధికారులు కేసును వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో దళారీ కల్యాణ్‌రాజుతో పాటు వెంకటరామరాజు కోసం పోలీసులు గాలిస్తున్నారు.




నరేంద్ర మోదీ
ప్రధానమంత్రి

"మహిళల అభివృద్ధి నుండి మహిళలతో అభివృద్ధి దిశగా భారత్ పయనిస్తోంది"

భారత ప్రభుత్వం

మహిళా సాధికారత కొరకు

విశిష్ట సేవలకు గుర్తింపుగా జాతీయ అవార్డు

2019 కొరకు నామినేషన్లకు ఆహ్వానం

nari shakti puraskar
Compassion Ability Courage

అర్హతా ప్రమాణాలు

- మహిళాసాధికారతకు విశిష్ట సేవలందించిన వ్యక్తులు, గ్రూపులు మరియు ఇన్‌స్టిట్యూషన్స్ అన్నింటికి.
- దరఖాస్తుదారు వ్యక్తి అయితే కనీసం 25 సంవత్సరాల వయస్సు తప్పనిసరిగా కలిగియుండాలి.
- సంస్థలు అయితే సంబంధిత అనుభవం కనీసం 5 సంవత్సరాలు తప్పనిసరిగా కలిగిఉండాలి.

మరింత సమాచారం మరియు ఆన్‌లైన్ దరఖాస్తు కొరకు దర్శించగలరు: www.narishaktipuraskar.wcd.gov.in

దాఖలుకు ఆఖరి తేది: 7 జనవరి, 2020

davp 46101/13/0007/1920

ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిశీలించబడతాయి

## వినియోగ వ్యయం తగ్గలేదు

న్యూఢిల్లీ: దేశంలో వినియోగ వ్యయం తగ్గిందనేది కేవలం అపోహేనని, వాస్తవానికి 2018-19లో అది పెరిగిందని కేంద్ర పథకాల అమలు, ప్రణాళిక శాఖ మంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ చెప్పారు. రాజ్యసభలో అనుబంధ పద్దులపై చర్చకు సమాధానం చెబుతూ.. 2015-16 నుంచి దేశంలో వినియోగవ్యయం పెరుగుతూనే ఉన్నదన్నారు. దేశంలో 10 కోట్ల మంది గృహస్థులకు ఆయుష్మాన్ భారత్ అందిస్తున్నామని, అలాగే విద్య పొందడం ఒక హక్కు కావడం వల్ల ప్రజలు విద్యపై ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. అంతే కాదు పీడీఎస్ వ్యవస్థలో అనేక లోపాలు సరిచేయడం వల్ల అలాంటి లీకేజీల కోసం చేస్తున్న వ్యయాలు తగ్గాయని వివరించారు. ఇలాంటి వృథావ్యయాలు తగ్గాయి తప్పితే వాస్తవ వినియోగ వ్యయం తగ్గలేదని మంత్రి స్పష్టం చేశారు.

## 'ఆర్మ్' ప్రోగ్రామ్‌కు సైయెంట్ ఎంపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆర్మ్ ఆమోదించిన డిజైన్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ భాగస్వామిగా సైయెంట్‌కు చెందిన యాన్‌సేన్ కంపెనీ ఎంపికైంది. ఆర్మ్ అప్రూవ్డ్ డిజైన్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ అనేది డిజైన్ సర్వీసెస్ కంపెనీల అంతర్జాతీయ నెట్‌వర్క్. ఆర్మ్ ఆధారిత ఎస్‌ఓసీల అభివృద్ధి, తయారీలో ఈ నెట్‌వర్క్ మద్దతు ఇస్తుంది.

## పెన్నార్‌కు రూ.302 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పెన్నార్ ఇండస్ట్రీస్‌కు గత నెలలో రూ.302 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ, ఎంసీఎఫ్, టెక్స్‌మ్యాకో తదితర కంపెనీల నుంచి రైల్వే విభాగానికి పనులు లభించాయని తెలిపింది. అంబుజా, కోరమాండల్, చెట్టినాడ్ కంపెనీల నుంచి ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్ విభాగానికి ఆర్డర్లు వచ్చాయి.

## నేటి ముగింపే కీలకం

**టెక్ వ్యూ**

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై ఇంట్రాడేలో 12080 వరకు వెళ్లినా కరెక్షన్‌లో పడి 12000 వరకు దిగజారింది. చివరికి 25 పాయింట్ల నష్టంతో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ స్వల్పకాలిక కీలక స్థాయిల్లో ఉంది. తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకోవాలంటే పునరుజ్జీవం తప్పనిసరి. స్వల్పకాలిక దిశకు శుక్రవారం నాటి ముగింపు అత్యంత కీలకం. మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక 20 డీఎంఏకు చేరువలో ఉంది. కదలికలు పరిమితంగా ఉన్నందువల్ల ట్రెండ్‌లో మార్పేమీ లేదు.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 12080 మద్దతు : 11950**

- మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 12080 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధ స్థాయి 12150.
- మరింత బలహీనతలో పడితే 11950 వద్ద ప్రధాన మద్దతు ఉంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.

■ వి.సుందర్ రాజా

## సాధారణంగా నిలకడ

**ఆస్ట్రో వ్యూ**

**తిథి** : మార్గశిర శుక్ల దశమి; నక్షత్రం : ఉత్తరాభాద్ర

**అప్రమత్తం** : భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 9.32**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 10.30 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.20 నిస్తేజంగా ఉండి తదుపరి 1.50 వరకు నిలకడగా మారి ఆ తర్వాత నుంచి చివరి వరకు నిలకడగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం** : నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్ను తీసుకుని 12.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12085, 12120**

**మద్దతు స్థాయిలు : 12005, 11970**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

### ఫారం గేటు అమ్మకం ధరలు

డజను గుడ్లు రూ. 66 — నెక్ (100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 5వ తేదీకి.. హైదరాబాద్ | 444 | గోదావరి | 457 |
| | | విజయవాడ | 457 |
| 6వ తేదీకి.. చిత్తూరు | 471 | విశాఖపట్నం | 460 |
| | | వరంగల్ | 447 |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 83 | విజయవాడ | 93 |
| వరంగల్ | 83 | గుంటూరు | 93 |
| మహబూబ్‌నగర్ | 83 | ఒంగోలు | 95 |
| కరీంనగర్ | 83 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 83 | నెల్లూరు | 90 |
| విశాఖపట్నం | 82 | అనంతపురం | 91 |
| గోదావరి | 88 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,370 | 38,950 | 39,370 | 38,950 | 38,260 |
| క్రితం ముగింపు | 38,060 | 39,010 | 39,510 | 39,050 | 38,090 |
| 22 క్యారెట్లు | 36,520 | 36,100 | 36,220 | 36,150 | 36,440 |
| క్రితం ముగింపు | 36,270 | 36,150 | 36,340 | 36,250 | 36,480 |
| వెండి (కిలో) | 44,000 | 45,600 | 45,300 | 46,000 | 47,500 |
| క్రితం ముగింపు | 44,900 | 46,300 | 46,100 | 46,300 | 48,500 |

### ఉల్లి ఘాటెక్కింది..

# టైమ్ ప్లీజ్!

## ఆర్‌బీఐ వరుస 'కోత'కు బ్రేకులేసిన ధరలు

## ఈసారి సమీక్షలో రెపో రేట్లు యథాతథం



**సమీక్ష ముఖ్యాంశాలు**

- జీడీపీ అంచనా 5 శాతానికి కుదింపు
- ఇంకా బలహీనంగానే గిరాకీ పరిస్థితులు
- వీలైతే మున్ముందు సమీక్షల్లో రేట్ల తగ్గింపు
- ద్వితీయార్ధం ద్రవ్యోల్బణ అంచనా 5.1-4.7%
- విదేశీ మారక నిల్వలు 45,170 కోట్ల డాలర్లు
- 2020 ఫిబ్రవరి 4-6 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వరుస వడ్డీ రేట్ల కోతకు ఉల్లి ధరలు అడ్డుగా నిలిచాయి. దాంతో, ఆర్‌బీఐ ఈసారి సమీక్షలో తాత్కాలిక విరామం తీసుకుంది. ఆర్థిక వృద్ధి, పెట్టుబడులకు ఊతమిచ్చేందుకు రెపో రేట్లను మరోసారి తగ్గించవచ్చన్న మార్కెట్ అంచనాలకు భిన్నంగా యథాతథ స్థితిని ప్రకటించింది. తద్వారా, వృద్ధి పునరుద్ధరణ కంటే ధరాఘాతం నియంత్రణకే పెద్ద పీట వేసింది. అయితే, ఇది స్వల్ప విరామమేనని, వృద్ధి పునరుద్ధరణకు అవసరమైతే వడ్డీ రేట్లను మరింత తగ్గిస్తామని సంకేతాలిచ్చింది. వచ్చే ఏడాదిలో ఆర్‌బీఐ రెపోను 0.60-0.70 శాతం మేర తగ్గించవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఏకగ్రీవ నిర్ణయం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2019- 20) ఇది ఐదో ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్ష. ఇందులో భాగంగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) ఈ నెల 3,4,5 తేదీల్లో సమావేశమైంది. ఇందులో సభ్యులందరూ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని ఓటు వేశారు. రీపర్చేజింగ్ (రెపో) రేటు 5.15 శాతంగా, రివర్స్ రెపో 4.90 శాతంగా కొనసాగనుంది.

### గత ఐదు సమీక్షల్లో 1.35% తగ్గింపు

గత ఐదు పరపతి సమీక్షల్లో ఆర్‌బీఐ రెపోను మొత్తం 1.35 శాతం తగ్గించింది. గత సమీక్షల్లో రేట్ల తగ్గింపు ప్రభావాన్ని పరిశీలించేందుకే ఈసారి తాత్కాలిక విరా మం తీసుకున్నట్లు దాస్ తెలిపారు. ఇప్పటివరకు బ్యాంకులు కస్టమర్లకు రెపో తగ్గింపు ప్రయోజనాన్ని 0.44 శాతం వరకు అందజేశాయన్నారు.



### ధరల సూచీకి 'ఉల్లి' పోటు

ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధానికి రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణ సూచీ 5.1-4.7 శాతానికి చేరుకోవచ్చని ఆర్‌బీఐ అంచనా. గత సమీక్షలో అంచనా వేసిన 3.5-3.7 శాతం పోలిస్తే గణనీయంగా పెంచింది. కూరగాయలు, ముఖ్యంగా ఉల్లిపాయలు, టమాట ధరలు భగ్గుమనడం ఇందుకు కారణం. "మున్ముందు మార్కెట్ ధరల గమనం పలు అంశాలపై ఆధారపడి ఉండనుంది. మొదటగా, కూరగాయల ధరలు మరో 1-2 నెలల పాటు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగనున్నాయి. అయితే, ఆలస్యంగా సాగు చేసిన ఖరీఫ్ పంట దిగుబడి అందుబాటులోకి రావడంతో పాటు దిగుమతుల ద్వారా సరఫరా పెంపు చర్యలతో ఫిబ్రవరి నాటికి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉంద"ని పేర్కొంది. అక్టోబరు నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతానికి ఎగబాకింది. ఆహార ధరల ద్రవ్యోల్బణం ఏకంగా 39 నెలల గరిష్ఠ స్థాయి 6.9 శాతానికి పెరిగింది.

### బిట్ కాయిన్లను అనుమతించం..



సాంకేతికంగా ఇంకా పరిణతి చెందాల్సిన కారణంగా సెంట్రల్ బ్యాంక్ నుంచి డిజిటల్ కరెన్సీ జారీ గురించి మాట్లేందుకు ఇంకా సమయం ఆసన్నం కాలేదని శక్తికాంత దాస్ అన్నారు. ఈ టెక్నాలజీని పరిశీలిస్తున్నామన్న గవర్నర్.. బిట్‌కాయిన్ వంటి ప్రైవేట్ డిజిటల్ కరెన్సీని మాత్రం అసలు అనుమతించబోమన్నారు. కరెన్సీ జారీ సార్వభౌమ అధికారమని దాస్ పేర్కొన్నారు. బిట్‌కాయిన్‌తో పాటు ఇతర డిజిటల్ కరెన్సీలు చట్ట విరుద్ధమన్న ఆర్‌బీఐ.. ఏడాది క్రితమే వాటి ట్రేడింగ్‌ను నిషేధించింది.

### కొత్త ప్రీ-పెయిడ్ కార్డు



రూ.10,000 వరకు వస్తు, సేవల కొనుగోలు లావాదేవీల కోసం కొత్త ప్రీ-పెయిడ్ సాధనాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంలో ప్రీ-పెయిడ్ సాధనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. కేవలం బ్యాంకు ఖాతా నుంచి నగదు జమ చేసుకోగలిగే ఈ కొత్త ప్రీ-పెయిడ్ కార్డు ద్వారా బిల్లులు, వర్తకుల వద్ద చెల్లింపులు జరపవచ్చని స్పష్టం చేసింది. ఈ నెలాఖరుకల్లా ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేయనుంది.

### ఆ నెట్ బ్యాంకింగ్‌పై కన్నేసి ఉంచాం..

ఈ వారంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నెట్ బ్యాంకింగ్ వరుసగా రెండు రోజులు క్రాష్ కావడం వెనక కారణాలను పరిశీలిస్తున్నామని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎంకే జైన్ తెలిపారు. ఈ సమస్యకు గల కారణాలను గుర్తించేందుకు తమ బృందం వెళ్లిందని చెప్పారు. సోమ, మంగళవారాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాదారులు నెట్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### రూ.50 లక్షల వరకు అప్పు ఇచ్చుకో..పుచ్చుకో!

**పీ2పీ లెండింగ్ పరిమితి ఐదు రెట్లు పెంపు**

పీర్-టు-పీర్ (పీ2పీ) లెండింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అప్పు ఇచ్చి, పుచ్చుకోగలిగే గరిష్ఠ పరిమితిని ఏకంగా ఐదు రెట్లు పెంచింది ఆర్‌బీఐ. దాంతో, పలువురు వ్యక్తులు కలిసి ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఇవ్వగలిగే, తీసుకోగలిగే రుణ పరిమితి రూ.50 లక్షలకు పెరిగింది. ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫామ్‌లపై అగ్రిగేట్ రుణ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. ఒక వ్యక్తి, మరో వ్యక్తికి ఇవ్వగలిగే గరిష్ఠ రుణ పరిమితి మాత్రం రూ.50 వేలుగా ఉంది.

### ఈసారి వృద్ధి 5 శాతమే..!



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను మరోసారి తగ్గించింది ఆర్‌బీఐ. అక్టోబరు సమీక్షలో 6.1 శాతానికి కుదించగా.. ఈసారి ఏకంగా 5 శాతానికి తగ్గించింది. దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ బలహీనంగా ఉండటంతో వృద్ధి అంచనాలను మళ్లీ తగ్గించాల్సి వచ్చిందని ఆర్‌బీఐ పేర్కొంది. 2019-20 రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబరు) వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే. వస్తు తయారీ రంగం, వ్యవసాయ రంగాల పనితీరు పేలవంగా ఉండటం ఇందుకు కారణమైంది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధానికి (2019 అక్టోబరు- 2020 మార్చి) జీడీపీ వృద్ధి 4.9-5.5 శాతంగా నమోదు కావచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) ప్రథమార్ధంలో 5.9-6.3 శాతానికి మెరుగుపడవచ్చని అంటోంది. రెపో తగ్గింపు ప్రయోజనాలను కస్టమర్లకు చేరవేసే ప్రక్రియను మరింత వేగిరం చేయడంతోపాటు అంతర్జాతీయ వాణిజ్య ఆందోళనలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తే వృద్ధి రేటు అంచనాల కంటే మెరుగుపడవచ్చని ఆర్‌బీఐ అంటోంది. దేశీయంగా డిమాండ్ పునరుద్ధరణలో జాప్యం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మరింత మందగించిన పక్షంలో వృద్ధి అంచనాల కంటే తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

## ఎస్‌ఎఫ్‌బీలకు ఆన్ టాప్ లైసెన్సులు

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు (ఎస్‌ఎఫ్‌బీ) ఆన్-టాప్ లైసెన్సుల జారీకి సంబంధించి ఆర్‌బీఐ గురువారం తుది మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇందుకు కనీస మూలధన పెట్టుబడిని రెట్టింపు స్థాయి రూ.200 కోట్లకు పెంచింది. తొలుత అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, ఎన్‌బీఎఫ్‌సీ, సూక్ష్మ రుణ సంస్థ, స్థానిక బ్యాంకులు, పేమెంట్ బ్యాంక్‌గా కార్యకలాపాలు కొనసాగించి ఎస్‌ఎఫ్‌బీగా మారిన వాటికి ఈ నిబంధన వర్తించదని స్పష్టం చేసింది. ఐదేళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్న పేమెంట్ బ్యాంకులు సైతం ఎస్‌ఎఫ్‌బీలుగా మారేందుకు అర్హత కల్పించింది. దేశంలో ఆర్థిక సేవలను విస్తృతం చేసేందుకు 2014 నవంబరులో ఆర్‌బీఐ 10 కంపెనీలకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లైసెన్సులు జారీ చేసింది.

## సీఆర్‌ఐఎల్‌సీ పరిధిలోకి బడా సహకార బ్యాంకులు

పీఎంసీ బ్యాంక్ తరహా కుంభకోణాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఆర్‌బీఐ మరిన్ని చర్యలు చేపట్టింది. రూ.500 కోట్ల ఆస్తులున్న సహకార బ్యాంకులను సీఆర్‌ఐఎల్‌సీ రిపోర్టింగ్ ఫ్రేమ్‌వర్క్ పరిధిలోకి చేర్చుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. బ్యాంకులు, బడా ఎన్‌బీఎఫ్‌సీల్లో ఒత్తిడిలో ఉన్న ఆస్తులను గుర్తించేందుకు వీలుగా సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్ (సీఆర్‌ఐఎల్‌సీ)ని ఏర్పాటు చేసింది ఆర్‌బీఐ. బడా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు తాము మంజూరు చేసే పెద్ద మొత్తం రుణాలపై ఈ వ్యవస్థ ద్వారా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

## ప్రతి'సారీ' తగ్గించలేం: దాస్

వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ఆర్‌బీఐ మరోసారి వడ్డీ రేట్లను తగ్గించవచ్చని విశ్లేషకులు భావించారు. కానీ, కీలక వడ్డీ రేట్లను యాంత్రికంగా ప్రతిసారీ తగ్గించుకుంటూ పోలేమని శక్తికాంత దాస్ అన్నారు. వృద్ధికి ఊతమిచ్చేందుకు గడిచిన కొన్ని నెలల్లో ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలిచ్చే వరకు వేచి చూడనున్నట్లు దాస్ చెప్పారు. అయితే, మున్ముందు సమీక్షల్లో వడ్డీ రేట్లు తగ్గించేందుకు అవకాశముందని ఆయన సంకేతాలిచ్చారు. పరపతి సమీక్ష సమావేశంలో దాస్ ఇంకా ఏమన్నారంటే..

**ఎన్‌బీఎఫ్‌సీ**

ద్రవ్య కొరతతో సతమతం అవుతున్న నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు బ్యాంకుల రుణ వితరణ మెరుగవుతోంది. బడా ఎన్‌బీఎఫ్‌సీలు కుప్పకూలంగా చూస్తాం టాప్-50 ఎన్‌బీఎఫ్‌సీల కార్యకలాపాలపై కన్నేసి ఉంచాం. వాటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం.

**రెపో రేట్ల ప్రయోజనాల బదిలీ**

ఇప్పటివరకు రెపో రేట్ల తగ్గింపు ప్రయోజనాలను బ్యాంకులు కస్టమర్లకు బదిలీ చేసే ప్రక్రియ సంతృప్తికరంగానే ఉంది. రుణ రేట్లను రెపో వంటి బహిరంగ మార్కెట్ రేట్లతో అనుసంధానం చేయడంతో మున్ముందు కస్టమర్లకు మరింత ప్రయోజనం చేకూరవచ్చు.

**పీఎంసీ బ్యాంక్**

పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంక్ కుంభకోణంపై ఫోరెన్సిక్ దర్యాప్తు నివేదిక ఈ నెలాఖరుకల్లా అందుబాటులోకి రావచ్చు. దర్యాప్తు నివేదికను పరిశీలించాక ఈ బ్యాంక్‌పై చేపట్టాల్సిన తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం. ఆర్థిక అవకతవకలకు పాల్పడిన పీఎంసీ బ్యాంక్‌పై సెప్టెంబరు 23న ఆర్‌బీఐ పలు ఆంక్షలు విధించింది. అంతేకాదు, బ్యాంక్ బోర్డును రద్దు చేసి, తన తరఫున పర్యవేక్షణ అధికారిని నియమించింది.

> వడ్డీ రేట్ల విషయంలో ఆర్‌బీఐ ఎవరూ ఊహించని విధంగా నిర్ణయం తీసుకుంది. ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా కీలక రేట్లను యథాతథంగా ఉంచటం సరైన చర్యగా భావిస్తున్నాం. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి.
>
> - రజనీష్ కుమార్, చైర్మన్, ఎస్‌బీఐ



## 'గతి'లో ఆల్‌కార్గోకు 44% వాటా

**allcargo** డీల్ విలువ రూ.416 కోట్లు **GATI**

ముంబై : హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గతి లిమిటెడ్‌లో 44 శాతం వాటాలను చేజిక్కించుకోనున్నట్లు సమీకృత లాజిస్టిక్ సొల్యూషన్స్ కంపెనీ ఆల్‌కార్గో లాజిస్టిక్స్ వెల్లడించింది. ఈ వాటాల కొనుగోలుకు రూ.416 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపింది. గతిలో వాటాల కొనుగోలు ద్వారా ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్స్ మార్కెట్లోకి అడుగుపెట్టే అవకాశం లభించనుందని పేర్కొంది. డీల్‌లో భాగంగా తొలుత గతి లిమిటెడ్‌లో 1.03 కోట్ల షేర్లను కొనుగోలు చేయనుండగా ప్రిఫరెన్షియల్ ఇష్యూ కింద 1.33 కోట్ల షేర్లను సబ్‌స్ర్కైబ్ చేయనున్నట్లు తెలిపింది. ఒక్కో షేరును రూ.75కు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. మొత్తంగా 18 శాతం షేర్లను దక్కించుకోనున్నట్లు ఆల్‌కార్గో తెలిపింది. గతి చైర్మన్ మహేంద్ర కుమార్ అగర్వాల్, మహేంద్ర ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, టీసీఐ ఫైనాన్స్ సహా గతి ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ నుంచి ఈ షేర్లను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. రెండో దశలో 26 శాతం వాటాకు సమానమైన మరో 3.17 కోట్లకు పైగా షేర్ల కొనుగోలు కోసం ఓపెన్ ఆఫర్ ప్రకటించనున్నట్లు ఆల్‌కార్గో తెలిపింది. ఒక్కో షేరుకు రూ.75 చెల్లించటం ద్వారా రిటైల్ వాటాదారుల నుంచి ఈ వాటాలను కొనుగోలు చేయనున్నట్లు ఆల్‌కార్గో చైర్మన్ శశి కిరణ్ షెట్టి తెలిపారు.

## హైదరాబాద్‌లో షూర్ ఇంజనీరింగ్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన మైక్రోఫోన్, ఎలక్ట్రానిక్స్ కంపెనీ షూర్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందులో కంపెనీ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్‌లను అభివృద్ధి చేస్తుంది. కంపెనీ గత ఏడాది బెంగళూరులో అమ్మకాలు, మార్కెటింగ్ కార్యాలయాన్ని ప్రారంభించింది. తాజాగా హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ కేంద్రాన్ని ప్రారంభించామని షూర్ ప్రెసిడెంట్, సీఈఓ క్రిస్టిన్ షువ్‌నిక్ తెలిపారు. కంపెనీకి హైదరాబాద్ కేంద్రం ఐదో అంతర్జాతీయ ఇంజనీరింగ్ కేంద్రం అవుతుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టీసీఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ప్రాంతీయ అధిపతి వీ రాజన్న తదితరులు హాజరయ్యారు. ఈ కేంద్రంలో 70 మంది పనిచేస్తారు. షూర్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ విభాగంలో 2013 నుంచి హైదరాబాద్ ఇంజనీర్లు పనిచేస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంలో సాఫ్ట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్‌తో పాటు షూర్ కంపెనీకి చెందిన అన్ని ఉత్పత్తులకు ఇక్కడ క్వాలిటీ టెస్టింగ్ చేస్తారు.

## అపర్ణా నుంచి ఖరీదైన అల్యూమినియం కిటికీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): 'అల్టేజా' బ్రాండ్ పేరుతో ఖరీదైన (హై-ఎండ్) అల్యూమినియం విండోలు, డోర్ల మార్కెట్లోకి అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ అడుగుపెట్టింది. వచ్చే ఏడాది కాలంలో ప్రీమియం విండోలు, డోర్ల విభాగంలో 10 శాతం వాటాను సొంతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రీమియం విండోలను విడుదల చేయడం ద్వారా అపర్ణా-క్రాఫ్ట్ పోర్ట్‌ఫోలియోను పెంచుకుందని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి తెలిపారు. అపర్ణా ఎంటర్‌ప్రైజెస్, హాంకాంగ్‌కు చెందిన క్రాఫ్ట్ హోల్డింగ్స్ కలిసి అపర్ణా-క్రాఫ్ట్‌ను ఏర్పాటు చేశాయి. అల్టేజా కస్టమర్లకు ఎండ్ టు ఎండ్ సేవలను అందిస్తున్నామని, బాచుపల్లిలోని యూనిట్‌లో అల్టేజా విండోలు, డోర్లను తయారు చేస్తామని తెలిపారు.




జెడ్ఎస్‌ను విడుదల చేస్తున్న రాజీవ్ చాబా

## ఎంజీ మోటార్ నుంచి జెడ్ఎస్ ఎలక్ట్రిక్ కారు

న్యూఢిల్లీ : ఎంజీ మోటార్ ఇండియా..ఎలక్ట్రిక్ కార్ మోడల్ 'జెడ్ఎస్'ను ఆవిష్కరించింది. హెక్టార్ తర్వాత రెండో ఉత్పత్తి జెడ్ఎస్ అని, జనవరి నుంచి హైదరాబాద్ సహ మరో నాలుగు నగరాల్లో ఈ ఎలక్ట్రిక్ కారును విక్రయించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఎంజీ మోటార్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ రాజీవ్ చాబా వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి చార్జింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పలువురితో జట్టు కట్టినట్లు చెప్పారు. 143 పీఎస్ పవర్‌తో తీసుకువచ్చిన జెడ్ఎస్.. ఒకసారి చార్జింగ్‌తో 300 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణిస్తుందని తెలిపారు. గుజరాత్‌లోని హలోల్ ప్లాంట్‌లో ఈ కారును ఉత్పత్తి చేస్తోంది. కాగా భారత మార్కెట్ కోసం రూ.10 లక్షల లోపు కాన్సెప్ట్ కారును తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాజీవ్ చెప్పారు.

### ఆంధ్రా బ్యాంక్‌కు ఆర్‌బీఐ జరిమానా

ముంబై: ఆంధ్రా బ్యాంక్‌కు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రూ.25 లక్షల జరిమానా విధించింది. కైవైసీ, యాంటీ మనీ లాండరింగ్ (ఏఎంఎల్), కరెంట్ ఖాతాల ప్రారంభంలో కొన్ని నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఈ జరిమానా విధించింది.

## సాఫ్ట్‌వేర్, మైనింగ్, బుక్ ప్రింటింగ్ తక్కువ పన్ను పరిధిలోకి రావు



న్యూఢిల్లీ : తయారీ రంగంలోని కొత్త కంపెనీలకు ప్రకటించిన 15 శాతం కార్పొరేట్ పన్ను సాఫ్ట్‌వేర్, మైనింగ్, పుస్తక ప్రచురణ కంపెనీలకు వర్తించదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజ్యసభలో పన్ను చట్టాల సవరణ బిల్లు 2109పై రాజ్యసభలో జరిగిన చర్చకు ఆమె సమాధానం చెబుతూ ఈ రాయితీ పన్ను పరిధిలోకి రాని కంపెనీల జాబితా సవరణ బిల్లులో ఉన్నదన్నారు. 2019 అక్టోబరు 1వ తేదీ తర్వాత, 2023 సంవత్సరానికి ముందు కొత్తగా ఏర్పాటయ్యే తయారీ రంగంలోని కంపెనీలకు ప్రభుత్వం రాయితీ ధరపై 15 శాతం కార్పొరేట్ పన్ను ప్రకటించింది. ఈ రాయితీ వర్తించని కంపెనీల నెగిటివ్ జాబితాలో పై మూడు విభాగాలు ఉన్నాయని ఆమె చెప్పారు. మేలో సార్వత్రిక ఎన్నికల అనంతరం వృద్ధి రేటులో క్షీణతను అరికట్టేందుకు సెప్టెంబరు 20వ తేదీన ఆర్థికమంత్రి కార్పొరేట్ పన్ను భారీగా తగ్గిస్తూ ప్రకటన చేశారు. అధికార యంత్రాంగంలో రెడ్‌టేపిజం నివారణకు, ఎఫ్‌డీఐల ఉత్తేజానికి కార్పొరేట్ పన్ను తగ్గింపు సహాయపడుతుందని ఆమె అన్నారు. కొత్త పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా తయారీ రంగంలోని కొత్త కంపెనీలకు కార్పొరేట్ పన్ను రాయితీని ప్రకటించామని ఆమె చెప్పారు. ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేయడం లక్ష్యంగా మరిన్ని సంస్కరణలు కూడా చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## మార్కెట్ పెదవి విరుపు

**70 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

ముంబై : ఆర్‌బీఐ రెపోరేట్లపై ఆకస్మికంగా అనుసరించిన యథాపూర్వ స్థితి మార్కెట్‌లో ఉత్సాహాన్ని ఆవిరి చేసింది. వరుసగా ఆరో విడత కూడా రేట్ల తగ్గింపు ఉంటుందన్న ఊహాగానాలు, ఆశల నడుమ ఉదయం ఉత్సాహంగానే ప్రారంభమైన మార్కెట్ ఆర్‌బీఐ పాలసీ వెలువడగానే నష్టాలు చవి చూసింది. 2019-20 వృద్ధిరేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.1 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం మార్కెట్‌ను మరింత నష్టాల్లోకి నెట్టింది. రోజు మొత్తం మీద ఎగుడుదిగుడులుగా పయనించిన సెన్సెక్స్ చివరికి 70.70 పాయింట్ల నష్టంతో 40.779.59 వద్ద ముగియగా నిఫ్టీ 24.80 పాయింట్ల నష్టంతో 12018.40 వద్ద క్లోజయింది. మెటల్ ఇండెక్స్ భారీగా నష్టపోగా బేసిక్ మెటీరియల్స్, ఎనర్జీ ఇండెక్స్‌లు కూడా నష్టాల్లో ట్రేడయ్యాయి. కాపిటల్ గూడ్స్, ఐటీ, టెక్నాలజీ ఇండెక్స్‌లు మాత్రం లాభపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టపోయాయి. రేట్ల ప్రభావం అధికంగా ఉండే ఆటో, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ షేర్లన్నీ ఫ్లాట్‌గా లేదా నష్టాల్లో ముగిశాయి.


రాజధానిపై రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

## రాష్ట్రానికి ఒరిగిందేంటి?

**▸▸ వైసీపీ నేతలకు గుమస్తాలుగా పోలీసులు: కన్నా**

ప్రత్తిపాడు, డిసెంబరు 5: "ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. స్వర్గం చూపిస్తామని అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నాయి. రాష్ట్రంలో జరిగిన మార్పు ఏమిటి? ఐదు నెలలుగా ఇసుక కొరత వల్ల కార్మికులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వైసీపీ నాయకులు ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు" అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మాట తప్పం, మడమ తిప్పం అంటూ పదేపదే చెప్పే జగన్ ఎన్నికల్లో రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయంగా రూ.12,500 ఇస్తామని చెప్పి ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,300తో కలుపుకొని రైతులకు రూ.13,500 పెట్టుబడి సహాయం ఇవ్వడం మాటతప్పడం కాదా అని కన్నా ప్రశ్నించారు. అధికార పార్టీల నాయకులు ఎన్నికల్లో పెట్టుబడులు పెడుతున్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత దోపిడీలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ నాయకులకు గుమస్తాలుగా పోలీసులు పనిచేయడం ఎంతవరకు సమంజసమని కన్నా ప్రశ్నించారు. పోలీసులు తీసుకునే జీతాలు ప్రజల సొమ్ములు కాదా అని నిలదీశారు. దేశంలో 48 వేల మంది దళితులను పారిశ్రామికవేత్తలుగా మలిచిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు అన్నారు.

## మోదీ తమ్ముడు పవన్: బీజేపీ నేత

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రధాని నరేంద్ర మోదీకి చిన్న తమ్ముడు లాంటివాడు. ఈ విషయాన్ని గతంలో సాక్షాత్తు నరేంద్ర మోదీయే వెల్లడించారు. ప్రధాని, హోం మంత్రి అమిత్‌షా తీసుకొంటున్న సాహసోపేత నిర్ణయాలను పవన్ అభినందించడాన్ని స్వాగతిస్తున్నాం. బీజేపీతో కలిసి పనిచేస్తానంటే మాకెలాంటి అభ్యంతరం లేదు. ఆయనను సాదరంగా ఆహ్వానిస్తాం" అని బీజేపీ యువ మోర్చా ఏపీ అధ్యక్షుడు రమేశ్ నాయుడు అన్నారు. ఆయన గురువారం ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. పవన్‌తో బీజేపీకి గతం నుంచి సత్సంబంధాలున్నాయని తెలిపారు. ప్రధానిపై తీవ్ర విమర్శలు చేసిన టీడీపీతో మాత్రం భవిష్యత్‌లో కూడా కలిసే ప్రసక్తేలేదన్నారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రంలో మత మార్పిడులు జోరందుకుంటున్నాయని ఆరోపించారు.

## సిట్ విచారణకు బీటెక్ రవి

**▸▸ వివేకా హత్య కేసులో పిలిచి ప్రశ్నలు**


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటెక్ రవి

కడప, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిట్ బృందం విచారణ ముమ్మరం చేసింది. నాలుగురోజులుగా కడపలోని జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటరులో ఎస్పీ అన్బురాజన్ నేతృత్వంలోని సిట్ బృందం విచారణ చేపడుతోంది. ఈ క్రమంలో గురువారం టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, బీజేపీ నేత, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి సోదరుడు, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డిని విచారించింది. వీరితో పాటు పరమేశ్వర్‌రెడ్డిని కూడా పిలిచి ప్రశ్నించింది. సిట్ బృందం అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చినట్లు బీటెక్ రవి విలేకరులకు వెల్లడించారు.

## ఏపీని క్రైస్తవ రాష్ట్రంగా మార్చేస్తున్న జగన్

**▸▸ ఆనంద ఆశ్రమం అధిపతి శ్రీనివాసానంద ఆరోపణలు**



సీతంపేట(విశాఖపట్నం), డిసెంబరు 5: అంతర్జాతీయ క్రైస్తవ మతపెద్దలతో లాలూచీపడి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను క్రైస్తవ రాష్ట్రంగా మార్చేందుకు యత్నిస్తున్నారని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనంద ఆశ్రమం అధిపతి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. విశాఖపట్నంలో గురువారం ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఓటు వేసి గెలిపించిన హిందువులనే జగన్ అగౌరవపరుస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలో దుర్గగుడి వద్ద కూడా మత మార్పిడులు జరుగుతున్నాయన్నారు. సింహాచలం కొండపైకి వెళ్లే బస్సులపై క్రైస్తవ మత ప్రచారం పోస్టర్లు అతికించడం, శ్రీశైలం దేవస్థానంలో అన్యమతస్థులకు షాపులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. టీటీడీ భూములను వేలం పేరుతో అన్యమతస్థులకు అమ్మే అధికారం ఎవరిచ్చారని శ్రీనివాసానంద ప్రశ్నించారు.

## పార్టీ మార్పు మీడియా సృష్టే: గంటా



విశాఖపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "పార్టీ మారతానంటూ మీడియానే ఊహాగానాలు చేస్తోంది. ఎన్నికల ముందూ, తరువాత నాపై అదే ప్రచారం సాగుతోంది. నిత్యం ఆ విధంగా నన్ను లైవ్‌లో ఉంచుతున్నందుకు మీడియాకు ధన్యవాదాలు" అని విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమన్వయకర్తల విస్తృత సమావేశంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీని ఢిల్లీలో కలిశానంటూ పెట్టిన ఫోటో ఆయన గుజరాత్ సీఎంగా ఉండగా కలిసిందని వివరించారు. పార్టీ మార్పిడిపై మీడియానే నాలుగైదు ముహూర్తాలు కూడా ఖరారు చేసిందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గానికి దూరంగా లేనని వివరించారు. శుభకార్యాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులను కలవడం చాలా సహజమని, వాటిని ఆధారంగా చేసుకుని వార్తలు రాయడం తగదన్నారు. అమిత్‌షాపైన, బీజేపీపైన పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన్నే అడగాలని అన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు..

## టీడీపీ భవనం అక్రమ నిర్మాణం

**▸▸ కూల్చివేసి, భూ స్వాధీనానికి ఆదేశించండి**

**▸▸ హైకోర్టులో ఆళ్ల పిటిషన్**

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "గుంటూరు జిల్లా ఆత్మకూరులో నిర్మితమైన టీడీపీ కార్యాలయ భవనం అక్రమ కట్టడం. దానిని కూల్చివేసి, ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలి" అని కోరుతూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఆత్మకూరు పరిధిలో ఉన్న వాగు పోరంబోకుకు చెందిన సర్వే నెంబరు 392లో 3.65 ఎకరాల భూమిని టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం 99 సంవత్సరాల పాటు లీజుకిస్తూ 2017లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని, ఇది అక్రమమని పేర్కొన్నారు. వాగులు, వంకలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల భూముల్ని ఇతరాలకు కేటాయించడం పర్యావరణ చట్టాలకు విరుద్ధమని గతంలో సుప్రీంకోర్టు చెప్పిందని పిటిషన్‌లో గుర్తు చేశారు. ఈ వ్యవహారంలో అనేక చట్ట ఉల్లంఘనలు ఉన్నందున గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయడంతో పాటు టీడీపీ భవనాన్ని కూల్చివేసి, ఆ భూమిని స్వాధీనం చేసుకునేలా సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించాలని అభ్యర్థించారు.


సమావేశంలోని ఫ్లెక్సీపై 'సేవ్ అమరావతి' అని రాస్తున్న బాబు

### ప్రజలంతా తప్పు చేశానంటే

# సారీకి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. చరిత్ర పొడవునా ఒక మంచి రాజధాని నగరం లేని దురదృష్టం ఆంధ్రులను వెన్నాడాల్సిందేనా అని వాపోయారు. గురువారం విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ హాలులో ప్రజా రాజధాని అమరావతిపై టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మనకొక ప్రపంచ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మించుకోలేమా? హైదరాబాద్‌లో సాధ్యమైంది అమరావతిలో ఎందుకు కాదు' అని ప్రశ్నించారు. అక్కడ తన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు వైఎస్ సహా ఎవరూ హైదరాబాద్‌ను చెడగొట్టలేదని.. ఆ ప్రణాళికలను కొనసాగించారని తెలిపారు. కానీ ఇక్కడ విరుద్ధంగా జరుగుతోందన్నారు. రకరకాల దుష్ప్రచారాలతో అమరావతిని చంపేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'దానిని చంపేస్తే నాకొచ్చిన నష్టమేమీ లేదు. భావితరాలు, తెలుగు జాతి నష్టపోతాయి. ఒక పెద్ద రాజధాని ఉంటే ప్రభుత్వానికి ఆదాయం, సంపద, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, పేదరిక నిర్మూలన జరుగుతాయి. ఇప్పుడు తెలంగాణకి వస్తున్న ఆదాయంలో 60 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. మహారాష్ట్రకు 57 శాతం ముంబై నుంచి వస్తోంది. నా కులం వారో.. నా బంధువులో ఉన్నారని హైదరాబాద్ కోసం శ్రమించానా? మొత్తం తెలుగు జాతి కోసం శ్రమించాను' అని తెలిపారు.

### స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలిచ్చారు..

'భౌగోళికంగా రాష్ట్రానికి మధ్యలో ఉందని అమరావతిని రాజధానిగా ఎంచుకున్నాం. రైతులకు ఒక్క పిలుపు ఇస్తే 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. ఇంత కంటే మంచి నమూనా లేదని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ దీనిని అధ్యయన అంశంగా స్వీకరించింది. సింగపూర్‌లో అవినీతి మచ్చుకైనా కనిపించదు. నాపై కుదిరిన నమ్మకంతో అడిగిన వెంటనే మన రాజధానికి ప్రణాళిక తయారు చేసి ఇవ్వడానికి సింగపూర్ అంగీకరించింది. మన వద్ద స్టార్టప్ ఏరియాలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు పెట్టి రెండున్నర లక్షల ఉద్యోగాలు సృష్టించాలని అనుకున్నారు. ఈ ప్రభుత్వం వాళ్లను వెళ్లగొట్టింది. నాపై కోపం ఉంటే ఉండవచ్చు. కానీ రాజధానిపైనా.. ఇక్కడకు రావాలనుకున్న సంస్థలపైనా కోపమెందుకు?. రాష్ట్ర ప్రజలు, యువత, మేధావులు ఆలోచించాలి. రాజకీయంగా మాతో విభేదించేవారు ఉండవచ్చు. కానీ మీ దారిలో మీరు రాజధాని కోసం పోరాడండి. వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఆలోచించాలి.. విభజనతో ఒకసారి నష్టపోయాం. రాజధానిని పాడుచేసుకుని మరోసారి నష్టపోవద్దు'

### ప్రభుత్వ నిధులు అక్కర్లేదు..

'ఏ పనికీ రోడ్డు తవ్వే అవసరమే ఉండదు. కరెంటు తీగల కోసం చెట్ల కొమ్మలు కొట్టే పని ఉండదు. చివరకు గ్యాస్, ఏసీ కూడా పైపులతో ఇంటింటికీ అందేలా ప్రణాళిక రూపొందించాం. హైదరాబాద్ సహా దేశంలో ఏ నగరంలో ఇన్ని వసతులు లేవు. ఇప్పటికి ఖర్చు చేసింది కాక అమరావతిలో పూర్తి స్థాయి వసతుల నిర్మాణానికి ఇంకా రూ.లక్ష కోట్లు కావాలి. దీనికి ప్రభుత్వ నిధులు ఖర్చు చేయాల్సిన అవసరమే లేదు. ప్రభుత్వం చేతిలో 8 వేల ఎకరాల భూమి ఉంది. దానిని కొద్ది కొద్దిగా అమ్ముకుంటూ ఆ నిధులతోనే ఈ పనులన్నీ పూర్తి చేసే అవకాశం ఉండేది. ప్రపంచ బ్యాంకు నిధులివ్వడానికి ముందుకొచ్చింది. జగన్ ప్రభుత్వానికి ఆసక్తి లేదని వెనక్కి వెళ్లిపోయింది. ఏపీలో జగన్ మాదిరిగా పాత ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేయొద్దని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రేకు సూచిస్తూ జాతీయ పత్రికలు సంపాదకీయాలు రాస్తున్నాయి. జగన్ ప్రభుత్వ నిర్ణయాలతో దేశ ప్రతిష్ఠ దెబ్బతిని ఈ దేశంలోకి వచ్చే పెట్టుబడులు తగ్గుతున్నాయని కేంద్రమే బాధపడే పరిస్థితి వచ్చింది'

### అన్నిటినీ పోగొట్టారు..

'రాష్ట్రంలో అమరావతి ఒక్కదానినే అభివృద్ధి చేయాలని మా ప్రభుత్వం అనుకోలేదు. పలు నగరాలను అభివృద్ధిచేసి వికేంద్రీకరణ జరపాలనుకున్నాం' అని చంద్రబాబు చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈ సమావేశంలో చేసిన వ్యాఖ్యకు సమాధానమిచ్చారు. 'ప్రముఖ కంపెనీ అదానీని ఒప్పించి విశాఖలో రూ.70 వేల కోట్లతో డేటా సెంటర్ పెట్టడానికి తీసుకొచ్చాం. అది వస్తే విశాఖ స్వరూపమే మారిపోయేది. దానిని పోగొట్టారు. విశాఖలో ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్ పెట్టడానికి లులూ గ్రూప్‌ను తెచ్చాం. వాళ్లనూ పోగొట్టారు. మేం రాక ముందు తిరుపతిలో సెల్‌ఫోన్ల తయారీ లేదు. ఇప్పుడు దేశంలో తయారయ్యే సెల్‌ఫోన్లలో 20-30 శాతం అక్కడే తయారవుతున్నాయి. ఏభై శాతానికి పెంచడానికి రిలయన్స్ కంపెనీని తెచ్చాం. అదీ పోయింది. ప్రకాశం జిల్లాలో రూ.25 వేల కోట్లతో పేపర్ పరిశ్రమ తెచ్చాం. వాళ్లూ వెళ్లిపోయారు. ఎంతో పోటీ ఎదుర్కొని అనంతపురం జిల్లాకు కియా కార్ల ఫ్యాక్టరీ తెచ్చాం. దానికంత సబ్సిడీ ఎందుకని మాట్లాడారు. మనం ఇవ్వకపోతే దానిని ఎగరేసుకుపోవడానికి అప్పట్లో మహారాష్ట్ర సిద్ధంగా ఉంది. కర్నూలుకు ఎయిర్ పోర్టు, సోలార్ పరిశ్రమలు, యూనివర్సిటీలు తెచ్చాం. అన్ని ప్రాంతాల సమతుల అభివృద్ధికి కట్టుబడే పనిచేశాం' అని వివరించారు. అమరావతి నిర్మాణానికి రూపొందించిన ప్రణాళికలతో ఆకర్షితుడైన ప్రధాని మోదీ స్వయంగా ఫోన్ చేసి కజక్స్థాన్ దేశ రాజధాని అస్తానా (నూర్-సుల్తాన్)ను చూసి రావాలని కోరారని.. మనం చేయగలమన్న నమ్మకం వల్లే ఇలాంటి సలహా ఇచ్చారన్నారు. ఇక్కడ ఆస్పత్రులు లేనందువల్ల హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లోని ఆస్పత్రులకు ఆరోగ్య శ్రీ పథకాన్ని విస్తరిస్తున్నట్లు జగన్ చెప్పారని.. రాజధానిని అభివృద్ధి చేసుకోకపోతే మన ఆస్పత్రులు ఏనాటికీ ఎదగలేవన్న సత్యాన్ని విస్మరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## ప్రజా రాజధానిని కొనసాగించండి

**▸▸ అఖిలపక్షం తీర్మానం**

ఏపీ రాజధానిగా అమరావతిని కొనసాగించడంపై నెలకొన్న సందిగ్ధతకు తెర దించుతూ ప్రజారాజధాని పనులు ఏ మార్పు లేకుండా వేగంగా కొనసాగించాలని అఖిలపక్ష సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు చంద్రబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. తీర్మానం పూర్తి పాఠం.. 'ఆంధ్రప్రదేశ్‌కి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమవుతున్న ప్రజా రాజధాని అమరావతి పనులు 6 నెలలుగా స్తంభించిపోవడం పట్ల సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాష్ట్రానికి తలమానికం కానున్న అమరావతి మాస్టర్ ప్లాన్‌ను యథాతథంగా అమలు చేస్తూ పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తోంది. ఆలస్యమయ్యే ప్రతి క్షణం నిర్మాణ వ్యయాన్ని పెంచుతుందన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాలి. రాష్ట్రంలోని 13 జిల్లాలకు భవిష్యత్‌లో రాజధాని ద్వారా వేల కోట్ల ఆదాయం.. లక్షలాది ఉపాధి అవకాశాలతోపాటు పేదరిక నిర్మూలన సాధ్యపడుతుంది. ఇలాంటి అవకాశాలను ప్రభుత్వం కాలరాయాలనుకోవడాన్నిసమావేశం తీవ్రంగా గర్హిస్తోంది. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో ఏ మార్పులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది. అమరావతిపై చర్చించడానికి ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానిస్తోంది'

# ఇన్‌సైడర్ ట్రేడింగా.. నిరూపించండి

**▸▸ వైసీపీపై చంద్రబాబు ఆగ్రహం**

**▸▸ ప్రతి ఆరోపణకూ సమాధానం**

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రకటనకు ముందే ఆ ప్రాంతంలో వేల ఎకరాల భూములు కొనుక్కున్నారని.. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని చేస్తున్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని టీడీపీ అధినేత చంద్రబాబు వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. అఖిలపక్ష సమావేశంలో ప్రతి ఆరోపణకూ ఆయన సమాధానమిచ్చారు. 'రాజధాని ప్రకటనకు ముందు ఆ ప్రాంతంలో మొత్తం అమ్మకం జరిగిందే 176 ఎకరాలు. రాజధాని ప్రకటన తర్వాత నుంచి 2019 మార్చి వరకూ అన్ని పార్టీలకు చెందిన వందల మంది కలిసి 1190 ఎకరాల భూమి అమ్మకం లేదా కొనుగోళ్లు చేశారు' అని తెలిపారు. రాజధాని ప్రకటన వచ్చిన తర్వాత ఇష్టం వచ్చిన వారు అమ్ముకోవచ్చు.. కొనుక్కోవచ్చని.. దాన్నెవరూ ఆపలేరని అన్నారు. వివిధ ఆరోపణలకు ఆయన జవాబులివీ..

**ఆరోపణ:** ఒక సామాజిక వర్గం కోసమే అమరావతి ఏర్పాటు

**సమాధానం:** రాజధాని పరిధిలో ఎస్సీ బీసీ మైనారిటీ వర్గాలవారు 75 శాతం ఉన్నారు. మొత్తం 29 పంచాయతీల్లో 15 పంచాయతీల్లో కాపులు గణనీయంగా ఉన్నారు. కమ్మ, రెడ్డి జనాభా దాదాపు సమానంగా ఉన్నాయి. ఒక సామాజిక వర్గం మాత్రమే ఎక్కువ అన్నది వాస్తవం కాదు.

### దళిత రైతులకు అన్యాయం చేశారు

దళిత రైతుల పేరు మీద ఉన్న ఎస్సైన్‌మెంట్ భూములను ప్రభుత్వం ఉచితంగా తీసుకోలేదు. ఆ భూములకు ఒక ప్యాకేజీ నిర్ణయించి ఆ ప్రకారం భూమిలో వాటా ఇచ్చింది. వారికి కూడా ఇతర రైతుల మాదిరిగానే కౌలు ఇచ్చింది. ఆ కౌలును ఏటా పెంచుతూ పోతారు. భూమిలేని పేదలకు నెలకు రూ.2500 సామాజిక పింఛను ఇస్తున్నారు. ఈ పింఛను కూడా ఏటా పెంచాలని నిర్ణయించింది.

### బినామీ పేర్లతో భూములు కొన్నారు

బినామీ పేర్లతో కొంటే చర్య తీసుకోండి. ప్రభుత్వం మీదే. అధికారం మీ వద్దే ఉంది. చర్య తీసుకోకుండా మిమ్మల్ని ఎవరు ఆపారు? ఊరికే బెదిరింపులు, తప్పుడు ప్రచారాలు ఎందుకు?

### రెండు వేల ఎకరాలు చాలు. అనవసరంగా ఎక్కువ భూమి తీసుకున్నారు.

ప్రతిపక్ష నేత హోదాలో జగన్ 30 వేల ఎకరాలు కావాలని, ఇప్పుడు రెండు వేల ఎకరాలు చాలు అంటున్నారు. వారి వ్యాపారాలకు వేల ఎకరాలు కావాలి. రాజధానికి మాత్రం వద్దా?

### చదరపు అడుగుకు 12 వేలు ఖర్చు చేశారు.

అసెంబ్లీ భవన నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.5,333, హైకోర్టు భవనాలకు రూ.3,666 చొప్పున ఖర్చు పెట్టారు. సచివాలయం, అసెంబ్లీ, కౌన్సిల్, పార్కింగ్, భూమి అభివృద్ధి, ఫర్నిచర్, గ్రీనరీ, సెంట్రల్ ఏసీ వంటివాటికి చ.అడుగుకు 7,101 వ్యయమైంది. ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల భవనాలకు 3,459 అయింది.

### బాలకృష్ణ వియ్యంకుడికి 500 ఎకరాలు ఇచ్చారు..

రాజధానిలో సెంటు భూమి కూడా బాలకృష్ణ వియ్యంకునికి ఇవ్వలేదు. 130 సంస్థలకు పారదర్శకంగా 1293 ఎకరాలు ఇచ్చాం. ఇందులోనే విశ్వవిద్యాలయాలు, టీటీడీ, పాత్రికేయులకు కేటాయించాం.

### రాజధానికి ముంపు సమస్య ఉంది.

రాజధానికి ముంపు సమస్య లేదని గ్రీన్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. దీనిపై వేసిన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. అమరావతిలో నేలలకు మంచి పటుత్వం ఉందని, బరువు మోసే శక్తి చెన్నైతో పోలిస్తే ఇక్కడ బాగా ఎక్కువని నిర్మాణ నిపుణులు నిర్ధారించారు. హైదరాబాద్‌లో రాతి నేలలు కావడం వల్ల.. దానితో పోలిస్తే ఇక్కడ అంత ఖర్చు లేదు.

### గ్రాఫిక్స్‌లోనే కూర్చుని పనిచేస్తున్నారా?

'గ్రాఫిక్స్ కాదు... నేలపై నిజాలు' అనే పేరుతో అఖిలపక్ష సమావేశంలో ఒక వీడియోను ప్రదర్శించారు. రాజధాని ప్రాంతంలో నిర్మిస్తున్న వివిధ రకాల టవర్లు, వాటి నిర్మాణ పురోగతి, రోడ్లు, ఇప్పటికే నిర్మించిన అసెంబ్లీ, సచివాలయం, విశ్వవిద్యాలయాలను ఇందులో చూపించారు. రాజధానిలో గ్రాఫిక్స్ తప్ప ఏవీ లేవని అంటున్న వైసీపీ నేతలు ఈ గ్రాఫిక్స్‌లో కూర్చునే ప్రభుత్వాన్ని నడుపుతున్నారా అని చంద్రబాబు ప్రశ్నించారు. 'అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు అమరావతి నుంచే పనిచేస్తున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మిస్తున్న 18 టవర్లు 78 శాతం పూర్తయ్యాయి. ఐఏఎస్‌ల టవర్లు 72 శాతం పూర్తయ్యాయి. ఈ ఆరు నెలలు పనులు కొనసాగితే వాటిలో గృహ ప్రవేశాలు కూడా పూర్తయ్యేవి. గెజిటెడ్ అధికారుల ఎనిమిది టవర్లు, ఎన్జీవోల 21 టవర్లు 60 శాతం పూర్తయ్యాయి. పేదలకు నిర్మించిన ఐదు వేల ఫ్లాట్లు పూర్తయ్యాయి. ఎస్‌ఆర్‌ఎం, విట్ విశ్వవిద్యాలయాలు నిర్మాణాలు పూర్తయి పనిచేస్తున్నాయి. ఎయిమ్స్ కూడా పూర్తి కావొస్తోంది. రాజధాని నిర్మాణం కోసం ఇప్పటికి రూ.9,500 కోట్లు సమీకరించి అందులో రూ.9 వేల కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్ర బడ్జెట్ అంతా అమరావతి కోసమే ఖర్చు చేస్తున్నట్లుగా మాపై దుష్ప్రచారం చేశారు. బడ్జెట్‌లో నుంచి కేవలం రూ.1,100 కోట్లే ఖర్చు చేశాం. మిగిలిన నిధులన్నీ కేంద్రం నుంచో... ఇతరత్రా మార్గాల ద్వారానో సమీకరించాం. అమరావతి కోసం రూ.2 వేల కోట్ల బాండ్లు జారీ చేస్తే గంటలో అమ్ముడుపోయాయి. అమరావతికి అంత క్రేజ్ తెచ్చాం. గ్రాఫిక్స్‌తోనే ఇవన్నీ జరిగాయా' అని నిలదీశారు. అఖిలపక్ష సమావేశంలో 14 పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరితో కలిపి వివిధ సంఘాల నుంచి 35 మందిమాట్లాడారు. రాజధానిపై తాము విడిగా ఉద్యమ కార్యక్రమం రూపొందించుకుంటున్నామని, దీనికి రాలేమని బీజేపీ నేతలు చెప్పారు. అమరావతిపై తమ పార్టీ త్వరలో ఒక వైఖరి తీసుకుంటుందని, అందువల్ల ఇప్పుడు రాలేమని సీపీఎం నేతలు తెలిపారు. ఈ సమావేశానికి పలువురు ముఖ్య నేతలతోపాటు సుమారు పది మంది టీడీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

## రాజధానిపై ఇప్పుడా చర్చ

**▸▸ కమిటీ ఏర్పాటు శోచనీయం: సీపీఐ రామకృష్ణ**

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "రాజధానిని అసెంబ్లీ సాక్షిగా నిర్ణయించి నిర్మాణం కూడా మొదలు పెట్టారు. నాలుగేళ్ళ తర్వాత ఇప్పుడు అది ఎక్కడ ఉండాలి? అన్నదానిపై చర్చ అవసరమా! రాష్ట్రం లోపలా, బయటా అందరూ అమరావతిని అంగీకరించారు. ఇప్పుడు రాజధాని ఎక్కడో తేల్చడానికి కమిటీ వేయడం శోచనీయం. ఇప్పుడు ఈ చర్చ సరికాదు" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. ప్రజా రాజధాని అమరావతిపై గురువారం విజయవాడలో టీడీపీ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజధాని అమరావతిలోనే ఉంటుందని ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ వారానికో ప్రకటనతో అయోమయం సృష్టిస్తున్నారంటూ మండిపడ్డారు. చివరకు అమరావతిని ఆయన శ్మశానంతో పోల్చడం దారుణమన్నారు. 'అమరావతి పర్యటనకు వెళ్ళిన చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్ళు వేయడం మంచిది కాదు. మేం మా పార్టీ తరఫున అమరావతిలో తిరిగాం. చాలా పనులు జరిగాయి. అన్నీ ఆపు చేశారు. ఇది మంచి విధానం కాదు" అంటూ రామకృష్ణ స్పష్టంచేశారు. గుజరాత్‌లో పటేల్ విగ్రహానికి రూ.3000కోట్లు ఇచ్చిన కేంద్రం.. రాజధాని నిర్మాణానికి ఎంత ఇచ్చిందంటూ ప్రశ్నించారు. అమరావతిపై సీఎం జగన్మోహన్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, దానికి చంద్రబాబును పిలవాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు కూడా అభివృద్ధిలో ప్రాధాన్యం ఉండేలా చూడాలని కోరారు.

## అమరావతికి వ్యతిరేకం కాదు: బొలిశెట్టి

జనసేన పార్టీగాని... తమ నేత పవన్ కల్యాణ్‌గాని అమరావతికి వ్యతిరేకం కాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని తాము సమర్థించామన్నారు. కొందరు రైతులు తమవద్ద నుంచి బలవంతంగా భూమి తీసుకొంటున్నారని ఫిర్యాదు చేస్తే పవన్ స్పందించారని స్పష్టంచేశారు. చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరమనే మద్దతు ఇచ్చామన్నారు. అమరావతిపై జగన్మోహన్‌రెడ్డి అపోహలు రెచ్చగొడితే అది సరికాదని చెప్పామన్నారు. హోదా కోసం అవసరమైతే అందరం కలిసి ఢిల్లీ వెళ్దామని సూచించారు. ప్రపంచం గర్వించదగ్గ రాజధాని నిర్మాణానికి చంద్రబాబు పునాది వేశారని, జగన్ దానిని కొనసాగించడం మంచిదని లోక్‌సత్తా పార్టీనేత బాబ్జీ పేర్కొన్నారు. ఒకవేళ చంద్రబాబుతో మాట్లాడటానికి జగన్‌కు ఇబ్బంది ఉంటే మేధావులను పిలిచి మాట్లాడి రాజధాని పురోగతిని కొనసాగించాలన్నారు.

## అమరావతిపై రోజూ అత్యాచారమే: ఆప్

రాజధాని ఎక్కడో పదేపదే చర్చించే దౌర్భాగ్యం దేశంలో ఏ రాష్ట్రంలో లేదని, ఇక్కడ నెలకొనడం బాధాకరమని ఆప్ నేత ఏఏవీ ప్రసాద్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో దిశపై జరిగిన అత్యాచారంతో దేశం అంతా కదిలిందని, అమరావతిపై ఆరు నెలలుగా రోజూ అత్యాచారం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి బొత్స రాజధానిపై చేస్తున్న విష ప్రచారం ముఖ్యమంత్రికి తెలియకుండా జరుగుతోందని అనుకోలేమన్నారు. చట్టసభల అధిపతులు మొదలుకొని మంత్రుల వరకూ మాట్లాడుతున్న బూతులు చూస్తే వైసీపీ పార్టీలో బూతుల ప్రయోగంపై ఒక రీసెర్చి వింగ్ పెట్టారన్న అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చింది రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికా లేక టీడీపీని నిర్మూలించడానికా అని సమతా పార్టీ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు ప్రశ్నించారు. తనదీ రాజధాని ప్రాంతమేనని, ఇక్కడ ఎవరూ వందల ఎకరాలు కొనలేద స్పష్టం చేశారు. టీడీపీని దెబ్బ తీయడానికి అమరావతిని చంపే ప్రయత్నం సరికాదన్నారు. రాజధాని మార్చాలని చూస్తే ప్రజా ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

## రాజధానిపై బాబు వ్యాపారం

**▸▸ మాయమాటలతో రైతులకు మోసం.. దళితుల భూములు లాక్కున్నారు**

**▸▸ తుళ్లూరు రౌండ్ టేబుల్ భేటీలో బుగ్గన**



తుళ్లూరు, డిసెంబరు 5: మాజీ సీఎం చంద్రబాబు మాయమాటలతో రైతులను మోసం చేశారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. రాజధాని నిర్మాణాన్ని వ్యాపారంలా చేయాలనేది ఆయన ఆశగా పేర్కొన్నారు. రాజధాని రైతులను సింగపూర్ తీసుకెళ్లి గ్రాఫిక్ విజన్ చూపించారని విమర్శించారు. గుంటూరు జిల్లా తుళ్లూరులో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అధ్యక్షతన గురువారం రాజధానిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి బుగ్గన హాజరయ్యారు. 500-1000 ఎకరాలు భూమి తీసుకుని పరిపాలనా భవనాలు కట్టి ఉంటే సరిపోయేదని ఆయన అభిప్రాయపడ్డారు. శివరామకృష్ణన్ కమిటీ కూడా రాజధానికి 1500 ఎకరాలు చాలని నివేదికలో పేర్కొందని.. దానిని చర్చకు కూడా రానివ్వలేదని తెలిపారు. కేవలం వ్యాపారం చేయడం కోసమే దళితుల భూములు లాక్కున్నారన్నారు. రాజధాని అమరావతిని అభివృద్ధి చేసే బాధ్యతను సీఎం జగన్ తీసుకుంటారని ఎమ్మెల్యే జోగి రమేశ్ తెలిపారు. రాజధాని ప్రాంతంలో గాకుండా ఎక్కడో అఖిలపక్షం పెట్టడానికి చంద్రబాబుకు సిగ్గుండాలన్నారు. రాజధానిలో అఖిల పక్ష భేటీ పెడితే చెప్పులు, రాళ్లు పడతాయనే విజయవాడలో పెట్టారని ఎమ్మెల్యే శ్రీదేవి విమర్శించారు.



## టీడీపీ కార్యాలయంలో లోకేశ్ పూజలు

గుంటూరు జిల్లా ఆత్మకూరులో నిర్మాణం పూర్తి చేసుకొన్న టీడీపీ జాతీయ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శృంగేరీ శారదా పీఠం పండితులు, రుత్విక్కుల ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ చేశారు. అనంతరం సుదర్శన హోమం, గణపతి హోమం నిర్వహించారు.

- మంగళగిరి

# ఆదిత్య.. నీ రూపు తెలిసిందిలే!



## సూర్యుడి రహస్యాలను వెలికి తీస్తున్న నాసా వ్యోమనౌక పార్కర్

వాషింగ్టన్, డిసెంబరు 5: నక్షత్రాల పుట్టుక.. వాటి పరిణామ క్రమం.. అవి అంతమయ్యే క్రమం.. వీటి గురించి మనకు తెలిసింది గోరంతే. తెలుసుకోవాల్సింది కొండంత. ఆ వివరాలు తెలుసుకునేందుకు నాసా పంపిన 'పార్కర్' వ్యోమనౌక.. తనకు కేటాయించిన పనిని ఊహించినదానికన్నా అద్భుతంగా నిర్వర్తిస్తోంది!! సూర్యుడికి 1.5 కోట్ల మైళ్ల దూరాన ఉన్న పార్కర్ వ్యోమనౌకలో అమర్చిన అత్యంత అధునాతన శాస్త్రీయ పరికరాలు సేకరించి పంపిన సమాచారంతో శాస్త్రజ్ఞులే అచ్చెరువొందుతున్నారట! ఆ సమాచారంతో నక్షత్రాల పుట్టుక, వాటి జీవితం, అంతాల గురించి ఎన్నో కొత్త విషయాలు తెలుస్తున్నాయని వారు వివరించారు. ఈ వివరాల ఆధారంగా.. రోదసిలో అత్యంత కఠినంగా ఉండే వాతావరణ పరిస్థితుల నుంచి వ్యోమగాములను రక్షించే కొత్త విధానాలను కూడా కనుగొనే అవకాశం ఉందన్నారు. పార్కర్ డేటాను విశ్లేషించగా తేలిన విషయాలేంటంటే..

- సూర్యుడి అయస్కాంత క్షేత్రాలు అనూహ్యంగా తల్లకిందులవుతున్నాయని పార్కర్ పంపిన సమాచారం ఆధారంగా వారు గుర్తించారు. ఈ పరిణామాన్ని వారు 'స్విచ్‌బ్యాక్స్'గా వ్యవహరిస్తున్నారు. స్విచ్‌బ్యాక్స్‌కు కారణమేంటో ఇంకా మిస్టరీగానే ఉంది గానీ.. సూర్యుడి శక్తి సౌరవ్యవస్థ అంచుల దాకా ఎలా ప్రసరిస్తుందనే విషయాన్ని తెలుసుకోవడానికి ఆ పరిణామం ఉపకరిస్తుందని శాస్త్రజ్ఞులు వివరించారు.
- సూర్యుడి నుంచి వెలువడే రేడియేషన్.. సూర్యుడి చుట్టూ 35 లక్షల మైళ్ల వ్యాసంలో విస్తరించి ఉన్న ధూళి కణాలను ఆవిరి చేస్తేస్తాయట! దానివల్ల ఆ ప్రాంతమంతా నిర్మలమైన 'ధూళి రహిత' జోన్‌గా ఉంటుందని వారు వివరించారు.
- సూర్యుడి చుట్టూ పరిభ్రమించే సౌరగాలుల వేగం.. ప్రామాణిక నమూనాల ఆధారంగా ఇన్నాళ్లూ శాస్త్రజ్ఞులు ఊహించినదానికన్నా పదిరెట్లు ఎక్కువగా ఉన్నట్టు తేలింది. నిజానికి.. సౌరగాలులు సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తుండగా వాటిని విశ్లేషించడం ఇదే మొదటిసారి. ఇది పార్కర్ సాధించిన మరో ఘనత.

## పార్లమెంట్ క్యాంటీన్లలో.. సబ్సిడీని వదులుకున్న ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: పార్లమెంట్ క్యాంటీన్లపై సోషల్ మీడియాలో నెటిజన్ల ఆగ్రహం కొత్త కాదు. "రొట్టె ధర రూ. 2, పప్పు రూ. 5, అన్నం రూ. 7, కోడికూర రూ. 50. ఇవ్వన్నీ ఎక్కడ దొరుకుతాయో తెలుసా? మన పార్లమెంట్‌లో..! పేదలు పూటకు తిండి దొరక్క అల్లాడుతుంటే.. ఎంపీలకు నామమాత్రపు ధరకే భోజనం దొరుకుతోంది" అనే విమర్శలు తరచూ వినిపించేవే. వీటికి ఫుల్‌స్టాప్ పెడుతూ ఎంపీలంతా ఏకగ్రీవంగా ఓ నిర్ణయం తీసుకున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సలహా మేరకు.. ఇకపై పార్లమెంట్ క్యాంటీన్లలో సబ్సిడీని త్యజిస్తున్నామంటూ వారంతా ముక్తకంఠంతో చెప్పారు. దీని వల్ల ప్రభుత్వానికి ఏటా రూ. 17 కోట్లు ఆదా అవుతుందని అంచనా. పార్లమెంట్ ప్రాంగణంలో ఉత్తర రైల్వే (ఎన్ఆర్) ఆధ్వర్యంలో నాలుగు క్యాంటీన్లు కొనసాగుతున్నాయి. ఎంపీల నిర్ణయంతో ఇకపై ఈ క్యాంటీన్లలో సబ్సిడీని నిలిపివేస్తారు.



# బలి పశువు పీవీ!

- గుజ్రాల్ మాట పీవీ విని ఉంటే సిక్కుల ఊచకోత జరిగేది కాదు
- మన్మోహన్ సంచలన వ్యాఖ్య

న్యూఢిల్లీ- హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన సిక్కుల ఊచకోతపై ఓ రాజకీయ దుమారం చెలరేగింది. ఆ ఘటనలో పీవీని బలిపశువుగా చేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ సూచనను పీవీ నరసింహారావు విని ఉంటే.. 1984లో సిక్కుల ఊచకోత జరిగి ఉండేది కాదంటూ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ బుధవారం రాత్రి ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. "ఇందిరాగాంధీ హత్య తరువాత.. అక్టోబరు 31, నవంబరు 1, 2 తేదీల్లో ఢిల్లీలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సిక్కులపై దాడులు జరుగుతున్నాయి. ఆ సాయంత్రమే గుజ్రాల్ అప్పటి హోంమంత్రి పీవీ నరసింహారావు వద్దకు వెళ్లారు. సైన్యాన్ని పిలిపించి పరిస్థితిని అదుపు చేయించడం మంచిదని సూచించారు. ఆ సూచనను పీవీ పట్టించుకోలేదు. ఆనాడు ఆర్మీ రంగంలోకి దిగి ఉండుంటే వందల మంది సిక్కులు ఊచకోతకు గురయ్యేవారు కాదు.." అని ఆయన గుజ్రాల్ శతజయంతి కార్యక్రమంలో పేర్కొన్నారు. సాక్షాత్తూ తన రాజకీయ గురువుపైనే మన్మోహన్ ఇలా వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మన్మోహన్ అభిప్రాయాల్ని పీవీ మనవడు, బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తీవ్రంగా ఖండించారు. మాజీ ప్రధాని మన్మోహన్ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీల కుటుంబాన్ని రక్షించేందుకు పీవీని బలిపశువు చేస్తున్నారని మన్మోహన్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ తరపున ఏదైనా మంచి జరిగితే గాంధీ కుటుంబ ఘనతగా ప్రచారం చేసి, చెడు జరిగితే పీవీకి ఆపాదిస్తారా? అని నిలదీశారు. ఐకే గుజ్రాల్ వచ్చి పీవీకి ఆనాడు చెప్పినా, ఆయన స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశమే లేదని వివరించారు. "ప్రధానిగా రాజీవ్ ఉన్న సమయంలో హోంమంత్రిగా పీవీ కార్యాలయానికి ఒక సర్క్యులర్ వచ్చింది. దాని ప్రకారం.. ఇది సున్నితమైన అంశమైనందున తామే పర్యవేక్షిస్తామని ప్రధాన మంత్రి కార్యాలయమే స్వయంగా స్పష్టం చేసింది" అని సుభాష్ వెల్లడించారు. అటు శిరోమణి అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ కూడా మన్మోహన్ వ్యాఖ్యలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అటు బీజేపీ కూడా మన్మోహన్ వ్యాఖ్యలను తప్పుపట్టింది. "పీవీ అంత చెడ్డవారే అయితే మన్మోహన్‌నెందుకు ఆర్థికమంత్రిగా తీసుకుంటారు? ఆనాడు ఊచకోతకు బాధ్యత ఓ రకంగా రాజీవ్‌దే. ఓ మహావృక్షం కూలినపుడు భూకంపం సహజం అని వ్యాఖ్యానించినది రాజీవ్. అది పరోక్షంగా ఊచకోతను సమర్థించడమే" అని ప్రకాశ్ జావడేకర్ అన్నారు.

### ఒకసారి కాదు... వందసార్లు

# క్షమాపణ చెబుతున్నా

## లాయర్‌కు సుప్రీం జడ్జి జస్టిస్ మిశ్రా క్షమాపణ



న్యూఢిల్లీ, డిసెంబరు 5: సుప్రీంకోర్టు చరిత్రలో ఓ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గోపాల్ శంకరనారాయణన్ అనే న్యాయవాదిపై రెండ్రోజుల కిందట ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా... తన మాటలపై విచారం వ్యక్తం చేస్తూ ఆయనకు క్షమాపణలు చెప్పారు. సుప్రీంకోర్టులో ఇటీవలి చరిత్రలో ఓ సీనియర్ జడ్జి ఇలా బహిరంగంగా క్షమాపణ చెప్పడం ఇదే ప్రథమమని న్యాయవాద వర్గాలు అంటున్నాయి. ఇండోర్ డెవలప్‌మెంట్ అథారిటీ భూసేకరణ కేసు రెండ్రోజుల కిందట విచారణకు వచ్చింది. ఆ అథారిటీ తరఫున వాదిస్తున్న గోపాల్ శంకర్‌నారాయణన్‌పై ఐదుగురు సభ్యుల రాజ్యాంగధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న జస్టిస్ అరుణ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ధిక్కార నేర చర్యలు తీసుకుంటానంటూ ఆయనపై మండిపడ్డారు. ఈ హఠాత్పరిణామంతో వాదనలు ఆపేసి అసంతృప్తితో వాకౌట్ చేసి వెళ్లిపోయారు శంకర్‌నారాయణన్ ! సాయంత్రం కోర్టు ముగిశాక- సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ సంఘం (ఎస్‌సీఏఓఆర్ఏ) సమావేశమై జడ్జి తీరును ఖండించింది. గురువారం కోర్టు సమావేశం కాగానే- జస్టిస్ మిశ్రా ఉన్న కోర్టు నెంబరు 3కు సీనియర్ లాయర్లంతా వెళ్లారు. 'లాయర్లు, జడ్జీలు పరస్పర గౌరవంతో మెలగాలి. మీ మనసులో ఉన్నదంతా ఒక్కసారిగా బయటకు బద్దలైంది. కాస్త ఓర్పు వహించండి. మీ వ్యాఖ్యలు మర్యాదపూర్వకంగా ఉండాలి." అని కపిల్ సిబల్ జస్టిస్ తదితర సీనియర్లు జస్టిస్ మిశ్రాకు సూచించారు. అప్పుడు జస్టిస్ మిశ్రా కలగజేసుకుని- గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు ఓపిగ్గా చాలాసేపు విన్నామని, కొన్ని అంశాల జోలికి పోవద్దని చెప్పాం.. కానీ ఆయన వినలేదన్నారు. అయినా తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదని, మనం స్నేహితులం అని ఆయన వివరణ ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది.

> నా మాటలతో ఎవరైనా గాయపడితే అందుకు క్షమాపణ చెబుతున్నా. మనుషులకే కాదు, పశుపక్ష్యాదులు, చెట్లు, ఏ జీవికైనా సరే... నా మాటల వల్ల హాని కలిగినట్లు భావిస్తే అందుకు క్షమాపణ కోరడానికి నేను సిద్ధం. గోపాల్ శంకర్‌నారాయణన్ వయసు మన వయసులో సగం. చాలా చిన్నవాడు. ఎంత చిన్నవాడైనా వందసార్లు క్షమాపణ చెబుతున్నా.. చేతులు జోడించి, వినమ్రంగా క్షమాపణలు చెబుతున్నా. నాకు వ్యతిరేకంగా కోర్టు బయట, మీడియాలో చాలా వ్యాఖ్యానాలు వస్తున్నాయి. నేను చాలా ఒత్తిడిలో ఉన్నాను. ఒత్తిడిని తట్టుకోలేక ఆకస్మికంగా కొన్ని వ్యాఖ్యలు వస్తాయి. ఇదీ అలాంటిదే తప్ప నాకు ఎవరి మీదా కోపం లేదు.
>
> - జస్టిస్ అరుణ్ మిశ్రా

# అల్లుళ్లు, కోడళ్లది కూడా బాధ్యతే

## వృద్ధుల సంరక్షణ చూడాల్సిందే.. నిర్లక్ష్యం చేస్తే నేరం.. కనిష్ఠంగా 5వేల ఫైన్ లేదా 3నెలల జైలు

- సీనియర్ సిటిజన్స్ సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ, డిసెంబరు 5: ఇక నుంచి ఇంట్లో వృద్ధుల సంరక్షణ బాధ్యత వారి కొడుకు, కూతుళ్లదే కాదు.. అల్లుళ్లు, కోడళ్లది కూడా! వయసు మళ్లినవారిని నిర్లక్ష్యం చేసినా, పోషణ, సంరక్షణ బాధ్యతను అల్లుళ్లు, కోడళ్లు పట్టించుకోకపోయినా నేరంగా పరిగణిస్తారు. ఈ మేరకు 'పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ సవరణ బిల్లు-2019'కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. బిల్లులో మరికొన్ని కీలక సవరణలు కూడా ప్రతిపాదించారు. వృద్ధులకు మెయింటెనెన్స్ కింద ఇచ్చే రూ.10వేల గరిష్ఠ పరిమితిని తొలగించారు. సంబంధీకులు ఎంత సంపాదిస్తే.. ఆ మేరకు వృద్ధులకు పోషణ కింద ఇవ్వాల్సి ఉంటుంది. మెయింటెనెన్స్ పరిధిని పెంచారు. వృద్ధుల సంరక్షణ బాధ్యతతో పాటు వారి ఆహారం, బట్టలు, గృహ వసతి, ఆరోగ్య విషయాలతో మెయింటెనెన్స్ అనేమాటను నిర్వచించారు. దీన్ని ఉల్లంఘిస్తే.. కనిష్ఠంగా రూ.5వేల జరిమానా లేదా మూడునెలల జైలు శిక్షను విధిస్తారు. పోషించడం లేదని, మెయింటెనెన్స్ ఇవ్వడం లేదని 80ఏళ్లు పైబడిన వృద్ధులు చేసే ఫిర్యాదుల విషయంలో ప్రత్యేక చర్యలను బిల్లులో ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇంట్లో, అనాథాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులు కచ్చితంగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బిల్లులో పొందుపరిచారు. వృద్ధులు తమ ఫిర్యాదుల కోసం పోలీస్ స్టేషన్లలో, జిల్లాలోని ప్రత్యేక పోలీస్ యూనిట్లలో, నోడల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయొచ్చు. ఈ మేరకు రాష్ట్రావారీగా హెల్ప్‌లైన్ నంబర్లు కూడా ఉంటాయి. తమ బాధ్యతను అల్లుళ్లు, కోడళ్లు గనక పట్టించుకోకపోతే న్యాయం కోసం వృద్ధులు మెయింటెనెన్స్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు.

# తలగడ లేకుండా నేలపై నిద్రించా

- ఒక్కోసారి చెక్కబల్లపై పడుకున్నా!
- విపరీతంగా చలి.. స్వెట్టర్లు ధరించా
- జైలు జీవితం వల్ల శారీరక దృఢత్వం: చిదంబరం



న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 106 రోజుల నిర్బంధ జీవితంలో చాలా రోజులు తలగడ లేకుండా నేలపై పడుకున్నానని , ఒక్కోసారి చెక్కబల్లపైనే నిద్రించాల్సి వచ్చిందని మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ దిగ్గజం పి చిదంబరం చెప్పారు. " తిహార్ జైల్లో నన్ను ఉంచిన సెల్ తలుపులు తీసే ఉంచేవారు. చలి గాలి విపరీతంగా కొట్టేది. స్వెట్టర్లు, ఓవర్ కోట్లు ధరించి నన్ను వేడిమి పొందాను" అని ఆయన గురువారంనాడు మీడియా సమావేశంలో వెల్లడించారు. "అయితేనేం, జైలు జీవితం వల్ల శారీరకంగా దృఢంగా తయారయ్యాను. నా మెడ, వెన్నెముక, తల గట్టిపడ్డాయి. ముఖ్యంగా నా నడ్డి సాపయ్యింది" అని ఆయన వివరించారు. ఆగస్టు 21న అరెస్ట్ చేసిన నాటి నుంచి నేటికి 8 కిలోల బరువు తగ్గినట్లు ఆయన పార్టీవాదులకు చెప్పారు. జైలు జీవితం వల్ల తన నైతిక స్థైర్యం ఇనుమడించిందన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ ఎటువైపు సాగుతోందో తెలియని అగమ్యగోచర స్థితిలో ఉన్నదని చిదంబరం విమర్శించారు. 'ఆర్థిక స్థితిపై ప్రధాని మాట్లాడరు. తన మంత్రుల చేత అబద్ధాలు, కల్పితాలు చెప్పిస్తారు' అని దుయ్యబట్టారు. " 8, 7, 6.6, 5.8, 5, 4.5 ... ఇదీ మన ఆర్థిక దుస్థితి. ఈ అంకెలు గత ఆరు త్రైమాసికాల్లో మన దేశ ఆర్థిక వృద్ధిని సూచిస్తున్నాయి. ఈ ఏడాది అంతానికి ఆర్థికాభివృద్ధి రేటు 5 శాతం చేరుకుంటే అదృష్టమే" అని ఆయన వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దు, లోపభూయిష్ఠమైన జీఎస్టీ వంటి తప్పుడు నిర్ణయాలను ప్రభుత్వం ఇంకా మొండిగా, మూర్ఖంగా సమర్థించుకుంటోందని విమర్శించారు. పన్ను ఉగ్రవాదం, మితిమీరిన నియంత్రణలు, స్వీయరక్షణ తత్వం పెరిగాయనీ, విధాన నిర్ణయాలన్నీ ప్రధాని కార్యాలయంలోనే కేంద్రీకృతం కావడం వల్ల పరిస్థితి దిగజారిందని దుయ్యబట్టారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 7 నెలలు దాటినప్పటికీ ఇలాంటి సమస్యలు వస్తూ పోతూ ఉంటాయని బీజేపీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఆయన అన్నారు. ఇంకా నయం, రుతుపవనాల వల్ల సమస్యలు వచ్చాయనలేదని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మీడియా కూడా భయపడుతోందని వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వ బడులకు ఏబీవీపీ రంగులు

ముంబై, డిసెంబరు 5: ప్రభుత్వ పాఠశాలలకు కళాకాంతులు తేవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సంకల్పించింది. దేశవ్యాప్తంగా పది వేల బడులకు రంగులు వేసి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఏబీవీపీ ఇప్పటికే స్థానికుల సహకారంతో బెంగళూరులో, చుట్టుపక్కల వందలాది స్కూళ్ల రూపురేఖలు మార్చింది.

## బీజేపీ కేసులు నా మెడలో పతకాలు!

- వాటికి భయపడేది లేదు: రాహుల్

కోజికోడ్, డిసెంబరు 5: తనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బీజేపీ పెట్టిస్తున్న కేసులకు బెదిరేది లేదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆ కేసులను తన మెడలో పతకాలుగా భావిస్తానని చెప్పారు. "సైనికుడి ఛాతికి పతకాలు ఉన్నట్లుగా నాపైన దేశవ్యాప్తంగా 15-16 కేసులున్నాయి. ఎన్ని కేసులు వేస్తే అంత సంతోషిస్తా" అని కేరళ పర్యటనలో ఉన్న రాహుల్ అన్నారు. ప్రజల దృష్టిని వాస్తవం నుంచి మళ్లించడమే మోదీ పాలనా శైలి అని వ్యాఖ్యానించారు.

## 9న లోక్‌సభ ముందుకు పౌరసత్వ బిల్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం మంజూరుకు ఉద్దేశించిన పౌరసత్వ (సవరణ) బిల్లును ఈ నెల 9న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. మరుసటి రోజు ఓటింగ్ పెట్టనున్నారు. అనంతరం రాజ్యసభకు పంపనున్నారు. ఎన్డీఏ ప్రభుత్వ సంఖ్యా బలం రీత్యా లోక్‌సభలో బిల్లు తేలిగ్గానే నెగ్గే వీలుంది. కాగా, వివక్షాపూరితంగా ఉన్న ఈ బిల్లును తాము వ్యతిరేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. దేశ, రాజ్యాంగ లౌకిక స్ఫూర్తిని ఈ బిల్లు దెబ్బతీస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గం ఓ ప్రకటనలో విమర్శించింది.



ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి, సుధామూర్తిల ఏకైక కొడుకు రోహన్ మూర్తి(36) తన చిరకాల స్నేహితురాలైన అపర్ణ కృష్ణన్‌ను వివాహం చేసుకున్నారు. హిందూ సంప్రదాయం మేరకు బెంగళూరులో వారి వివాహం కొద్ది మంది బంధువులు, కుటుంబసభ్యుల మధ్య నిరాడంబరంగా జరిగింది.

# మన క్షిపణుల్లో ఆకాశ్ బెస్ట్

## లోపాలు ఉన్నాయనడం అబద్ధం.. 7 స్క్వాడ్రన్లకు ఆర్డరు ఇచ్చారు: డీఆర్‌డీవో

న్యూఢిల్లీ, డిసెంబరు 5: ఆకాశ్ క్షిపణి వ్యవస్థల్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని వస్తున్న వార్తల్లో నిజం లేదని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కి చెందిన ఉన్నత వర్గాలు స్పష్టం చేశాయి. ఆకాశ్ సామర్థ్యంపై భారత వైమానిక దళం సంతృప్తి చెందడం వల్లే మరో ఏడు స్క్వాడ్రన్లకు సరిపడా క్షిపణులకు ఆర్డర్ ఇచ్చిందని తెలిపాయి. వీటి విలువ రూ.5,500 కోట్లు ఉంటుందని, వీటిని త్వరలోనే పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో మోహరిస్తారని పేర్కొన్నాయి. శత్రు విమానాలను కూల్చడానికి ఆకాశ్ క్షిపణి వ్యవస్థను డీఆర్‌డీవో రూపొందించింది. వీటిని భారత్ డైనమిక్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థలు ఉత్పత్తి చేస్తుండగా వాయుసేన కొనుగోలు చేస్తోంది. వీటిలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయంటూ కథనాలు వెలువడ్డాయి. దీంతో 'ఆకాశ్ శక్తి సామర్థ్యాలపై కొందరు సందేహాలు వ్యక్తం చేశారు. అయితే ఎటువంటి అనుమానాలు అక్కర్లేదని డీఆర్‌డీవో వర్గాలు స్పష్టం చేస్తోంది. "మన వద్ద ఉన్న క్షిపణుల్లో ఆకాశ్ అత్యుత్తమమైనది. తక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించడంలో దానికిదే సాటి" అని డీఆర్‌డీవో ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఆకాశ్‌లో సాంకేతిక సమస్యలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.

## పశ్చిమ బెంగాల్‌లో మరో 'దిశ'

- యువతిపై అత్యాచారం.. కాల్చివేత
- యూపీలో బాలికపై ఇద్దరి గ్యాంగ్ రేప్

మాల్దా/న్యూఢిల్లీ, డిసెంబరు 5: దిశ హత్యాచారం లాంటి ఘటనే పశ్చిమబెంగాల్‌లో జరిగింది. గురువారం మాల్దాలోని ఓ మామిడి తోటలో పూర్తిగా కాలిపోయిన యువతి మృతదేహం లభించింది. ఆమెపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం జరిపి, చంపి, కాల్చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి శరీరంపై కాలిన గాయాలతో పాటు ఇతర గాయాలున్నట్లు పోలీసులు తెలిపారు. యూపీలోని సీతాపూర్ జిల్లాలో 15ఏళ్ల బాలికపై ఇద్దరు మంగళవారం రాత్రి అత్యాచారం జరిపారు. నిందితులు బాలిక కాళ్లు చేతులు కట్టేసి అత్యాచారం జరిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లూలో పదేళ్ల బాలికపై బుధవారం 14 సంవత్సరాల బాలుడు అత్యాచారం జరిపాడు. పోలీసులు బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు ప్రవేశపెట్టారు.

## 'నిర్భయ నిందితుడికి క్షమాభిక్ష వద్దు'

న్యూఢిల్లీ, డిసెంబరు 5: నిర్భయ కేసు నిందితుల్లో ఒకడైన వినయ్ శర్మ క్షమాభిక్ష అభ్యర్థనను తిరస్కరించాలని ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మాలీవాల్ గురువారం రాష్ట్రపతిని కోరారు. అత్యాచార కేసుల్లో నిందితులకు 6 నెలల్లో ఉరిశిక్ష విధించేలా చట్టం తీసుకురావాలంటూ ఆమె ఢిల్లీలోని సమతా స్థల్‌లో చేస్తున్న నిరాహార దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హత్యాచారాలపై స్పందించడానికి, వినడానికి కూడా కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. అంతకుముందు హత్యాచారాలపై విజయ్ చౌక్ వద్ద 'దిశ' ఘటనపై నిరసన తెలుపుతున్న 27 మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకొని తర్వాత వదిలేశారు.

# 'ఆమె'పై మరో దాడి!

(మొదటి పేజీ తరువాయి)

బాధితురాలి కథనం ప్రకారం... ఉన్నావ్‌కు చెందిన ఆ యువతిపై శివం త్రివేదీ పెళ్లి పేరుతో మాయ చేశాడు. ఆ తర్వాత గత ఏడాది డిసెంబరులో తన స్నేహితుడైన శుభం త్రివేదీతో కలిసి ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ కేసులో పోలీసులు వారిద్దరినీ అరెస్టు చేశారు. గతనెల 25న వీరిద్దరూ బెయిలు మీద బయటికి వచ్చారు. అప్పటి నుంచే బాధితురాలిపై గురి పెట్టారు. పోలీసులు ఈ కేసులో పూర్తిస్థాయిలో సాంకేతిక, ఇతర ఆధారాలను సేకరించారు. గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఆ యువతి తన న్యాయవాదిని కలిసేందుకు ఉన్నావ్‌లోని తన ఇంటి నుంచి రాయబరేలీకి బయలుదేరింది. ఇంటి నుంచి కాస్త దూరంగా రాగానే... ఒక మలుపు వద్ద శివం, శుభంతోపాటు హరిశంకర్ త్రివేదీ, రామ్‌శంకర్ త్రివేది, ఉమేశ్ బాజ్‌పాయ్ అనే వ్యక్తులు ఆమెను అడ్డుకున్నారు. ఆమెపై మండే స్వభావమున్న ఇంధనం పోసి... నిప్పంటించారు. తెల్లవారుజామున కావడంతో రోడ్లపై ఎవ్వరూ లేరు. బాధితురాలు ప్రాణాలు కాపాడుకునేందుకు దాదాపు కిలోమీటరు పాటు పరుగులు తీసింది. 'సాయం చేయండి' అంటూ కేకలు వేసింది. అలాంటి పరిస్థితుల్లోనూ తన సెల్ నుంచి '112'కు ఫోన్ చేసింది. ఈలోపు స్థానికులు కూడా పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలిని తొలుత ఉన్నావ్ ఆస్పత్రికి, ఆ తర్వాత లఖ్‌నవ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెకు 90 శాతం కాలిన గాయాలయ్యాయని, పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉందని వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను లఖ్‌నవ్ నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. తనను అడ్డుకుని దాడి చేసిన వారి పేర్లన్నీ బాధితురాలు బయటపెట్టింది. ఆ ఐదుగురు దుండగులను అరెస్టు చేశారు. యూపీలో శాంతి భద్రతల పరిస్థితి ఘోరంగా ఉందంటూ కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదిపార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై ధ్వజమెత్తారు. 'యూపీలో ఆటవిక రాజ్యం' నడుస్తోందన్నారు. ఇదే అంశంపై రాజ్యసభలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. సభలో గందరగోళం నేపథ్యంలో అరగంట పాటు వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ కూడా స్పందించింది. పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని యూపీ డీజీపీని ఆదేశించింది. "అత్యాచారం జరిగినప్పటి నుంచి సజీవ దహన యత్నం దాకా ఏం జరిగిందో మొత్తం చెప్పండి. బాధితురాలికి రక్షణ కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారు? దానికి బాధ్యులైన అధికారులెవరు?" అని కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ ప్రశ్నించారు. ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మాలివాల్ కూడా ఈ అంశంపై సీఎం యోగికి లేఖ రాశారు. దాడికి పాల్పడిన వారికి 30 రోజుల్లోపు శిక్ష పడేలా చూడాలని కోరారు.

### ఇంటర్నెట్‌లో అశ్లీలత కట్టడిపై..

# రాజ్యసభ కమిటీ నియామకం

- 12 మంది సభ్యులతో వెంకయ్య ప్రకటన
- పార్లమెంటరీ కమిటీ ముందు ఫేస్‌బుక్

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్‌లో అడ్డూఅదుపూ లేని అశ్లీలత, నీలి చిత్రాల ప్రసారాలను రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు తీవ్రంగా పరిగణించారు. వీటి వల్ల పిల్లలు, యువత పెడదోవపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన 12 మంది రాజ్యసభ సభ్యులతో ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ పూర్తిగా అనధికారికమని నెల రోజుల్లో సిఫారసులతో కూడిన ఓ నివేదికను ఇవ్వనుందని పేర్కొన్నారు. ఈ కమిటీలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, శివ (డీఎంకే), టి.సుబ్బిరామిరెడ్డి, జైరాంరమేశ్, కే కేశవరావు, టీజీ వెంకటేశ్. విజయసాయిరెడ్డి, రామ్‌గోపాల్ యాదవ్, భూపేంద్ర యాదవ్, సత్యనారాయణ ఝటియా, సీపీ ఠాకూర్, ప్రభాత్ ఝా తదితరులున్నారు. వెంకయ్య అధ్యక్షతన కమిటీ తొలి సమావేశాన్ని పార్లమెంట్ ప్రత్యేక సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో చైల్డ్ పోర్నోగ్రఫీ, రేప్, గ్యాంగ్‌రేప్ ఫొటోలు/వీడియోలు, ఉగ్రవాదానికి సంబంధించిన అంశాలను తొలగించడానికి మార్గదర్శకాలను రూపొందిస్తున్నామని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభకు తెలిపారు. దేశంలోని పౌరుల వ్యక్తిగత డేటాకు భద్రత కల్పించేలా బిల్లును రూపొందించామని వెల్లడించారు. ఆ బిల్లు త్వరలో సభ ముందుకు వస్తుందని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలపై వేధింపులు.. తదితర అంశాలపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ ముందు దిగ్గజ సంస్థలు గురువారం హాజరయ్యాయి. ఫేస్‌బుక్, దాని అనుబంధ సంస్థలు ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ అధికారులు మహిళా భద్రతకు తాము తీసుకుంటున్న చర్యలను కమిటీకి వివరించారు.

# క్రైం సీరియళ్లు, వీడియోలు చూసే..

- అత్యాచారం తర్వాత చంపేశారు!
- దిశ సెల్‌ఫోన్‌ను భూమిలో పాతేశారు
- పోలీసు విచారణలో నిందితుల వెల్లడి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, కుషాయిగూడ, షాద్‌నగర్ రూరల్, శంషాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రైం సీరియళ్లు.. నేరాలకు సంబంధించిన వీడియోలు.. యూట్యూబ్‌లో నేర సాహిత్యం.. దిశ హత్యకేసులో నిందితులు దారుణ కిరాతకానికి పాల్పడటానికి ప్రేరణలివే..! తొలుత దిశ అరిచేందుకు ప్రయత్నించగా.. ఆమె నోట్లో మద్యం పోయడం.. స్పృహ కోల్పోయాక అత్యాచారం.. కదులుతున్న లారీలోనూ అఘాయిత్యం.. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు మృతదేహాన్ని కాల్చివేయడం.. ఇలా దిశ హత్యాచారంలో ప్రతి కోణం వెనక 'క్రైం వీడియోలు' ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఏడు రోజుల కస్టడీలో భాగంగా పోలీసులు గురువారం జరిపిన విచారణలో ప్రధాన నిందితుడు మహ్మద్ ఆరిఫ్ పలు విషయాలను వెల్లడించినట్లు తెలిసింది. ఆమెను బంధించి తీసుకెళ్తుండగా.. అరవడం వల్లే నోట్లో మద్యం పోసినట్లు నిందితులు అంగీకరించారు. ఎవరూ గుర్తించకూడదనే ఉద్దేశంతోనే దిశను కాల్చినట్లు.. తాము అరెస్టవుతామని ఊహించలేదని తెలిపినట్లు సమాచారం. కోర్టు అనుమతితో పోలీసులు ఆరిఫ్‌తోపాటు.. మిగతా ముగ్గురు నిందితులు నవీన్, శివ, చెన్నకేశవులను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసు విచారణకు సిట్ ఆధ్వర్యంలో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసు కస్టడీలో భాగంగా.. ఓ బృందం బుధవారం అర్ధరాత్రే నిందితులను చర్లపల్లి జైలు నుంచి తీసుకెళ్లింది. దిశ వాహనానికి పంచర్ వేయిస్తామంటూ ఆమెను నమ్మించింది మొదలు.. హత్యాచారం తర్వాత పెట్రోల్ పోసి నిప్పంటించే దాకా మొత్తం నేరాన్ని తిరిగి రికార్డు(సీన్ రీ-కన్‌స్ట్రక్షన్) చేశారు. ఆ తర్వాత నిందితులు ఎక్కడికి వెళ్లారు? ఎవరెవరితో మాట్లాడారు? ఎవరెవరిని కలిశారు? తదితర అంశాలపై సమాధానాలు రాబట్టారు. తెల్లవారుజామున 5 గంటలకు వారిని తిరిగి చర్లపల్లి జైలుకు తీసుకువచ్చారు. భద్రత దృష్ట్యా జైల్లోనే విచారిస్తున్నారు.

### సెల్‌ఫోన్‌ను పాతిపెట్టారు

దిశ తగులబెట్టాక.. అక్కడికి అర కిలోమీటరు దూరంలో ఆమె సెల్‌ఫోన్‌ను భూమిలో పాతిపెట్టినట్లు నిందితులు పోలీసు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. మరిన్ని ఆధారాల కోసం ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం.. మరోసారి తనిఖీలు చేపట్టి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది.

### ఎఫ్ఎస్ఎల్ నివేదిక

ఈ కేసులో ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ(ఎఫ్ఎస్ఎల్) ప్రాథమిక నివేదిక సిట్ చేతికి అందింది. దిశ నిందితులకు కఠిన శిక్ష పడేలా చేయడంలో ఈ నివేదికే కీలకం. అత్యాచారం తర్వాత దిశను హతమార్చి.. మృతదేహాన్ని దహనం చేయడంతో బలమైన ఆధారాలను సేకరించడం పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. మృతదేహం, లారీ కేబిన్ నుంచి సేకరించిన సుమారు 30 నమూనాలను డీఎన్ఏ పరీక్షల కోసం ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. నిందితులకు వీలైనంత త్వరలో శిక్ష పడాలనే ఉద్దేశంతో.. చార్జిషీట్‌ను సిద్ధం చేయాలని భావిస్తున్న పోలీసులకు ఇప్పుడు ఎఫ్ఎస్ఎల్ నివేదికే ప్రధాన బలం. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు లేరు. చటాన్‌పల్లి వద్ద మృతదేహం కాలుతుండగా సత్యం అనే పాడిరైతు చూసి, పోలీసులకు సమాచారం అందించారు. అతను కూడా మృతదేహాన్ని ఎవరు కాల్చారో చూడలేదు. ద్విచక్రవాహనానికి పంచర్ వేయించడానికి తీసుకెళ్లినప్పుడు, పెట్రోల్ కొనుగోలు సమయంలో నిందితులను చూసినవారు కేవలం సాక్షులే కానీ.. ప్రత్యక్ష సాక్షులు కాదు. ఈ నేపథ్యంలో నేరాన్ని నిరూపించడం.. చార్జిషీట్ దాఖలు చేయడంలో ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఒక్కటే ప్రధాన ఆధారం.

## తలుపులు బిగించి.. గుడిసెకు నిప్పంటించి..

- ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్య

హైదరాబాద్ సిటీ/వనస్థలిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'రాములో.. రాములా.. నన్ను ఆగం చేసిందిరో.. రాములో.. రాములా.. నా ప్రాణం తీసిందిరో'.. త్వరలో విడుదలకానున్న ఓ సినిమాలోని ఈ పాటతో భార్యతో కలిసి ఆనందంగా అతడు టిక్‌టాక్ వీడియో చేశాడు! ఈ పాటను అతడి విషయంలో భార్య నిజం చేసింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త ప్రాణం తీసింది. నవంబరు 26న హైదరాబాద్ వనస్థలిపురం పరిధిలో గుడిసెకు నిప్పంటుకొని రమేశ్ అనే వ్యక్తి సజీవదహనమైన కేసును పోలీసులు ఛేదించారు. షార్ట్ సర్క్యూట్‌తోనే గుడిసెకు నిప్పంటుకొందని తొలుత భావించినా.. చివరకు అతడిని భార్యే హత్యచేసిందని తేల్చారు. సూర్యాపేట జిల్లా, తొండ తిరుమలగిరి మండలం కుమ్మరి గడ్డకు చెందిన చిర్రబోయిన రమేశ్ (29), స్వప్న దంపతులు బతుకుదెరువు కోసం వనస్థలిపురం వచ్చి శ్రీకృష్ణదేవరాయనగర్ కాలనీలో గుడిసె వేసుకొని ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. రమేశ్ మిత్రుడు, వారితోపాటు కూలి పనికి వెళ్లే వెంకటయ్యతో స్వప్నకు వివాహేతర సంబంధం ఏర్పడింది. తమ బంధానికి రమేశ్ అడ్డుగా ఉన్నాడని స్వప్న, వెంకటయ్య.. అతడిని చంపాలనుకున్నారు. పథకం ప్రకారం స్వప్న.. తొమ్మిది రోజుల క్రితం పత్తి వేరేందుకు ఇంటికెళ్తున్నానంటూ భర్తతో చెప్పి పిల్లలతో సొంతూరుకు వెళ్లింది. మరుసటి రోజు రాత్రి వెంకటయ్యను గుడిసె వద్దకు పంపింది. లోపల తాగిన మత్తులో గాఢనిద్రలో ఉన్న రమేశ్‌ను చూసి.. బయట నుంచి తలుపులు బిగించి గుడిసెపై వెంకటయ్య పెట్రోలు చల్లి నిప్పంటించాడు. మంటలకు తాళలేకత నరేశ్ అరుస్తూ తలుపులు కొట్టినా వెంకటయ్య తీయలేదు. దీంతో అతడు లోపలే సజీవదహనమయ్యాడు. రమేశ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేశారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా తామే హత్యచేసినట్లు అంగీకరించారు.



## సింగపూర్ చేరిన 'శౌర్య'

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత కోస్టుగార్డుకు చెందిన నౌక 'శౌర్య' విదేశీ పర్యటనలో భాగంగా గురువారం సింగపూర్‌కు చేరుకుంది. అంతకుముందు ఆస్ట్రేలియాలో పర్యటించిన ఈ నౌక నవంబరు 29న అక్కడి నుంచి బయల్దేరి సింగపూర్ వెళ్లింది. తీర ప్రాంత రక్షణ, సెర్చ్ అండ్ రెస్క్యూ, సముద్రపు దొంగల బెడద, సముద్ర కాలుష్యం వంటి అంశాలపై సింగపూర్ పోలీస్, కోస్టు గార్డుతో కలిసి పనిచేయడానికి చర్చలు జరుపనుంది.





ఇసుక కష్టాలు అన్నీఇన్నీ కావు. నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైపోయింది. కానీ ఇసుక ఒడ్డుకు చేర్చే కార్మికులు కూడా ఏటికి ఎదురీదాల్సిందే. గోదావరిలో వేసిన మేటల వద్దకు వెళ్లి అక్కడి ఇసుకను తమ బోటులోకి ఎగుమతి చేసుకోవాలి. ఒక్కోసారి నీటి అడుగున ఉన్న ఇసుకను కూడా గిన్నెలతో పైకి తీసి బోటులోకి పోయాలి. రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి సమీపంలో ఇసుక తరలిస్తున్న బోట్లు, ఒడ్డున ఇసుక దిగుమతి చేస్తున్న దృశ్యాలివి..

## రాజధానిని తరలించేందుకే వరద

▸ అది రాజకీయ ప్రేరేపిత విపత్తు: లోక్‌సభలో గల్లా

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): "రాజకీయ దురుద్దేశాలతో సృష్టించిన విపత్తును చూపించి రాష్ట్ర ప్రభుత్వం నూతన రాజధానిని తరలించే ప్రయత్నం చేసింది. సహజంగా వచ్చే ప్రకృతి విపత్తులను నివారించవచ్చు. కానీ దురుద్దేశంతో సృష్టించిన విపత్తులను ఆపలేం" అని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. 'వివిధ కారణాలతో పంట నష్టం - రైతులపై ప్రభావం' అనే అంశంపై లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన రాజధాని అమరావతిని, మాజీ సీఎం చంద్రబాబు ఇంటిని ముంచడానికి రాష్ట్రప్రభుత్వం వరదలను సృష్టించిందన్నారు. గల్లా జయదేవ్ మాట్లాడుతున్నప్పుడు వైసీపీ ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు.

## బ్రాహ్మణులపై జగన్ ప్రభుత్వం వివక్ష

▸ బ్రాహ్మణ చైతన్య వేదిక కోకన్వీనర్ శ్రీధర్

గుంటూరు, డిసెంబరు 5: బ్రాహ్మణ జాతిపట్ల సీఎం జగన్ కుల వివక్ష చూపుతున్నారని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కోకన్వీనర్ సిరిపురపు శ్రీధర్ ఆరోపించారు. అందులో భాగంగానే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించి, తక్షణం ఆయా సంక్షేమ పథకాలను అమలు చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టి సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని శ్రీధర్ హెచ్చరించారు.

## 'అదృశ్య' కేసులపై కొత్త విధానం!

▸ హైకోర్టుకు వివరించిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వ్యక్తుల అదృశ్యానికి సంబంధించిన కేసుల దర్యాప్తునకు కొత్త విధివిధానాలను రూపొందిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం గురువారం హైకోర్టుకు వివరించారు. ఇలాంటి కేసులకు సంబంధించి కొత్త విధివిధానాలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. అయితే, దీనికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. ఆయా వివరాలను నమోదు చేసుకున్న హైకోర్టు చీఫ్‌జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణల ధర్మాసనం విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## క్లబ్‌లు, ఈవెంట్లలో మద్యం ధరల పెంపు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విలాసవంతమైన క్లబ్‌లు, పర్యాటక ప్రదేశాలు, ఈవెంట్‌లలో విక్రయించే మద్యం ధరలను పెంచుతూ ఎక్సైజ్ శాఖ నిర్ణయం తీసుకుంది. 60/90 మిల్లీలీటర్ల ఐఎంఎఫ్ఎల్ బాటిల్ మీద రూ.30, 180 ఎంఎల్‌కు రూ.60, 375ఎంఎల్ బాటిల్‌పై రూ.120, 750 ఎంఎల్‌కు రూ.240, లీటర్ బాటిల్ మీద రూ.300, 2 లీటర్ల బాటిల్ మీద రూ.750 పెంచుతూ ఆదేశాలిచ్చారు. విదేశీ మద్యం రేట్లు కూడా పెంచారు. 330, 500 ఎంఎల్ బీర్ బాటిల్‌పై రూ.30, 650 ఎంఎల్ బాటిల్‌పై రూ.60, 30 వేల ఎంఎల్‌పై రూ.3 వేలు, 50 వేల ఎంఎల్‌పై రూ.6 వేలు పెంచారు. అన్ని రకాల రెడీ టు డ్రింక్ బాటిల్స్‌పై రూ.60 పెంచారు. పెరిగిన రేట్లు శుక్రవారం నుంచే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వీబీసీ ఫెర్టిలైజర్స్ భూముల రద్దు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వీబీసీ ఫెర్టిలైజర్స్ సంస్థకు కృష్ణాజిల్లా జయంతిపురంలో భూ కేటాయింపులను రద్దుచేస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. 2015, జూన్‌లో వీబీసీ ఫెర్టిలైజర్స్, కెమికల్స్ సంస్థకు జగయ్యపేట మండలం జయంతిపురంలో 498.93 ఎకరాల భూమిని యూరియా ప్లాంటు ఏర్పాటు కోసం కేటాయించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా, అతితక్కువ ధరకే భూములు కేటాయించారని, అందుకే వాటిని రద్దు చేస్తున్నట్లు అక్టోబరు 30న నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. ఇప్పుడు మొత్తం భూ కేటాయింపులనే రద్దుచేశారు.

## వరి వ్యర్థాలతో ప్యాకింగ్ ఉత్పత్తులు

▸ కన్నబాబుతో నెదర్లాండ్స్ సంస్థ చర్చలు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరి, ఇతర పంట వ్యర్థాల నుంచి ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ ఉత్పత్తులను తయారు చేస్తామంటూ నెదర్లాండ్స్‌కు చెందిన సంస్థ ముందుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో అందుకు సంబంధించిన ప్యాకింగ్ ఉత్పత్తుల తయారీ యూనిట్లు నెలకొల్పేందుకు ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ మేరకు సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు, ఉన్నతాధికారులతో నెదర్లాండ్స్ సంస్థ ప్రతినిధి బృందం గురువారం చర్చలు జరిపింది.

## రైతులను రాజకీయంగా వాడుకుంటారా!

▸ మీడియాతో రాజధానికి చెందిన రైతుల ఫైర్

తుళ్లూరు, డిసెంబరు 5: "రాజధాని కోసం భూములిస్తే రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నారు. రాజధాని అమరావతిలో రౌండ్ టేబుల్ సమావేశాలని చెప్పి పోటీగా పెట్టటం కాదు. రాజధాని అభివృద్ధిపై సమావేశాలు నిర్వహించాలి" అని టీడీపీకి చెందిన రైతులు డిమాండ్ చేశారు. తుళ్లూరులో గురువారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. రాజధానిలో అవినీతి జరిగిందని అంటున్నారనీ, అయితే ఆరు నెలలుగా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

## ఏపీ హైకోర్టులో 22 జడ్జి పోస్టులు ఖాళీ: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో 22 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. గురువారం రాజ్యసభలో వైసీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కాగా, దేశంలో 2018నాటికి 96.4% ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించామని కేంద్రమంత్రి రమేష్ పోఖ్రియాల్..రాజ్యసభలో కేవీపీ రామచంద్రరావు ప్రశ్నకు బదులిచ్చారు. అమరావతి నుంచి హంసల దీవి వరకు కృష్ణా నది కాలుష్యం అయినట్టు గుర్తించామని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి రత్తన్‌లాల్ కటారియా చెప్పారు. వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ సమాధానం ఇచ్చారు.

## 'ఏపీ లీగల్ సెల్' చైర్మన్‌గా జస్టిస్ రాకేశ్‌కుమార్

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాకేశ్‌కుమార్‌ను నియమిస్తూ సీఎస్ నీలం సాహ్ని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి రానున్నట్లు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

## పోలవరం-బానకచర్ల ప్రాజెక్టు ఖర్చు

# 80 వేల కోట్లపైనే!

▸ ఆరు ప్రతిపాదనలతో వాప్కోస్ నివేదిక

▸ 10న సమీక్షించనున్న ముఖ్యమంత్రి

▸ ఇంత భారం మోసే పరిస్థితి లేదు

▸ బ్యాంకుల నుంచి అప్పు తేవాల్సిందే

▸ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు యోచన



అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం కుడి కాలువ నుంచి శ్రీశైలం జలాశయం ద్వారా బానకచర్లకు గోదావరి జలాలను ఎత్తిపోసే భారీ కార్యాచరణపై 10వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమీక్ష చేయనున్నారు. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదికను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వాప్కోస్ రాష్ట్రప్రభుత్వానికి సమర్పించింది. నిజానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఇవ్వాలని కోరగా.. దాని బదులు మొత్తం ఆరు ప్రతిపాదనలతో ఈ రిపోర్టును అందజేసింది. దీనిపై ముఖ్యమంత్రి గురువారం సమీక్ష జరపాల్సి ఉండగా.. ఆయన ఆకస్మికంగా ఢిల్లీ వెళ్లడంతో సమీక్ష పదో తేదీకి వాయిదా పడింది. ఆరు ప్రతిపాదనల్లో జగన్ దేనికి మొగ్గు చూపుతారో ఖరారయ్యాక.. దాని అమలుకు టెండర్లను పిలిచేందుకు జలవనరుల శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అయితే ఈ ప్రాజెక్టు కోసం భారీగా రూ.80 వేల కోట్లకుపైగా ఖర్చవుతుందని వాప్కోస్ అంచనా వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంత భారీ మొత్తం వ్యయం చేసే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదు. నిధుల సమీకరణకు బ్యాంకులను ఆశ్రయించాల్సిందే. కానీ వివిధ కారణాల వల్ల అప్పు పుట్టే అవకాశమే కనిపించడం లేదు. ఒకవేళ పుట్టినా ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలు అడ్డు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జలవనరుల శాఖ యోచిస్తోంది. ఈ కార్పొరేషన్.. బ్యాంకులను సంప్రదించి.. పోలవరం నుంచి బానకచర్లకు గోదావరి జలాల తరలింపు వల్ల వ్యవసాయోత్పత్తులు ఎంత పెరుగుతాయో.. రైతులకు ఎంత ప్రయోజనం చేకూరుతుందో వివరిస్తూ భారీగా రుణం తీసుకోవలసి ఉంటుంది. స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ను స్థాపించి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నది జల వనరుల శాఖ ఆలోచన.

# హైకోర్టులో 'లోక్ అదాలత్' బెంచీలు

▸ తొమ్మిది నుంచి 12 వరకు నిర్వహణ



'ముందస్తు బెంచీ'లో కేసులు విచారిస్తున్న సీజే జస్టిస్ మహేశ్వరి

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14న నిర్వహించ తలపెట్టిన 'లోక్ అదాలత్' కోసం హైకోర్టులో ముందస్తు బెంచీలు ఏర్పాటు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలో పలువురు న్యాయమూర్తులు ఈ బెంచీలకు హాజరై వివిధ కేసులను పరిష్కరిస్తున్నారు. ఈ కేసుల పరిష్కారానికి ఈ నెల మూడో తేదీనే హైకోర్టులో ముందస్తు బెంచీలు ఏర్పాటు చేశారు. ఆయా రోజుల్లో సాయంత్రం 4.15 గంటలకు విధులు ముగియగానే పలువురు న్యాయమూర్తులు ఈ ముందస్తు బెంచీలకు హాజరై కేసుల సత్వర పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తున్నారు. ఈ ముందస్తు బెంచీలకు విశేషమైన స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో మళ్లీ ఈ నెల 9 నుంచి 12 వరకు లోక్ అదాలత్ ముందస్తు సన్నాహక బెంచీలు ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి ఎంవీ రమణకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 7981913338, 0863-2372604 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఇక, మరోవైపు సీజే జస్టిస్ జేకే మహేశ్వరిని రాష్ట్ర నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి కె.మస్తాన్‌వలి నేతృత్వంలో ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. న్యాయశాఖలోని ఖాళీలను భర్తీ చేయాలని అభ్యర్థించారు. ఈ విజ్ఞప్తికి సీజే సానుకూలంగా స్పందించారు.

## షా వద్ద రఘుకే ప్రాధాన్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణం రాజుకు బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వద్ద మరోసారి ప్రాధాన్యం లభించింది. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి, లోక్‌సభలో ఆ పార్టీ నాయకుడు మిథున్ రెడ్డి వేచి చూస్తుండగా... ఆ తర్వాత వచ్చిన రఘురామ రాజుకు తొలుత పిలుపు అందింది.

ఢిల్లీకి వస్తున్న సీఎం జగన్‌కు అప్పాయింట్‌మెంట్ ఇవ్వాల్సిందిగా కోరేందుకు విజయసాయి, మిథున్ హోంమంత్రి చాంబర్‌కు వచ్చారు. ఆ తర్వాత... ఈనెల 11వ తేదీన తాను ఏర్పాటు చేసిన విందుకు ఆహ్వానించేందుకు రఘు అక్కడికి వచ్చి.. సిబ్బంది ద్వారా తన కార్డును లోపలికి పంపించారు. ఆశ్చర్యంగా... అమిత్‌షా నుంచి ఆయనకే తొలుత పిలుపు అందింది. ఆ తర్వాత అమిత్‌షా వద్దకు విజయసాయి, మిథున్ రెడి వెళ్లారు. జగన్‌కు అప్పాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. రాత్రి 10 తర్వాత తన నివాసానికి రావాలని షా వారికి తెలిపారు. మరోవైపు... వైసీపీ ఎంపీ రఘు తాను ఇస్తున్న విందును కాంగ్రెస్ ఎంపీ కేవీపీ నివాసంలో ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. కేవీపీ తన వియ్యంకుడు కావడం, ఢిల్లీలో తనకు ఇంకా బంగళా కేటాయించకపోవడమే దీనికి కారణమని రఘు తెలిపారు.

## జీరో ఎఫ్ఐఆర్... సూపర్!

▸ ఏపీలో తప్పిపోయి, తెలంగాణలో దొరికిన బాలుడు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జీరో ఎఫ్ఐఆర్ నిర్ణయం సత్ఫలితాలిస్తోంది. మిస్సింగ్ కేసుల్లో ఫిర్యాదులను పెద్ద సీరియస్‌గా తీసుకోని పోలీసులు ఇప్పుడు పరిధితో నిమిత్తం లేకుండా వేగంగా స్పందిస్తున్నారు. దిశ ఘటన తర్వాత సరిహద్దు పేరుతో ఫిర్యాదులను తిరస్కరిస్తున్న వైనం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో డీజీపీ గౌతమ్ సవాంగ్ రాష్ట్రంలో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. తాజాగా కృష్ణా జిల్లా పోలీసులు పరిధి పక్కనపెట్టి స్పందించడంతో ఓ కుటుంబానికి కడుపుకోత తప్పింది. వీరులపాడు మండలం రంగాపురానికి చెందిన రవినాయక్ కుమారుడు కనిపించకుండా పోయాడు. కంగారుపడ్డ తండ్రి కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగాపురం గ్రామం వీరులపాడు స్టేషన్ పరిధిలో ఉన్నప్పటికీ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండు బృందాలను ఏర్పాటుచేసి గాలించగా పొరుగు రాష్ట్రం తెలంగాణలో బాలుడి ఆచూకీ లభ్యమైంది. సూర్యాపేట జిల్లా మిర్యాలగూడ మండలం వీరంపాడులో ఉన్న బాలుడిని తీసుకొచ్చిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. 48గంటల్లోనే జీరో ఎఫ్ఐఆర్ నిర్ణయంతో సత్ఫలితాలు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.







రాత్రి 7 గంటల నుంచి
స్టార్‌స్పోర్ట్స్‌లో

అనుభవలేమితో విండీస్

నేడు ఉప్పల్‌లో తొలి టీ20

# భారత్‌ను అడ్డుకోగలదా!

**స్వదేశంలో అప్రతిహతంగా సాగుతున్న భారత జైత్రయాత్రకు అడ్డుకట్ట వేసేందుకు ఈసారి వెస్టిండీస్ ప్రయత్నించాలనుకుంటోంది. అయితే అన్ని విభాగాల్లోనూ భీకర ఫామ్‌తో కనిపిస్తుండడమే కాకుండా, పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతున్న కోహ్లీ సేన మూడు టీ20ల సిరీస్‌ను గెల్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రయోగాలు చేస్తున్న భారత జట్టులో రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ తమ స్థానాలను పటిష్ఠం చేసుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు ధనాధన్ ఫార్మాట్‌లో వీర బాదుడుకు పేరున్న విండీస్ వీరులు ఈసారైనా తమ సత్తా చాటతారా.. అనేది చూడాల్సిందే.. అలాగే శుక్రవారం బ్లాక్ డే (డిసెంబరు 6) నేపథ్యంలో ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ కోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.**



పొలార్డ్



విరాట్ కోహ్లీ

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** వన్డే వరల్డ్‌కప్ ముగిసిన వెంటనే భారత జట్టు వెస్టిండీస్‌లో పర్యటించి మూడు ఫార్మాట్లను ఓటమి లేకుండా ముగించింది. ఇప్పుడు మూడు టీ20లు, మూడు వన్డేల కోసం విండీస్ జట్టు భారత పర్యటనకు వచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో తొలి టీ20 జరగనుంది. ఈ సారి కూడా టీమిండియానే ఫేవరెట్‌గా బరిలోకి దిగబోతోంది. అలాగే వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు ఇంకా తుది జట్టు ఖరారు కానందున యువ ఆటగాళ్లకు ఈ సిరీస్ మరోసారి ఉపయోగపడనుంది. అయితే ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చివరి 14 మ్యాచ్‌ల్లో భారత్ ఏడుసార్లు లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఇక టీ20ల్లో ప్రపంచ చాంపియన్ అయిన విండీస్ ప్రస్తుతం పదో ర్యాంకులో ఉంది. ఈ నేపథ్యంలో పటిష్ఠ భారత్‌కు ఏమేర పోటీనిస్తుందో వేచి చూడాల్సిందే.

**రాహుల్, పంత్‌పైనే దృష్టి:** టీ20ల్లో మెరుగైన రికార్డున్న కేఎల్ రాహుల్‌కు ఈ సిరీస్ నిజంగా చక్కటి అవకాశం. రెగ్యులర్ ఓపెనర్ శిఖర్ ధవన్ గాయంతో జట్టుకు దూరం కావడంతో రోహిత్‌కు జతగా రాహుల్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇటీవలి సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ ఫామ్‌ను కనబర్చడం అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇక తీవ్ర ఒత్తిడిలో ఉన్న వికెట్ కీపర్ రిషభ్ పంత్ సత్తా నిరూపించుకుని విమర్శకులకు సమాధానం చెప్పాల్సి ఉంది. బ్యాటింగ్, కీపింగ్ పరంగా అతడు పేలవ ప్రదర్శన కొనసాగిస్తున్నాడు. నిర్లక్ష్యపు షాట్లకు తోడు క్యాచ్‌లను వదిలేయడం అతడికి ప్రతికూలంగా మారింది. అటు రిజర్వ్ ఓపెనర్‌గా జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్ బెర్త్ కోసం సిద్ధంగా ఉన్నాడు. బంగ్లాతో సిరీస్‌లో జట్టులో చోటు దక్కినా శాంసన్‌కు ఆడే అవకాశం రాలేదు. అందుకే పంత్ ఒక వేళ విఫలమైతే.. ఈ కేరళ కీపర్, బ్యాట్స్‌మన్‌ను ఆడించవచ్చు. ఇదిలావుండగా కెప్టెన్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టు పగ్గాలు చేపట్టడంతో బ్యాటింగ్‌విభాగం అత్యంత బలీయంగా మారింది.

**బౌలింగ్ భళా!:** బౌలింగ్ విభాగంలో కుల్దీప్, షమి, గాయం నుంచి కోలుకున్న భువనేశ్వర్ పునరాగమనం చేశారు. అలాగే చాలా రోజుల తర్వాత చాహల్, కుల్దీప్ టీ20 జట్టులో కనిపిస్తున్నారు. కుల్దీప్ చివరిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరిలో కివీస్‌పై ఆడగా, షమి 2017లో తన చివరి టీ20 ఆడాడు. భువీ, దీపక్ చాహర్ పేస్ బాధ్యతలు తీసుకోనుండగా స్పిన్నర్లుగా జడేజా, చాహల్ ఆడే అవకాశం ఉంది.

**ప్రతీకారం కోసం విండీస్:** సొంత గడ్డపై భారత్ చేతిలో మూడు టీ20ల సిరీస్‌ను 0-3తో ఓడిన విండీస్ ప్రతీకారం కోసం చూస్తోంది. నిజానికి కొన్ని రోజులుగా ఈ జట్టు భారత్‌లోనే ఉంది. లఖ్‌నవ్‌లో అఫ్ఘానిస్థాన్‌పై మూడు టీ20లు ఆడి 1-2తో సిరీస్ కోల్పోయింది. దాంతో ఇక్కడి పరిస్థితులకు వారు బాగానే అలవాటు పడ్డారు. కీరన్ పొలార్డ్ నేతృత్వంలోని ఈ జట్టులో స్టార్ బ్యాట్స్‌మన్ నికోలస్ పూరన్‌పై బాల్ ట్యాంపరింగ్ నిషేధం కొనసాగుతోంది. ఫలితంగా ఈ మ్యాచ్‌కు అతడు దూరం కావడంతో ఇవాన్ లూయిస్, సిమ్మన్స్, హెట్‌మయెర్‌లపైనే బ్యాటింగ్ విభాగం ఆధారపడి ఉంది. టీమ్‌లో ఐదుగురు కొత్త ఆటగాళ్లకు చోటిచ్చారు.

### జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, రాహుల్, కోహ్లీ (కెప్టెన్), శ్రేయాస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్, శివమ్ దూబే, జడేజా, చాహల్, దీపక్ చాహర్, భువనేశ్వర్ కుమార్.

**విండీస్:** సిమ్మన్స్, లూయిస్, బ్రాండన్ కింగ్, హెట్‌మయెర్, పొలార్డ్ (కెప్టెన్), రామ్‌దిన్, హోల్డర్, ఫాబియెన్ అలెన్, హేడెన్ వాల్ష్ జూనియర్, షెల్డన్ కాట్రెల్.

### పిచ్, వాతావరణం

సహజంగానే ఉప్పల్ వికెట్ బౌలర్లకు అనుకూలంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో భారీ స్కోర్లు కూడా నమోదయ్యాయి. ఈ మ్యాచ్ కోసం కూడా బ్యాటింగ్ పిచ్‌ను తయారుచేశారు. ఏడాదిన్నరగా ఇక్కడి తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 162గా ఉంది. మ్యాచ్ రోజు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండవచ్చు.

**అంతర్జాతీయ క్రికెట్‌లో 400 సిక్సర్లు కొట్టిన తొలి భారత క్రికెటర్‌గా నిలిచేందుకు రోహిత్ శర్మ కేవలం ఒక సిక్స్ దూరంలో ఉన్నాడు. క్రిస్ గేల్ (534), షాహిద్ అఫ్రీది (476) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.**

**ఉప్పల్ మైదానంలో జరుగుతున్న రెండో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఇది. గతంలో 2017, అక్టోబరులో ఆస్ట్రేలియాతో మ్యాచ్.. అవుట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడంతో రద్దయింది.**

## నోబాల్ ఇక థర్డ్ అంపైర్ చేతుల్లో..

**దుబాయ్:** భారత్-విండీస్ జట్ల మధ్య జరగబోయే టీ20, వన్డే సిరీస్‌ల్లో నోబాల్స్‌పై టీవీ అంపైర్ నిర్ణయం తీసుకుంటాడని ఐసీసీ ప్రకటించింది. ఇటీవలి కాలంలో ఫీల్డ్ అంపైర్లు నోబాల్స్‌ను గుర్తించడంలో తరచూ విఫలమవుతుండడం విమర్శలకు తావిస్తోంది. ఈనేపథ్యంలో ఐసీసీ ప్రయోగాత్మకంగా ఈ సిరీస్‌లో థర్డ్ అంపైర్ ద్వారా నోబాల్స్‌ను తేల్చాలనుకుంటోంది. 'ప్రతీ బంతిని పరిశీలించడంతో పాటు ఫ్రంట్ ఫుట్ నోబాల్‌ను గుర్తించే బాధ్యత కూడా థర్డ్ అంపైర్‌పైనే ఉంటుంది. ఒకవేళ నోబ్ అని తేలితే వెంటనే అతడు ఫీల్డ్ అంపైర్‌కు సమాచారమిస్తాడు. ఒకవేళ థర్డ్ అంపైర్ నుంచి నోబాల్ ప్రకటన ఆలస్యమైతే బ్యాట్స్‌మన్ అవుట్‌ను ఫీల్డ్ అంపైర్లు వెనక్కి తీసుకుంటారు' అని ఐసీసీ స్పష్టం చేసింది.

## నా బయోపిక్‌లో హృతిక్ నటించాలి





**కోల్‌కతా :** బాలీవుడ్‌లో ఆటగాళ్ల జీవితచరిత్రలతో సినిమాలు తీసే పరంపర మొదలైంది. మేరీకోమ్, మిల్కాసింగ్, ధోనీల బయోపిక్‌లు విడుదలై చక్కటి విజయాలు అందుకోగా..ప్రస్తుతం 1983 వరల్డ్ కప్ గెలిచిన కపిల్ బృందం బయోపిక్ తెరకెక్కుతోంది. ఇక..తన జీవిత చరిత్రపై చిత్రం రావాలన్న ఆకాంక్షను టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ చీఫ్ సౌరవ్ గంగూలీ వెలిబుచ్చాడు. అంతేకాదు ఇందులో తన ఫేవరెట్ హీరో హృతిక్ రోషన్ నటించాలని కూడా అభిప్రాయపడ్డాడు. 'హృతిక్ నా ఫేవరెట్ నటుడు. పైగా నాకెంతో దగ్గరివాడు కూడా. బయోపిక్‌లో నా రోల్‌ను హృతిక్ పోషించాలని కోరుకుంటున్నా' అని ఓ టాక్ షోలో దాదా చెప్పాడు.

## పాక్ టీమ్‌లో వర్గపోరు..!

ఇంజమామ్

**కరాచీ:** పాకిస్థాన్ టీమ్‌పై ఆ దేశ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పాక్ టీమ్‌లో వర్గ విభేదాలు నెలకొన్నాయని తాను భావిస్తున్నానన్నాడు. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో 0-2తో పాక్ వైట్‌వాష్ అనంతరం ఇంజీ కామెంట్స్ ఆసక్తిరేపుతున్నాయి. సమస్యలను పరిష్కరించుకోవాలని, లేకుంటే పాకిస్థాన్ క్రికెట్ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించాడు. కాగా పాకిస్థాన్ క్రికెట్ చీఫ్ సెలెక్టర్‌గా కూడా పనిచేసిన ఇంజీ పదవీకాలం ఇటీవలే ముగిసిన సంగతి తెలిసిందే.

## పేస్ విభాగంలో ఒక్క ఖాళీనే..!



**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్ కోసం భారత పేస్ దళంలో ఒక్క స్థానం మాత్రమే ఖాళీగా ఉందని కోహ్లీ చెప్పాడు. బుమ్రా, షమి, భువనేశ్వర్‌లకు జట్టులో చోటు ఖాయమనే సంకేతాలిచ్చాడు. 'ఒక్క స్థానం మాత్రమే ఖాళీగా ఉంది. ముగ్గురు మాత్రం తమ స్థానాలను ఖరారు చేసుకున్నారు. ఆరోగ్యకరమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో ఆ ఒక్క చాన్స్ ఎవరి దక్కుతుందో ఆసక్తికరమ'ని కోహ్లీ అన్నాడు. టీ20ల్లో తక్కువ స్కోర్లను కాపాడుకోవడంలో టీమిండియా బలహీనంగా ఉందని విరాట్ అంగీకరించాడు. కాగా వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు కోహ్లీ మద్దతు ప్రకటించాడు. 'పంత్ సత్తా ఏమిటో మాకు తెలుసు. అతనికి మా మద్దతు ఉంటుంది. పంత్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉంది' అని కోహ్లీ అన్నాడు.

## శ్రీలంక కోచ్‌గా మిక్కీ ఆర్థర్



**కొలంబో:** శ్రీలంక కొత్త కోచ్‌గా దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు మిక్కీ ఆర్థర్ నియమితుడయ్యాడు. రెండేళ్లపాటు అతడు కోచ్‌గా కొనసాగేందుకు శ్రీలంక క్రికెట్ ఒప్పందం చేసుకుంది. వరల్డ్‌కప్‌లో లంక పేలవ ప్రదర్శనతో మొత్తం కోచింగ్ సిబ్బందిని ఆ దేశ బోర్డు ప్రక్షాళన చేసింది. బ్యాటింగ్ కోచ్‌గా గ్రాంట్ ఫ్లవర్, బౌలింగ్ కోచ్‌గా ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ సకర్, ఫీల్డింగ్ కోచ్‌గా షేన్ మెక్ డెర్మాట్‌ను నియమించినట్టు లంక క్రికెట్ కార్యదర్శి మోహన్ డిసిల్వా చెప్పారు. మిక్కీ ఆర్థర్ దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ జట్లకు కోచ్‌గా పని చేశాడు.

## ఆసీస్‌ను నిలువరించిన భారత్

**కాన్‌బెర్రా:** మూడు దేశాల హాకీ టోర్నీలో ఆతిథ్య ఆస్ట్రేలియాను భారత మహిళల జూనియర్ టీమ్ నిలువరించింది. గురువారం జరిగిన మ్యాచ్‌ను భారత్ 1-1తో ఆస్ట్రేలియాతో డ్రా చేసుకుంది. స్కోనెల్ కొట్నీ (25వ నిమిషం) గోల్ చేసి ఆసీస్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపింది. అయితే, 52వ నిమిషంలో గగన్‌దీప్ కౌర్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచి 1-1తో స్కోరు సమం చేసింది.

## ఒక్కరోజే 56 పతకాలు

● భారత అథ్లెట్ల హవా
● దక్షిణాసియా క్రీడలు



గాయత్రి

**ఖాట్మండు:** స్విమ్మర్లు, ఉషు అథ్లెట్లు పతకాల పంట పండించడంతో దక్షిణాసియా క్రీడల్లో భారత గురువారం ఒక్క రోజే భారత్ ఏకంగా 56 పతకాలను సొంతం చేసుకుంది. నాలుగో రోజు పోటీలు ముగిసే సరికి భారత్ 62 స్వర్ణ, 41 రజత, 21 కాంస్యాలతో మొత్తం 124 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఉషు, స్విమ్మింగ్‌లో ఏకంగా ఏడేసి స్వర్ణాలు సొంతం చేసుకుంది. వెయిట్ లిఫ్టింగ్‌లో 4 పసిడి పతకాలు, తైక్వాండోలో 3 స్వర్ణ, 2 రజత, ఓ కాంస్యంతో కలిపి 6 మెడల్స్ లభించాయి.

**రెండు స్వర్ణాలు ఖరారు..:** భారత షట్లర్లు మరో రెండు స్వర్ణాలు ఖాయం చేశారు. మహిళల సింగిల్స్‌లో సహచర ప్లేయర్లు పుల్లెల గాయత్రి, అస్మిత చెలిహా ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నారు. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు సిరిల్ వర్మ, ఆర్యమన్ టాండన్ మధ్య ఫైనల్ ఫైట్ జరగనుంది. మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో ధ్రువ్-జక్కంపూడి మేఘన జోడీ 21-14, 21-13తో నేపాల్ జంట బికాశ్ శ్రేష్ఠ-అనుమాయపై గెలిచి స్వర్ణ పోరుకు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి-మేఘన జక్కంపూడి జోడీ 14-21, 18-21తో శ్రీలంక ద్వయం తిలిని హండెహవా-సిరిమన్నగె చేతిలో పరాజయం పాలైంది.

## చరిత్ర సృష్టించనున్న లక్ష్మి



### పురుషుల వన్డేకు రెఫరీ బాధ్యతలు

**దుబాయ్:** తెలుగు మహిళ గండికోట సర్వ లక్ష్మి (జీఎస్ లక్ష్మి) చరిత్ర సృష్టించబోతోంది. పురుషుల వన్డే మ్యాచ్‌కు రెఫరీగా బాధ్యతలు నిర్వర్తించనున్న మహిళగా లక్ష్మి (51) రికార్డు పుటలకెక్కనుంది. ఐసీసీ పురుషుల వరల్డ్‌కప్ లీగ్-2 మూడో సిరీస్ తొలి మ్యాచ్‌కు ఆమె రెఫరీగా వ్యవహరించనుంది. ఈనెల 8న యూఏఈ-అమెరికా జట్ల మధ్య షార్జా క్రికెట్ స్టేడియంలో ఈ పోరు జరగనుంది. గత ఏడాదే ఆమె ఐసీసీ మ్యాచ్ రెఫరీ ప్యానెల్‌లో చోటు దక్కించుకుంది. తద్వారా ఈ ఘనత దక్కించుకొన్న తొలి మహిళగా ఖ్యాతి గడించింది. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ జెఫ్ క్రోతో కలిసి ఈ ఏడాది పురుషుల టీ20 వరల్డ్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌కు అఫీషియల్‌గా బాధ్యతలు నిర్వహించింది. 2008-09లో మహిళల దేశవాళీ టోర్నీ ద్వారా మ్యాచ్ రెఫరీ కెరీర్‌ను లక్ష్మి ప్రారంభించింది. అప్పటినుంచి ఆమె మూడు మహిళా వన్డేలు, ఏడు టీ20లు, 16 పురుషుల టీ20లకు రెఫరీగా వ్యవహరించింది. కాగా పురుషుల వన్డేకు మ్యాచ్ రెఫరీగా వ్యవహరించనుండడం గొప్ప అనుభూతని లక్ష్మి చెప్పింది. తనను చూసి పలువురు మహిళలు రెఫరీ బాధ్యతల్లోకి వస్తారనుకుంటున్నానని ఆమె చెప్పుకొచ్చింది.

## మైదానంలో మేజిక్!





**పార్ల్ (దక్షిణాఫ్రికా):** బ్యాట్స్‌మెన్‌ను అవుట్ చేసినప్పుడల్లా దక్షిణాఫ్రికా స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ మైదానమంతా చుట్టేసి రావడం అభిమానులు చూసిందే.. అలాగే విండీస్ పేసర్ షెల్డన్ కాట్రెల్ అయితే వికెట్ తీశాక ఏకంగా మార్చ్ పాస్ట్‌తో పాటు సెల్యూట్ చేసి అదరగొడతాడు. కానీ సఫారీ స్పిన్నర్ తబ్రెయిజ్ షంసీ రూటే సెపరేటు.. ఇప్పటిదాకా క్రికెట్ ఫీల్డ్‌లో మనమెవరూ చూడని మేజిక్ ట్రిక్‌తో వినూత్నంగా సంబరాలు చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న జాన్సీ లీగ్‌లో పార్ల్ రాక్స్ తరపున ఆడుతున్న షంసీ డర్బన్ హీట్ ఆటగాడు విహాబ్ లుబే వికెట్ పడగొట్టాడు. వెంటనే తన జేబులోంచి ఓ కర్చీఫ్‌లాంటి ఎరుపు వస్త్రాన్ని తీసిన అతడు దాన్ని సన్నటి పొడుగాటి స్టిక్‌లా మార్చేసి అబ్బురపరిచాడు. అయితే షంసీకి ఇలాంటి ట్రిక్స్ చేయడం అలవాటే. గతేడాది డిసెంబరుతో పాటు కిందటి నెల ఇదే లీగ్‌లోనూ క్లాత్‌ను స్టిక్‌లా మార్చాడు. అలాగే పేక ముక్కలతోనూ పలు మేజిక్ ట్రిక్స్‌తో షంసీ ఆశ్చర్యపరుస్తుంటాడు.

## నేటి నుంచి విశాఖ వన్డే టికెట్ల విక్రయాలు

18న మ్యాచ్

**విశాఖపట్నం (స్పోర్ట్స్) :** భారత్, వెస్టిండీస్ మధ్య ఈనెల 18న జరగనున్న వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయాలు శుక్రవారం మొదలవనున్నాయి. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఈవెంట్స్‌నౌ.కామ్ వెబ్‌సైట్ ద్వారా టికెట్ల అమ్మకాలు చేపడుతున్నారు. టికెట్ల ధరలను రూ.500, రూ.1200, రూ.1600, రూ.4000, రూ.5000గా నిర్ణయించారు. కాగా ఈ మ్యాచ్ కోసం ఇరుజట్ల ఆటగాళ్లు 16న నగరానికి చేరుకుంటారు. 16న విశ్రాంతి తీసుకుని 17వ తేదీన ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏసీఏ-వీడీసీఏ బి స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ చేస్తారు.

## 'టాప్స్'నుంచి నీరజ్ అవుట్

**న్యూఢిల్లీ:** డోపింగ్‌లో దొరికిపోయిన మహిళా బాక్సర్ నీరజ్ ఫొగట్‌ను 'టార్గెట్ ఒలింపిక్ పోడియం' పథకం నుంచి తప్పించారు. ఇక..2020 ఒలింపిక్ బెర్త్ దక్కించుకోవడంలో కీలక భూమిక పోషించిన ఆర్చర్ దీపికా కుమారికి ఈ పథకంలో చోటు కల్పించారు. ఈ మేరకు క్రీడా మంత్రిత్వ శాఖ గురువారం నిర్ణయం తీసుకుంది. అలాగే షూటర్ చింకీ యాదవ్, వెటరన్ షూటర్ తేజస్విని సావంత్‌తోపాటు ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, మైరాజ్ అహ్మద్‌ఖాన్‌లకు కూడా 'టాప్స్'లో స్థానం కల్పించారు. వరల్డ్ మాజీ నెంబర్ వన్ దీపికతో పాటు అంకిత్ భక్త్, వెటరన్ బొంబ్యాలాదేవి సైతం ఈ పథకంలో చోటు దక్కించుకున్నారు. ఇక..ఆట తీరు దిగజారిన షూటర్లు రవికుమార్, ఓం ప్రకాశ్ మిథర్‌వాల్‌లను 'టాప్' పథకం నుంచి తప్పించారు.



ఐపీఎల్ వేలం నుంచి

## తప్పుకొన్న ముష్ఫికర్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ వేలం నుంచి బంగ్లాదేశ్ వెటరన్ ముష్ఫికర్ రహీమ్ తప్పుకొన్నాడు. ఐపీఎల్-2020 కోసం ఈ నెల 19న ఆటగాళ్ల వేలం జరగనుంది. గతంలో రెండుసార్లు ముష్ఫికర్ పేరు వేలానికి వచ్చినా అమ్ముడు పోలేదు. కాగా బంగ్లానుంచి ఆరుగురు ఆటగాళ్లు వేలంలో అందుబాటులో ఉన్నారు.







Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.